www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
ప్రజా విశ్వంభర
RNI No : TGTEL/25/A1676
అక్షరం సాక్షిగా..
గురువారం
20-08-2026
సంపుటి : 02 | సంచిక : 38 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
CMD

## అత్యంత పకడ్బందీగా నీట్ పరీక్షల వ్యవస్థ



**ప్రశ్నపత్రాల వాహనంలో జీపీఎస్**

**సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం**

విశ్వంభర, నేషనల్ బ్యూరో: వైద్య విద్యలో ప్రవేశాలకు నిర్వహించే నీట్? పరీక్షల నిర్వహణ, భద్రతపై సుప్రీంకోర్టు మరోసారి దృష్టి సారించింది. పరీక్షల విధానంలో సంస్కరణలు కాగితాలకే పరిమితం కాకుండా, వాటిని శాశ్వత వ్యవస్థగా అమలు చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. రాధాకృష్ణన్ కమిటీ, నందన్ నీలేకని కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేసేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలు సమర్పించాలని

2లో

# జెన్ జీపై మోడీ సర్కార్ ఫోకస్

**ప్రతి రోజూ ఓ యూనివర్సిటీకి ఒక కేంద్ర మంత్రి!**

**నీట్ పేపర్ లీక్ నిరసనల నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం**

**వన్ డే వన్ యూనివర్సిటీ పేరుతో సరికొత్త మాస్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌కు ప్లాన్**

**యువత సవాళ్లు, ఆకాంక్షల్ని నేరుగా తెలుసుకోనున్న మోడీ ప్రభుత్వం**



విశ్వంభర, నేషనల్ బయూరో: దేశంలోని యువతీయువకులను (జెన్ జీ)ని ఆకట్టుకునేందుకు, వారికి మరింత దగ్గరయ్యేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా దేశంలోని యూనివర్సిటీలకు ప్రతి రోజూ ఒక కేంద్ర మంత్రిని పంపించాలని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం యోచిస్తోంది. 'వన్ డే, వన్ యూనివర్సిటీ' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులతో మంత్రులు నేరుగా మాట్లాడి, వారి అభిప్రాయాలు, సమస్యలు, దేశానికి సంబంధించిన వివిధ అంశాలపై వారి ఆలోచనలను తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా కేవలం ప్రభుత్వ పథకాల్ని ప్రచారం చేయడం మాత్రమే కాకుండా, యువత ఏమనుకుంటున్నారు?, వారి ప్రధాన సమస్యలు ఏంటి? దేశంలో జరుగుతున్న పరిణామాలపై వారి అభిప్రాయాలు ఎలా ఉన్నాయి? వంటి అంశాల్ని తెలుసుకోవడంపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. విద్యార్థులకు ముఖ్యంగా యువత కోసం అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవకాశాల్ని కూడా కేంద్ర మంత్రులు వివరించనున్నారు. విద్యార్థుల కోపాన్ని తగ్గించి, వారితో నేరుగా మాట్లాడేందుకే ఈ కొత్త ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంపై చర్చ జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి.ఇటీవల దేశవ్యాప్తంగా నీట్ సహా

2లో

## 'శక్తి'తో బీటెక్ చదివే అవకాశం కోల్పోతున్నాం

**పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన**

**జీవో నం 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్**

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: శక్తి స్కీం పేరుతో పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో తమ భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుందని, జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. విలీన ప్రక్రియతో పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్?లో చేరే లేటరల్ ఎంట్రీ విధానానికి స్వస్తి పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ నగరంలోని రాయదుర్గం మాసబ్ ట్యాంక్, లెదర్ టెక్నాలజీ కళాశాల, సికింద్రాబాద్, రామాంతాపూర్ సహా నగరంలోని ఇతర పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాలు చేపట్టారు.విద్యార్థులు, అధ్యాపకులు, సాంకేతిక విద్యానిపుణులతో విస్తృతంగా చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలతో వేలాది మంది విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వారు వాపోయారు. పాలిటెక్నిక్ కళాశాలలను యథావిధిగా సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని కోరారు.

2లో

## 27 సార్లు కత్తితో పొడిచి చంపారు

- ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- డబ్బు కోసమే నిందితులు ఘాతుకానికి పాల్పడినట్లు వెల్లడి
- రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం
- దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం
- ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం
- వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం
- కీలక విషయాలు వెల్లడించిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్



విశ్వంభర, నల్లగొండ: సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. "రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు

2లో

## 8 జిల్లాలు.. 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు

- బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో 410 కి.మీ. మేర అదనపు రైల్వే లైన్లు
- ఎనిమిది జిల్లాల్లోని 6,448 గ్రామాలకు రవాణా అనుసంధానాన్ని మెరుగుపరుస్తాయి
- రూ.9,450 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం
- 2030-31 నాటికి ఈ కొత్త రైల్వే లైన్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యమన్న రైల్వేశాఖ
- బీహార్ లోని ఎన్‌హెచ్-22 విస్తరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్




విశ్వంభర, నేషనల్ బ్యూరో: దేశంలో రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ, రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటి మొత్తం అంచనా వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. అదే సమయంలో బిహార్‌లోని ముజఫర్‌పూర్–సీతామఢి–సోన్‌బర్సా మార్గాన్ని నాలుగు లేన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేసేందుకు మరో రూ.3,590.73 కోట్ల ప్రాజెక్టుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.కొత్తగా ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టులతో భారత రైల్వే నెట్‌వర్క్‌లో సుమారు 410 కిలోమీటర్ల మేర అదనపు లైన్లు అందుబాటులోకి రానున్నాయి. 2030–31 నాటికి

2లో

## 27 నుంచి ఇందిరమ్మ ఇండ్ల లాటరీ

- లాటరీలో పేర్లు వచ్చిన వారికి ఎల్ఐజీ ఫ్లాట్లు కేటాయింపు
- రోజుకు 4 నియోజకవర్గాల చొప్పున లాటరీ తీయనున్నాం
- 20 వ తేదీ సాయంత్రం నుంచి ఆన్ లైన్ లో అర్హుల జాబితా
- 23 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 25న అర్హుల తుది జాబితా ప్రకటిస్తాం
- హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్

విశ్వంభర, హైదరాబాద్ : అవుటర్ రింగ్ రోడ్ క్యూర్ పరిధిలో ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లో ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియను ఈ నెల 27 వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి గౌతం తెలిపారు. ప్రతి రోజు నాలుగు నియోజకవర్గాల చొప్పున వరుసగా నాలుగు రోజుల పాటు 30 వ తేదీ వరకు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నామని వివరించారు. క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లను నిర్మించాలన్న లక్ష్యంలో భాగంగా , పైలట్ ప్రాజెక్టు కింద 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,340 ఇండ్ల కోసం డిమాండ్ సర్వే పేరుతో హౌసింగ్ బోర్డు దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. గడవు ముగిసే సమయానికి మీసేవా కేంద్రాలతోపాటు, ఆన్ లైన్ లోనూ, వాట్సాప్ మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలన జరుగుతున్నదన్నారు. దరఖాస్తు దారులు హైదరాబాద్ లో స్థిర



నివాసముంటున్నారా లేదా, ఓఆర్ ఆర్ లోపల వారికి ప్లాట్ , ఫ్లాట్ వంటివి ఉన్నాయా , మొదలైన వివరాలను పరిశీలించి తుది జాబితాను రూపొందిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు దారుల వివరాలను గురువారం సాయంత్రం నుంచి https://ts.meeseva.telangana.gov.in/, tghb.cgg.gov.in, tghb.telangana.gov.in ద్వారా ఆన్ లైన్ లో అందుబాటులో ఉంచనున్నామని పేర్కొన్నారు. ఈ జాబితాలోని వివరాలపై ఏమైనా అభ్యంతరాలుంటే 23 వ తేదీ

2లో

## ఆయుష్ వైద్య విద్యార్థుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

**స్టైఫండ్ విషయంలో తీవ్ర వివక్ష చూపడం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం**

**బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు**

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ప్రజారోగ్య పరిరక్షణలో అల్లోపతి వైద్యులతో సమానంగా అహర్నిశలు సేవలందిస్తున్న ఆయుష్ వైద్య విద్యార్థులకు స్టైఫండ్ విషయంలో తీవ్ర వివక్ష చూపడం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచంరదర్ రావు విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిరిగానే ఆయుష్ పీజీ వైద్యులు, హౌస్ సర్జన్లకు అల్లోపతితో సమానంగా స్టైఫండ్‌ను పెంచి, పెండింగ్ ఎరియర్స్‌తో సహా వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ డాక్టర్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఢ ఆసుపత్రి ప్రాంగణంలో స్టైఫండ్ పెంపు కోరుతూ గత 16 రోజులుగా నిరసన తెలుపుతున్న ఆయుష్ (ఆయుర్వేద, యునాని, హోమియోపతి) పీజీ వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్ల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎన్. రాంచందర్ రావు సందర్శించి, వారికి బీజేపీ తరపున సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ప్రజారోగ్య రక్షణలో కీలక సేవలందిస్తున్న ఆయుష్ వైద్య విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, పెండింగ్‌లో ఉన్న స్టైఫండ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ... ఆయుర్వేద, యునాని, హోమియోపతి వంటి భారతీయ వైద్య విధానాల్లో సేవలందిస్తున్న పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లకు గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు స్టైఫండ్ పెంచకుండా అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006 నాటి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం భారతీయ వైద్య రంగం (ఆయుష్), అల్లోపతి వైద్య విద్యార్థులను సమానంగా చూడాలనే నిబంధన ఉందని గుర్తు చేశారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, 2016 నుంచి ఈ స్టైఫండ్లను నిలిపివేయడం శోచనీయమన్నారు. అల్లోపతి వైద్య విద్యార్థుల మాదిరిగానే ఆయుష్ పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లు, ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారికి సమానంగా స్టైఫండ్లు చెల్లించాలని న్యాయస్థానాలు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయని ఆయన పేర్కొన్నారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ పీజీ విద్యార్థులకు నెలకు రూ. 60 వేలు, హౌస్ సర్జన్లకు రూ. 25 వేలు చొప్పున స్టైఫండ్ చెల్లిస్తుంటే, తెలంగాణలో మాత్రం పీజీ విద్యార్థులకు కేవలం రూ. 30 వేలు, హౌస్ సర్జన్లకు రూ. 13 వేలు మాత్రమే ఇవ్వడం తీవ్ర వివక్షాపూరితమని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రత్యేకంగా 'ఆయుష్' మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, అన్ని వైద్య విభాగాలను సమానంగా ప్రోత్సహిస్తూ వైద్య విద్యకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. పొరుగు రాష్ట్రం అమలు చేస్తున్న నిబంధనలను తెలంగాణలో ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. భావి భారత వైద్య రంగానికి మూలస్తంభాలైన విద్యార్థులు తమ న్యాయమైన హక్కుల కోసం 16 రోజులుగా దీక్షలు చేస్తుంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ల్యాండ్ మాఫియా, భూ ఆక్రమణలపైనే దృష్టి

2లో

## ప్రజల వద్దకే పాలన

- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం
- సమస్య పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షణ
- హౌస్ అరెస్టులపై బీఆర్ఎస్ నేతల మాటలు సిగ్గుచేటు
- 2014-2023లో ప్రతిపక్ష నేతలను ఇంటి నుంచి బయటకు రానిచ్చారా?
- నాడు నిర్బంధాలు.. నేడు ప్రజల వద్దకే పాలన
- ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



విశ్వంభర, హైదరాబాద్: ప్రజా సమస్యలను నేరుగా విని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమం, సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు.బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన 'ప్రజలతో ముఖాముఖి'

2లో

# జెన్ జీపై మోడీ సర్కార్ ఫోకస్

ఇతర ప్రధాన ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం కలకలం రేపింది. తర్వాత దిల్లీలోని జంతర్ మంతర్ సహా అనేక ప్రాంతాల్లో విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా జులై 20న ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్ తీవ్ర విమర్శలకు దారితీసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కూడా ప్రతిపక్షాలు ఈ అంశంపై నిరసనలు తెలిపాయి. ఈ వివాదాల నడుమ జులై 25న ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే యువతలో నెలకొన్న అసంతృప్తిని తొలగించి, వారిలో నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.ఇంకా ఈ వన్ డే వన్ యూనివర్సిటీ ఇనిషియేటివ్‌ను సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇద్దరు మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ- విశ్వవిద్యాలయాలు, ఇతర కేంద్ర మంత్రుల్ని సమన్వయం చేయనున్నారు. కేటాయించిన రోజున ఒక కేంద్ర మంత్రి వర్సిటీకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడతారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ లెక్కల ప్రకారం దేశంలో 57 కేంద్ర విశ్వవిద్యాలయాలు, 522 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు సహా మొత్తం 1300 కంటే ఎక్కువ యూనివర్సిటీలు ఉన్నాయి.

### యువతరంవైపే ప్రధాని దృష్టి..

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల యువతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. నిరసనల సమయంలో విద్యార్థులు, యువతను ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా పలుమార్లు సందేశాలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనూ యువత కోసం పలు కొత్త కార్యక్రమాల్ని ప్రకటించారు. ఉచిత ఆన్‌లైన్ కోచింగ్, ఏఐ స్కిల్లింగ్ ప్రోగ్రామ్, క్రీడల్లో యువత ప్రతిభను గుర్తించే కార్యక్రమం వంటి అంశాల్ని ప్రస్తావించారు.

### కేంద్ర మంత్రుల సోషల్ మీడియా పనితీరుపైనా సమీక్ష..

ఇదే సమయంలో యువత, జెన్‌జీకి మరింత చేరువయ్యేందుకు సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకోవాలని కేంద్ర మంత్రులకు ప్రభుత్వం సూచించింది. ప్రధాని అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో కేంద్ర మంత్రుల సోషల్ మీడియా పనితీరు, వారి పోస్టులకు వస్తున్న రీచ్‌పై చర్చ జరిగినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ రీచ్ ర్యాంకింగ్స్‌లో మోదీ అగ్రస్థానంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంత్రుల సోషల్ మీడియా పోస్టులు ఎంత మందికి చేరుతున్నాయి, వాటి ద్వారా ఏ మేర ప్రజల్ని చేరుకోగలుగుతున్నారనే అంశాలపై సమావేశంలో సమీక్ష జరిగినట్లు సమాచారం. యువతకు ప్రభుత్వ సందేశాలు మరింత విస్తృతంగా చేరేలా మంత్రులు తమ సోషల్ మీడియా రీచ్ పెంచుకోవాలని కూడా సూచించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.



# ‘శక్తి’తో బీటెక్ చదివే అవకాశం కోల్పోతున్నాం

శక్తి విధానాన్ని తీసుకురావడాన్ని నిరసిస్తూ మాసబ్?ట్యాంక్? పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. డిప్లొమా చదివే విద్యార్థులకు శక్తి విధానం అమలు చేస్తే భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివేందుకు ఆస్కారం ఉండదని, చిన్న ఉద్యోగాలకే తాము పరిమితమయ్యే పరిస్థితి నెలకొంటుందని విద్యార్థులు వాపోయారు.

### జీవో నంబర్ 97పై పోరాటం..

జీవో-97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాయదుర్గంలోని ప్రభుత్వ లెదర్ టెక్నాలజీ కళాశాల వద్ద విద్యార్థులు భారీ ఆందోళన చేపట్టారు. కళాశాల ఎదుట సుమారు 200 మంది విద్యార్థులు నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. “శక్తి డౌన్ డౌన్”, “జీవో-97 రద్దు చేయాలి”, “పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి” అంటూ ఆందోళనకారులు పెద్దఎత్తున నినదించారు. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో వేలాది మంది విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది.

### పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి..

ఈస్ట్ మారేడుపల్లిలో విద్యార్థుల ఆందోళనకు అఖిల భారత విద్యార్థి పరిషత్ మద్దతు ప్రకటించింది. పాలిటెక్నిక్ విద్య కేవలం నైపుణ్య శిక్షణకు పరిమితమైన వ్యవస్థ కాదని, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నిపుణులను తయారు చేసే ప్రత్యేక సాంకేతిక విద్యా వ్యవస్థ అని అన్నారు.

### కలెక్టర్ కార్యాలయం ముట్టడి..

జీవో నెంబర్ 97ని వెంటనే రద్దు చేయాలంటూ డి.ఎస్.ఎఫ్.ఐ అధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంను ముట్టడించారు. విద్యార్థులు లోనికి వెళ్లకుండా పోలీసులు కలెక్టరేట్ గేట్లు మూసి వేసి భారీకేడ్లు పెట్టారు. విద్యార్థులను అడ్డుకోవడంతో వారి మధ్య తోపులాట చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పాలిటెక్నిక్ తమ భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మేడ్చల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు డివైఎఫ్?ఐ విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి మేడ్చల్ బస్ డిపో వద్ద ధర్నా నిర్వహించారు.




# 27 సార్లు కత్తితో పొడిచి చంపారు

70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది. నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం” అని ఎస్పీ వివరించారు.

# అత్యంత పకడ్బందీగా నీట్ పరీక్షల వ్యవస్థ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్?టీఏ)ని ఆదేశించింది. మరోవైపు నీట్? పరీక్షల కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ అత్యంత పకడ్బందీగా ఉందని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. అంతేకాకుండా నీట్? ప్రశ్నపత్రాలను తీసుకువెళ్లే వాహనంలో జీపీఎస్? ఉందని, ప్రతి చిన్న కదలిక కూడా నమోదవుతుందని పేర్కొంది.నీట్?-యూజీ పేపర్? లీక్? నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సంస్కరణలు కోరుతూ దాఖలైన పిటిషన్లపై బుధవారం జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్?ఏఐఎంఏ) తరఫున న్యాయవాది తన్వీ దూబే దాఖలు చేసిన పిటిషన్ కూడా వీటిలో ఉంది. నీట్?లో సంస్కరణలను సంస్థాగతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొంది. రాధాకృష్ణన్ కమిటీ కూడా ఇదొక వ్యవస్థాగత సమస్య అని సరిగ్గానే గుర్తించిందని వ్యాఖ్యానించింది. పరీక్షల విధానం పత్రాలపై ఎంత పకడ్బందీగా ఉన్నా, ఒక పరీక్ష ముగిసిన తర్వాత మరో ఎగ్జామ్? సమయానికి పరిస్థితులు పూర్తిగా మారిపోతే ప్రయోజనం ఉండదని అభిప్రాయపడింది. సంస్కరణలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని స్పష్టం చేసింది.

### పేపర్ లీక్ నేపథ్యంలో కమిటీ..

నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ ఏడుగురు సభ్యులతో రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. పరీక్షల నిర్వహణలో సంస్కరణలు, డేటా భద్రతా ప్రోటోకాల్స్‌ను మెరుగుపరచడం, ఎన్?టీఏ నిర్మాణం, పనితీరులో మార్పులు వంటి అంశాలపై ఈ కమిటీ సిఫార్సులు చేసింది. ఇదే సమయంలో నీట్? పరీక్షల్లో మరింత విస్తృతమైన నిర్మాణాత్మక సంస్కరణల కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో కేంద్రం మరో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. బుధవారం జరిగిన విచారణ చాలా కీలకమైనది అని న్యాయవాది తన్వీ దూబే తెలిపారు. పేపర్ ముద్రణ నుంచి రవాణా వరకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు గురించి కోర్టుకు కేంద్రం స్పష్టం తెలిపిందని చెప్పారు. ఇక రాధాకృష్ణ కమిటీ సిఫారసులు, ప్రస్తుతం ప్రభుత్వం చెబుతున్న ఈ చర్యలు చాలా వరకు పోలి ఉన్నాయని కోర్టు గమనించిందని తెలిపారు. అలాంటప్పుడు నందనే నీలేకని కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఈ ఏడాది జరిగినటువంటి ఘటనలు మళ్లీ జరగడాన్ని తాము అంగీకరించలేమని పేర్కొన్నారు. రాధాకృష్ణ కమిటీ నివేదిక ఉన్నప్పటికీ, ఇలాంటి ఘటనలు ఎందుకు పునరావృతమయ్యాయి అని ప్రశ్నించారు.

### ‘ప్రశ్నపత్రం నుంచి విద్యార్థి వరకు పటిష్ఠ భద్రత’..

కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. విచారణ ప్రారంభంలోనే సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నీట్? ప్రశ్నపత్రం ముద్రణ నుంచి విద్యార్థుల చేతికి చేరే వరకు అనుసరిస్తున్న భద్రతా చర్యలను కోర్టుకు వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వ్యవస్థను ఛేదించడం చాలా కష్టమని, పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామని తెలిపారు. ప్రశ్నపత్రం తయారీలోనూ అనేక దశల్లో గోప్యత పాటిస్తున్నట్లు చెప్పారు. చాలా మంది నిపుణులతో క్వశ్చన్ బ్యాంక్‌ను సిద్ధం చేయిస్తున్నామని తెలిపారు. ఏ ప్రశ్న పరీక్షలో వస్తుందో వారికి కూడా తెలియదని వివరించారు. దీంతో ప్రశ్నపత్రం ముందుగానే లీక్ అయ్యే అవకాశాలను తగ్గించేలా వ్యవస్థను రూపొందించినట్లు కేంద్రం తరఫున కోర్టుకు వివరించారు. నీట్? ప్రశ్నపత్రాలను తరలించే వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమర్చినట్లు తెలిపారు. వాహనం స్వల్పంగా కదిలినా ఆ వివరాలు రికార్డు అవుతాయని పేర్కొన్నారు.

# 8 జిల్లాలు.. 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు

ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బంగాల్? ఖరగ్‌పూర్ నుంచి ఒడిశాలోని భద్రక్ (రాణీతాల్) వరకు 173 కి.మీ. మేర నాలుగో లైన్ నిర్మించనున్నారు. భద్రక్-హరిదాస్‌పూర్ మధ్య 75 కి.మీ. మేర మరో నాలుగో లైన్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గుమ్మిడిపూండి నుంచి తమిళనాడులోని గూడూరు వరకు 90 కి.మీ. మేర మూడో, నాలుగో లైన్లను నిర్మించనున్నారు. ఒడిశాలోని కటక్ నుంచి పరదీప్ (బడబంధ) వరకు 72 కి.మీ. మేర మూడో, నాలుగో లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ నాలుగు ప్రాజెక్టులు బంగాల్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలను కవర్ చేయనున్నాయి. సుమారు 6,448 గ్రామాలకు రైలు కనెక్టివిటీ మెరుగుపడనుంది. దాదాపు 60 లక్షల మంది ప్రజలు ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రయోజనం పొందుతారని కేంద్రం తెలిపింది.

### సరుకు రవాణాకు భారీ ఊతం..

ఈ మార్గాలు బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఇనుము-ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైల్స్, ఆహార ధాన్యాల వంటి సరుకుల రవాణాకు కీలకమైనవి. లైన్ల విస్తరణతో ఏటా 76 మిలియన్ టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కేంద్రం అంచనా వేసింది. పర్యాటక రంగానికీ ఈ ప్రాజెక్టులు ఉపయోగపడనున్నాయి. కుల్దిహా వన్యప్రాణి అభయారణ్యం, భితర్‌కణిక జాతీయ ఉద్యానవనం, చంద్రభాగ, తలసరి-ఉదయ్‌పూర్, చాందీపూర్ బీచ్, పులికాట్ సరస్సు, నెలపట్టు పక్షుల అభయారణ్యం, లలిత్‌గిరి తదితర పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు కనెక్టివిటీ మెరుగుపడనుంది. రైల్వే పర్యావరణహిత, ఇంధన సామర్థ్యం కలిగిన రవాణా మార్గమని కేంద్రం తెలిపింది. ఈ ప్రాజెక్టుల వల్ల ఏటా సుమారు 13 కోట్ల లీటర్ల చమురు దిగుమతి తగ్గడంతో పాటు 65 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని అంచనా వేసింది. ఇది సుమారు 2.60 కోట్ల చెట్లను నాటినంత ప్రయోజనంతో సమానమని పేర్కొంది.

### బీహార్‌లో ఎన్‌హెచ్-22 విస్తరణ..

ఇక బిహార్‌లో ముజఫర్‌పూర్-సీతామఢి-సోన్బర్సా మధ్య 82.578 కి.మీ. పొడవైన ఎన్‌హెచ్-22ను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్?ఏఎం)లో చేపట్టే ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3,590.73 కోట్లు. ఈ రహదారి భారత్-నేపాల్ సరిహద్దులోని సోన్బర్సాను ముజఫర్‌పూర్‌లోని ఎన్‌హెచ్-27తో అనుసంధానించనుంది. దీంతో ముజఫర్‌పూర్, బరౌనీ వంటి ఆర్థిక కేంద్రాలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు గంగానది పరివాహక ప్రాంతంలోని సరుకు రవాణా కేంద్రాలకు అనుసంధానం బలోపేతం కానుంది. నేపాల్ సరిహద్దులోని భిఠామోర్ ల్యాండ్ పోర్టు ద్వారా ప్రయాణికులు, సరుకుల రాకపోకలకు కూడా ఈ రహదారి కీలకం కానుంది.

### ఏడు వంతెనలు- మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు..

ప్రాజెక్టులో ఏడు ప్రధాన వంతెనలు, మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో బాగ్మతీ నదిపై 340 మీటర్ల పొడవైన ప్రధాన వంతెన కూడా ఉంది. ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు 1,170 మీటర్లు, 270 మీటర్ల పొడవైన రెండు ఫ్లైఓవర్లు నిర్మించనున్నారు. ముజఫర్‌పూర్, ముక్సుద్‌పూర్, రున్నీ సైద్‌పూర్, తుమ్మా, డుమ్రా, భూతాహీ, సోన్బర్సా వంటి జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి.. సురక్షితమైన, వేగవంతమైన రాకపోకలకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని కేంద్రం తెలిపింది.

# 27 నుంచి ఇందిరమ్మ ఇండ్ల లాటరీ

సాయంత్రం వరకు తెలియచేయ వచ్చున్నారు. వచ్చిన అభ్యంతరాలన్నిటిని పరిశీలించిన అనంతరం ఇండ్లకోసం అర్హులైన దరఖాస్తు దారుల వివరాలతో తుది జాబితాను ఈ నెల 25 వ తేదీన ప్రకటిస్తామని ఆయన వివరించారు. 27 నుంచి లాటరీ ప్రక్రియ అర్హులైన దరఖాస్తుదారుల జాబితా రూపొందించిన తరువాత ఈ నెల 27 నుంచి లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని వివరించారు. ప్రతి రోజూ నాలుగు నియోజకవర్గాలు చొప్పున నాలుగు రోజుల పాటు వరుసగా లాటరీ ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు.పూర్తి పారదర్శకంగా లాటరీ ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీ వి.పి గౌతం పేర్కొన్నారు. రెవెన్యూ, హౌసింగ్ బోర్డు అధికారులు, మీడియా సమక్షంలో ఈ లాటరీ ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు. ఈ లాటరీ ప్రక్రియను యూట్యూబ్, తదితర మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తామన్నారు. ముందు ప్రకటించినట్లుగా ఎస్సీ, ఎస్టీ, బిసి, దివ్యాంగులు, తదితర రిజర్వేషన్ల ప్రకారం డ్రా తీస్తామని పేర్కొన్నారు. ప్రతి కేటగిరిలోనూ 20 శాతం వెయిటింగ్ లిస్టు కూడా రూపొందిస్తామని వీరిని కూడా లాటరీ డ్రా ద్వారానే ఎంపికి చేస్తామని పేర్కొన్నారు. ఇండ్ల కేటాయింపు విషయంలో ఎటువంటి సందేహాలు, అపోహాలకు లోనుకావద్దనీ, పూర్తి పారదర్శకంగానే అర్హుల గుర్తింపు ప్రక్రియ జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశంలో ఏమైనా సందేహాలుంటే కాల్ సెంటర్ నెంబరు 040 24603572 లో సంప్రదించవలసిందిగా ఆయన కోరారు.

# ప్రతి గడపకూ పాంచజన్య పథకాలను చేర్చాలి

**ప్రతి ఊరికి సామాజిక న్యాయ తెలంగాణ సంకల్పాన్ని తీసుకెళ్లాలి**

**తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం తరహాలో మళ్లీ ఉద్యమించాలి**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ప్రతి ఊరికి సామాజిక న్యాయ తెలంగాణ సంకల్పాన్ని తీసుకెళ్లాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. బుధవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం ఆచార్య జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని ప్రతిజ్ఞ తీసుకున్నామని తెలిపారు. సామాజిక న్యాయ తెలంగాణ స్ఫూర్తిని ఇప్పుడు ప్రతి గ్రామానికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో అత్యధిక జనాభా ఉన్న వాళ్లు అట్టడుగున బతకాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది, ఎనిమిది దశాబ్దాల స్వతంత్ర భారత దేశంలో ఇప్పటికీ సమానత్వం ఎందుకు అందని ద్రాక్షగా మారిందో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. సమాజంలో అన్న అసమానతలను రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని అన్నారు. మొదటి దశలో అన్ని మండల కేంద్రాలతో పాటు మేజర్ గ్రామ పంచాయతీల్లో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలు నిర్వహిస్తామన్నారు. ఆ తర్వాత ప్రతి గ్రామంలో సభలు నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ ప్రధాన ఎజెండా అయిన పాంచజన్య పథకాలను ప్రతి గడపకు చేర్చాలని పిలుపునిచ్చారు. సాధించుకున్న భౌగోళిక తెలంగాణను సబ్బండ వర్గాల అభివృద్ధి, వికాసం, సాధికారత సాధించిన తెలంగాణగా సుసంపన్నం చేసుకుందామని అన్నారు. ఇందుకోసం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం తరహాలో మళ్లీ ఉద్యమించాలని.. అందుకోసం పార్టీ క్యాడర్ సమాయత్తం కావాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే పాలన

కార్యక్రమంలో మంత్రి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రికి ప్రతి వినతిని పరిశీలించిన మంత్రి.. సంబంధిత శాఖలు, అధికారులు, జిల్లా యంత్రాంగానికి వాటిని పంపించి, నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించడంతో కార్యక్రమం ముగిసిపోదని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను పర్యవేక్షిస్తూ.. సమస్య పరిష్కారం అయ్యే వరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు. అత్యవసర సమస్యలకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని, మిగిలిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఎస్సీలు, గిరిజనులు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్లు, పేదలు, అణగారిన వర్గాలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యంతో పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ‘ప్రజల వద్దకే పాలన’ అనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సానుకూల దృక్పథంతో పరిశీలించి, నిబంధనల పరిధిలో సాధ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను వినడమే కాదు.. వాటికి పరిష్కారం చూపే వరకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ప్రజలకు అందుబాటులో ఉండే పాలనే మా ప్రభుత్వ విధానం” అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు.

### బీఆర్ఎస్‌పై మంత్రి ధ్వజం..

హౌస్ అరెస్టుల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు ప్రతిపక్ష నేతలను ఇంటి నుంచి బయటకు రానిచ్చారా? అని ప్రశ్నించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్ సిరిసిల్లకు వచ్చిన సందర్భంలో తనను ధర్మపురిలో హౌస్ అరెస్టు చేసేవారని గుర్తుచేశారు. నాడు ప్రతిపక్ష నేతలను నిర్బంధించిన వారు.. నేడు హౌస్ అరెస్టులపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గత పాలనలో ప్రజల గొంతుకకు అడ్డుకట్ట వేస్తే.. తమ ప్రభుత్వం ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను వింటోందని చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజల సమస్యలను నేరుగా వినేందుకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు సరైన వేదిక లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. దీనికి భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండే పాలనను అమలు చేస్తోందన్నారు.

# ఆయుష్ వైద్య విద్యార్థుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి



సారిస్తూ, ప్రజా సేవ చేసే వైద్య విద్యార్థుల సమస్యలను, విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, ఆయుష్ విద్యార్థులకు అల్లోపతితో సమానంగా స్టైఫండ్ పెంచి, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో విద్యార్థుల పక్షాన బీజేపీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని రాంచందర్ రావు హెచ్చరించారు.

# పరకాల కాబోయే ఎమ్మెల్యే నేనే

**టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ : కొండా సుస్మిత**



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ఎన్నికలు ఎపుడొచ్చినా పరకాల అసెంబ్లీ స్థానంలో నిలబడేది, గెలిచేది తానేనని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నుంచి సీటు ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని స్పష్టం చేశారు. పరకాల ప్రాంత ప్రజలకు సదా అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆమె వెల్లడించారు. మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను వరంగల్ పోచం మైదాన్ కూడలిలో నిర్వహించగా కొండా సుస్మిత పటేల్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. మరోవైపు సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖ కుమార్తె సుస్మితకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. మ్నరీడు రోజుల్లోపు వివరణ ఇవ్వాలని మంత్రి కొండా సురేఖను ఆదేశించింది. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తాను కచ్చితంగా బరిలో ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి వచ్చినా గెలిచేది తానేనని కొండా సుస్మిత తెలిపారు. త్వరలోనే పరకాలలో ఇల్లు నిర్మించుకుని ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. రాష్ట్రంలో పచ్చ కాంగ్రెస్ నడుస్తుందని అచ్చా కాంగ్రెస్ ఏమీ నడవడం లేదని మంత్రి తనయ వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి రేవంత్ సీఎంనో, పొంగులేటి సీఎంనో అర్థం కావడం లేదన్నారు. అందరికీ పదవులు ఇచ్చి కొండా మురళికి ఎందుకు ఇవ్వడం లేదో సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని కొండా సుస్మిత డిమాండ్ చేశారు.

# 22ఏ భూముల అంశంలో పొంగులేటిని బర్తరఫ్ చేయాలి: హరీశ్‌రావు



విశ్వంభర, హైదరాబాద్: ప్రభుత్వం మెడలు వంచి ప్రజల ఆస్తులకు రక్షణగా ఉంటామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 22ఏ నిషేధిత భూముల జాబితా అంశంపై తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 30, 40 ఏళ్లుగా లేని సమస్య ఇప్పుడే ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. "22ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లు చేసి మళ్లీ 22ఏ జాబితాలో పెట్టారట. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటికి రియల్ ఎస్టేట్ తెలిస్తే.. బీఆర్ఎస్‌కు పోరాటం తెలుసు. సమస్యను పరిష్కరిస్తారా.. ప్రజల కాళ్ల కింద నలిగిపోతారా?ఒక్క ఎకరా కూడా 22ఏ కింద పెట్టలేదని 10 రోజుల క్రితం పొంగులేటి చెప్పారు. ఇప్పుడు అధికారులు తప్పు చేశారంటున్నారు. నిషేధిత జాబితా గురించి 4 నెలల క్రితమే సీఎం రేవంత్‌కు చెప్పానని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. ఆయన చెప్పినపుడే సీఎం ఎందుకు స్పందించలేదు?రేవంత్, పొంగులేటికి తెలిసే జరిగిందని స్పష్టంగా అర్థమవుతోంది. కోట్లాది ప్రజల ఆస్తులను ఇలా పెట్టే ధైర్యం అధికారులకు ఉంటుందా?చీటికి మాటికి విచారణలు చేసే రేవంత్‌రెడ్డి.. దీనిపై ఎందుకు స్పందించడం లేదు?సీఎంకు సంబంధం లేకపోతే పొంగులేటిని బర్తరఫ్ చేయాలి. 22ఏలో ఏయే భూములు పెట్టారో వాటిని తొలగిస్తే సరిపోతుంది. ప్రభుత్వం స్పందించకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తాం" అని హరీశ్‌రావు హెచ్చరించారు.

# గచ్చిబౌలి పీఎస్ పరిధిలో డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు




విశ్వంభర, హైదరాబాద్: నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. "ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు. బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం. నిందితురాలిని విచారించగా.. కేరళలో ఉండే తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించింది. పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు మరింత ముమ్మరంగా కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నెంబర్ 8712663061కు ఫిర్యాదు చేయాలి" అని డీసీపీ సూచించారు.

# 22/ఎ భూబాధితులకు ఊరట.. ఇకపై 'ఫాస్ట్ ట్రాక్' పరిష్కారం

**అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం**



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో 22/ఎ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. 22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం, తిరస్కరించడం చేయవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలన్నారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 22/ఎ భూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

# రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు..

**కొండా సురేఖ కుమార్తెకు నోటీసులు**

విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్‌కు కాంగ్రెస్ పార్టీ నోటీసులు జారీ చేసింది. దీనిపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదేశించింది. కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ టికెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా పరకాల నుంచే బరిలో దిగుతానని ఆమె అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఉద్దేశించి కూడా పలు విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో వివరణ కోరుతూ టీపీసీసీ నోటీసులు జారీ చేసింది.మరోవైపు వనపర్తి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి సైతం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఎల్బీ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డిపై టీపీసీసీ సస్పెన్షన్ వేటు వేసింది. పలువురిని వ్యక్తిగతంగా దూషించడంతో ఆయన్ను సస్పెండ్ చేసింది.

# తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు



విశ్వంభర, హైదరాబాద్: నాంపల్లిలోని తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు జరుగుతున్నాయి. గత నాలుగు గంటలుగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తనిఖీలు కొనసాగిస్తోంది. 2019 ఇంటర్ ఫలితాల వ్యవహారంలో గ్లోబరీనా సంస్థ అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మార్కుల్లో తప్పులు దొర్లడంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాలతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రంగంలోకి దిగింది. ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి అశోక్‌ను విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నారు.

# ఆధారాలతో అసెంబ్లీ మీడియా పాయింట్‌కు వస్తా:



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: 'భూదందాలు, ఆస్తుల బదలాయింపులపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నా. గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద అన్ని ఆధారాలతో వేచి ఉంటా. దమ్ము ధైర్యం ఉంటే చర్చకు రావాలి' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్ర కార్యాయలంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ అవినీతికి సంబంధించిన పూర్తి ఆధారాలతో ఈడీ, సీబీఐ, లోకాయుక్తలకు ఫిర్యాదు చేయడమే కాకుండా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కూడా బహిరంగ లేఖ రాస్తామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనల పేరుతో రాష్ట్ర సమస్యలను వదిలేసి తప్పించుకు తిరుగుతున్నారని, బీజేపీ తెలంగాణ ప్రజల పక్షాన నిలిచి కాంగ్రెస్-బీఆర్ఎస్ దోపిడీని అంతం చేసేవరకు పోరాడుతుందని తేల్చిచెప్పారు. కాంగ్రెస్-బీఆర్ఎస్ 'జేవీ లూట్'పై సీబీఐ, ఈడీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీ ఎత్తున అవినీతి, భూదందాలు జరుగుతున్నాయని, స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పిన క్షమాపణే ఇందుకు నిదర్శనమని బీజేఎల్పీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. లక్షల కోట్ల రూపాయల విలువైన కోటి ఎకరాల భూములను 22ఏ నిషేధిత జాబితాలో పెట్టి బేరసారాలు నడుపుతున్నారని, ఇంత పెద్ద తప్పిదం చేసి కేవలం 'క్షమాపణ'తో సరిపెట్టుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్వయంగా యాదగిరిగుట్ట లోని తన 42 ఎకరాల భూమి కూడా నిషేధిత జాబితాలోకి వెళ్లిందని, దీని వెనుక కుట్ర దాగి ఉందని సీఎం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని చెప్పడాన్ని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఈ భూదందాలు, నిషేధిత భూముల జాబితా పై శ్వేతపత్రం విడుదల చేయాలని, సమగ్ర విచారణ లేదా సీబీఐ ఎంక్వైరీకి ఆదేశించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ సంస్థలకు, బీఆర్ఎస్ పార్టీకి బినామీగా ఉన్న ఫీనిక్స్ కంపెనీకి మధ్య భారీ క్విడ్ ప్రో కో జరిగిందని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మంత్రి అయిన తర్వాత నానక్‌రామ్‌గూడ, పుప్పాలగూడ, నార్సింగి, కోకాపేట్, హైటెక్ సిటీ ప్రాంతాల్లోని టీజీఐఐసీ ఇండస్ట్రియల్ భూములను రాత్రికి రాత్రే రెసిడెన్షియల్ జోన్‌లుగా మార్చి ఫీనిక్స్ కంపెనీ నుంచి సుమారు రూ.15వేల కోట్ల విలువైన ఆస్తులను బదలాయించుకున్నారని డాక్యుమెంట్ల ఆధారాలతో సహా వివరించారు. అధికారంలోకి రాకముందు ఫీనిక్స్‌పై సీబీఐ, ఈడీ విచారణ జరిపించాలని, ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఎందుకు వెనకడుగు వేశారని ప్రశ్నించారు. ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేస్తూ గత పాలకులతో కలిసి 'జాయింట్ వెంచర్ లూట్' చేస్తున్నారని విమర్శించారు. ఒకవైపు మంత్రిగా ఉంటూ రూ.1,400 కోట్ల పాలమూరు-రంగారెడ్డి కాంట్రాక్ట్‌ను రూ.4,300 కోట్లకు రివైజ్ చేసుకోవడం కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్ కాదా అని నిలదీశారు.

# మారుతున్న సవాళ్లకు అనుగుణంగా పోలీసుల పునర్వ్యవస్థీకరణ: డీజీపీ సివి ఆనంద్



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: మారుతున్న నేర స్వభావం, ప్రజా భద్రతకు ఎదురవుతున్న కొత్త సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖలో మానవ వనరుల పునర్వ్యవస్థీకరణ చేపట్టినట్లు డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదం ప్రధాన సవాళు ్లగా ఉండగా.. ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, ట్రాఫిక్ నిర్వహణ వంటివి పోలీసులకు కత్తిమీద సాములా మారాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ వంటి ప్రత్యేక విభాగాల నుంచి 513 మంది సిబ్బందిని వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో సుమారు 8 వేల మంది ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగించే అంశమని, అందుకే బదిలీ అయిన వారిలో అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించినట్లు తెలిపారు. అలాగే ఆహార కల్తీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగానికి 80 మందిని, విజిలెన్స్‌కు 79 మందిని, ఏసీబీ, సీఐడీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు చొప్పున 25 మందిని కేటాయించారు. వీరిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని విద్యార్హతలు, అనుభవం ఆధారంగా వ్యక్తిగత ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

**డ్రగ్స్ మహమ్మారిపై..**

**సైబర్ నేరాల వల్ల నష్టం రూ.1,750 కోట్లు..**

యువతను పీడిస్తున్న డ్రగ్స్ వినియోగంపై డీజీపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది 835 మంది విద్యార్థుల్లో డ్రగ్స్ ఆనవాళ్లు గుర్తించామని, ఒక యూనివర్సిటీలో నిర్వహించిన అధ్యయనంలో 70 శాతం మంది విద్యార్థులు దీని బారిన పడినట్లు తేలిందని వెల్లడించారు. డ్రగ్స్ సరఫరా గొలుసును తెంచడంతో పాటు తల్లిదండ్రులు, విద్యా సంస్థల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు సైబర్ నేరాల వల్ల రాష్ట్రానికి గతేడాది రూ.1,750 కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తగా కేటాయించిన సిబ్బంది ఈ నేరాల కట్టడిలో కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

**తీవ్రవాదం నుంచి సైబర్ నేరాల వరకు..**

1980, 90వ దశకాల్లో రాష్ట్రం వామపక్ష తీవ్రవాదంతో అట్టుడికిన వేళ, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక బలగాలు ఏర్పడి కీలక పాత్ర పోషించాయని డీజీపీ గుర్తు చేశారు. 2017 తర్వాత రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు తగ్గినప్పటికీ, పొరుగు రాష్ట్రాల్లో ఆ ప్రభావం ఉందన్నారు. అలాగే 2007 ఉగ్రదాడుల నేపథ్యంలో ఆక్టోపస్ వంటి విభాగాలు బలోపేతమయ్యాయని వివరించారు. కాలంతో పాటు మారుతున్న నేరగాళ్ల ఎత్తుగడలను చిత్తు చేసేందుకు పోలీసు వ్యవస్థలో ఈ మార్పులు అనివార్యమని ఆయన పేర్కొన్నారు. కొత్త విభాగాలకు బదిలీ అయిన సిబ్బందికి 11 రోజుల ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు, రెండు నెలల పాటు అటాచ్‌మెంట్‌పై పనిచేయించిన అనంతరం తుది కేటాయింపులు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, వృత్తి నైపుణ్యంతో విధులు నిర్వహించాలని డీజీపీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్, సీఐడీ, ఇంటెలిజెన్స్ తదితర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అరుణాచల్‌లో చైనా ఆక్రమణ వార్తలు.. ఖండించిన కిరణ్ రిజిజు



విశ్వంభర, నేషనల్ బ్యూరో: చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్ లోని లాంగ్జు సమీపంలో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని ప్రచారం అవుతున్న కథనాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. భూభాగాన్ని ఎవరూ ఆక్రమించుకోలేదని.. సరిహద్దు వెంబడి భారత సైన్యం, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు గస్తీని గణనీయంగా పెంచారని పేర్కొన్నారు. 'లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్' సమీపంలో చైనా నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతం 1959లోనే ఆ దేశం ఆక్రమించుకున్న భూభాగంలో ఉందని స్పష్టం చేశారు. చైనా దళాలు మన గ్రామాలను ఆక్రమించుకొని, శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఎల్ఏసీకి సంబంధించి స్పష్టమైన సరిహద్దు గుర్తింపు లేకపోవడం వల్ల లాంగ్జు ప్రాంతం చాలా కాలంగా వివాదాస్పదంగా ఉందని రిజిజు పేర్కొన్నారు. ఆ సరిహద్దు పాయింట్ వద్ద మన పోస్ట్ కూడా ఉందన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేయడం వల్ల అక్కడ మోహరించిన మన సైనిక సిబ్బంది, భద్రతా దళాల మనోధైర్యం దెబ్బతింటుందన్నారు. 1962 భారత్-చైనా యుద్ధం తర్వాత ఆ ప్రాంతంలో ఇరుదేశాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. అయితే అక్కడి పర్వత శ్రేణుల వెంబడి చైనా సైనిక కార్యకలాపాలు పెరిగాయని ధ్రువీకరించారు.

# మహిళా అధికారులను అవమానించడాన్ని సహించం: సుప్రీం కోర్టు



విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఓ మహిళా అధికారికి శాశ్వత కమిషన్ ఇవ్వకపోవడంపై భారత కోస్ట్ గార్డ్ పై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళా అధికారులను అవమానించడాన్ని తాము సహించబోమని పేర్కొంది. శాశ్వత కమిషన్ విషయంలో మంగళవారం ఐసీజీ విడుదల చేసిన విధానం అస్పష్టంగా, ఏకపక్షంగా ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రియాంక త్యాగి అనే అధికారిణికి శాశ్వత కమిషన్ ఇచ్చే అంశంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఐసీజీని ఆదేశించింది. లేనిపక్షంలో.. కోర్టు స్వయంగా ఆదేశాలు జారీ చేస్తుందని స్పష్టం చేసింది.షార్ట్ సర్వీస్ కమిషన్ కింద ప్రియాంక త్యాగి ఐసీజీలో 14 ఏళ్లకుపైగా సేవలు అందించారు. అయితే, తనకు శాశ్వత కమిషన్ నిరాకరించి, సర్వీస్ నుంచి తొలగించాలనే అధికారుల నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆమె గతంలో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని 2024లో సర్వోన్నత న్యాయస్థానం ఐసీజీని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఆమె అండమాన్ నికోబార్‌లోని యూనిట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అయితే.. శాశ్వత కమిషన్ మంజూరుకు సంబంధించి ఐసీజీ మంగళవారం ఓ విధానాన్ని ప్రకటించిందని.. అది చాలా అస్పష్టంగా, ఏకపక్షంగా ఉందని ఆమె తరఫు న్యాయవాది సుప్రీం కోర్టులో వాదించారు. దేశ తూర్పు ప్రాంతంలో సముద్ర గస్తీ కోసం మోహరించిన డోర్నియర్ విమానంలో మొట్టమొదటి మహిళా సిబ్బంది బృందానికి ప్రియాంక త్యాగి కెప్టెన్‌గా వ్యవహరించారు. సీనియారిటీ ప్రకారం అన్ని దళాల్లోనూ పురుష, మహిళా అధికారులతో పోలిస్తే ఆమెకే అత్యధికంగా దాదాపు 4,500 గంటల ఫ్లయింగ్ అనుభవం ఉందని ఆమె తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సముద్రంలో 300 మందికిపైగా ప్రాణాలను ఆమె కాపాడారని పేర్కొన్నారు. అయితే, ఈ వ్యవహారాన్ని స్త్రీ-పురుష వివక్ష అంశంగా పరిగణించవద్దని, మహిళా అధికారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఐసీజీకి కొన్ని పరిమితులు ఉన్నాయని అటార్నీ జనరల్ వెంకటరమణి వాదించారు."ఇటువంటి సాంకేతికపరమైన అభ్యంతరాలు చెప్పడం కుదరదు. ఆ మహిళా అధికారికి శాశ్వత కమిషన్ ఇవ్వాలని ఉన్నతాధికారులు ఎప్పటి నుంచో సిఫార్సు చేస్తూ వచ్చారు. కాబట్టి ఐసీజీ ఈ విషయాన్ని పరిగణించి ఉండాల్సింది. పురుషులకు శాశ్వత కమిషన్ ఇస్తున్నప్పుడు.. మహిళా అధికారులకు ఎందుకు ఇవ్వకూడదు? మహిళా అధికారులు ఈ విధంగా అవమానానికి గురికావడాన్ని అనుమతించలేం. కొద్దిగా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించండి. రెండు వారాల్లోపు దీనిపై నిర్ణయం తీసుకోండి. లేదా మేమే తగిన ఆదేశాలు జారీ చేస్తాం" అని త్యాగి పిటిషన్‌పై విచారణను వాయిదా వేస్తూ ధర్మాసనం పేర్కొంది.

ప్రజా విశ్వంభర

# దేశద్రోహి ఎవరు? దేశభక్తుడు ఎవరు?

**దేశభక్తి గురించి మాట్లాడేవారు చాలామంది ఉన్నారు. జాతీయ జెండాలు ఎగురవేస్తారు. దేశం, జాతి, జాతీయత పేరుతో నినాదాలు చేస్తారు. అదే సమయంలో ప్రజల సమస్యలను ప్రశ్నించేవారిని దేశద్రోహులుగా ముద్ర వేస్తారు. అందుకే అసలు ప్రశ్నను ముందుగా అడగాలి. దేశద్రోహి ఎవరు? దేశభక్తుడు ఎవరు?రైతు సమస్యలను ప్రశ్నించినవాడు దేశద్రోహి అవు తాడా? కార్మికుల హక్కుల కోసం పోరాడిన వాడు దేశద్రోహి అవుతాడా? విద్యార్థుల సమస్య లను, యువత నిరుద్యోగాన్ని లేవనెత్తినవాడు దేశద్రోహి అవుతాడా? దళితులపై కుల అణిచివేతను, కుల వివక్షను వ్యతిరేకించినవాడు దేశద్రోహి అవుతాడా? స్త్రీలపై పితృస్వామ్య అణచివేతను, అత్యాచారాలను వ్యతిరేకించిన వాడు దేశద్రోహి అవుతాడా? మత భేదాలు లేకుం డా ప్రజలు సామరస్యంగా జీవించాలని కోరినవాడు దేశద్రోహి అవుతాడా? మత ఉన్మాదాన్నివ్యతిరేకించినవాడు దేశద్రోహి అవుతాడా?అయితే ప్రజలను మతం పేరుతో విభజించి, మత విద్వేషాన్ని రెచ్చగొట్టేవారు దేశభక్తులా? ప్రజల సంపదను కొద్దిమంది గుత్త పెట్టుబడిదారీ వర్గాలకు (కార్పొరేట్ వర్గాలకు) అప్పగించేవారు దేశభక్తులా? ప్రజల హక్కులను అణచివేసి, ప్రశ్నించే గొంతులను మూయించేవారు దేశభక్తులా?ఇదే అసలు ప్రశ్న.**




గురజాడ అప్పారావు అన్నట్లు, “దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్.” దేశం అంటే ప్రభుత్వం కాదు. అధికార పార్టీ కాదు. పాలకులు కాదు. గుత్త పెట్టుబడిదారీ వర్గాలు (కార్పొరేట్ వర్గాలు) కాదు. దేశం అంటే కోట్లాది ప్రజలు.రైతు, కార్మికుడు, వ్యవసాయ కూలీ, ఉద్యోగి, విద్యార్థి, యువత, మహిళా శ్రామికులు, చిన్న ఉత్పత్తిదారులు-వీరి శ్రమతోనే దేశ సంపద సృష్టించబడుతుంది. రైతు పండించే ఆహారం నుంచి కార్మికుడు ఉత్పత్తి చేసే వస్తువుల వరకు, నిర్మాణ కార్మికుడి శ్రమ నుంచి సేవా రంగంలోని కోట్లాది ఉద్యోగుల వరకు దేశ ఆర్థిక వ్యవస్థ ప్రజల శ్రమపై ఆధారపడి ఉంది. అందువల్ల ప్రజల జీవితం, హక్కులు, గౌరవం, భవిష్యత్తును కాపాడటమే దేశ ప్రయోజనం. ప్రజల సమస్యలను ప్రశ్నించడం దేశద్రోహం కాదు. ప్రజల సమస్యలను అణచివేయడమే ప్రజా వ్యతిరేకత.రైతు అప్పుల్లో కూరుకుపోతే ప్రశ్నించాలి. కార్మికుడికి న్యాయమైన వేతనం, భద్రత లేకపోతేప్రశ్నించాలి. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకపోతే ప్రశ్నించాలి. యువతకు ఉద్యోగాలు లేకపోతే ప్రశ్నించాలి. విద్య, వైద్యం సామాన్య ప్రజలకు అందుబాటులో లేకపోతే ప్రశ్నించాలి. ఇవి దేశద్రోహ ప్రశ్నలా? కాదు. ఇవే దేశ ప్రజల అసలు ప్రశ్నలు.ఈ ప్రశ్నలను లేవనెత్తి ప్రజల కోసం ఉద్యమాలు నిర్మించే వారిని దేశద్రోహులుగా ముద్రించడం ప్రజలను మోసం చేయడమే.భారత సమాజంలో కుల వివక్ష, కుల ఆధిపత్యం ఇప్పటికీ కోట్లాది ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. దళితులపై కుల అణిచివేతను వ్యతిరేకించడం దేశద్రోహం కాదు. కుల వివక్షను ప్రశ్నించడం దేశద్రోహం కాదు. ఆదివాసీలు, బీసీలు, ఇతర అణగారిన వర్గాల సామాజిక న్యాయం కోసం పోరాడటం దేశద్రోహం కాదు. స్త్రీలపై పితృస్వామ్య ఆధిపత్యాన్ని ప్రశ్నించడం, అత్యాచారాలు మరియు లైంగిక హింసకు వ్యతిరేకంగా నిలబడటం దేశద్రోహం కాదు.సమానత్వం కోసం పోరాటం ప్రజాస్వామ్యం; ప్రజాస్వామ్యం కోసం పోరాటం ప్రజా దేశభక్తి.భారతదేశంలోని ప్రజలు తమ తమ మతాలను అనుసరిస్తూనే పరస్పరం గౌరవించుకుంటూ శాంతియుతంగా జీవించాలని కోరుకోవడం దేశద్రోహమా? మత ఉన్మాదాన్ని వ్యతిరేకించడం దేశద్రోహమా? కాదు. మతం పేరుతో ప్రజలను విభజించి, విద్వేషాన్ని రెచ్చగొట్టి రాజకీయ లాభం పొందే ప్రయత్నాలే దేశ ఐక్యతకు ప్రమాదం.ప్రజలను విభజించడం దేశభక్తి కాదు. ప్రజలను ఐక్యం చేయడమే దేశ ప్రయోజనం.నేడు కొద్దిమంది గుత్త పెట్టుబడిదారీ వర్గాల (కార్పొరేట్ వర్గాల) సంపద పెరగడాన్ని దేశాభివృద్ధిగా చూపిస్తున్నారు. ప్రజా ఆస్తులను ప్రైవేటీకరిస్తే అభివృద్ధి అంటున్నారు. ప్రజా వనరులను పెద్ద కంపెనీలకు అప్పగిస్తే పెట్టుబడుల ఆకర్షణ అంటున్నారు. కార్మిక హక్కులను బలహీనపరిస్తే సంస్కరణ అంటున్నారు. ఈ విధానాలను ప్రశ్నిస్తే మాత్రం ప్రశ్నించిన వారినే అభివృద్ధి వ్యతిరేకులు, దేశద్రోహులు అంటున్నారు.ఇక్కడే దేశభక్తి పేరుతో జరుగుతున్న రాజకీయ మోసం బయటపడుతుంది.దేశం అంటే కార్పొరేట్ లాభాలు కాదు. దేశం అంటే ఆ లాభాల కోసం శ్రమించే కోట్లాది ప్రజలు.ప్రజల సంపదను కొద్ది మందికి తరలించే విధానాలను ప్రశ్నించడం దేశద్రోహం కాదు. అది ప్రజల పక్షాన నిలిచే దేశభక్తి.కమ్యూనిస్టులపై తరచుగా “మార్క్సిజం విదేశీ సిద్ధాంతం” అనే ఆరోపణ చేస్తుంటారు. కానీ ఒక సిద్ధాంతం ఎక్కడ పుట్టిందన్నది మాత్రమే దాని విలువను నిర్ణయించదు. అది సమాజంలోని వాస్తవ సమస్యలను ఎలా అర్థం చేసుకుంటుంది, ప్రజల విముక్తికి ఎలా ఉపయోగపడుతుంది అన్నదే ముఖ్యం. మార్క్సిజాన్ని భారతీయ వాస్తవికతతో అనుసంధానించి చూడాలి. భారతదేశంలోనికులం,వర్గం, భూసంబంధాలు, సామాజిక అసమానతలను పరిగణనలోకి తీసుకోవాలి. అంతే తప్ప మార్క్సిజాన్ని అనుసరించే వారిని విదేశీ ఏజెంట్లు, దేశద్రోహులుగాముద్రించడం రాజకీయ దుష్ప్రచారమే. చైనా ప్రభుత్వ విధానాల్లో రాజకీయ స్వేచ్ఛలు, మానవ హక్కులు, ప్రభుత్వ పారదర్శకతకు సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. వాటిని విమర్శించాలి. అమెరికా ప్రపంచవ్యాప్తంగా సైనిక జోక్యాలు, యుద్ధాలకు మద్దతు, ఆర్థిక-రాజకీయ ఆధిపత్య విధానాలను అనుసరించిన సందర్భాలను విమర్శించాలి. పాకిస్తాన్‌లో సైనిక ఆధిపత్యం, మత ఉగ్రవాదం, మైనారిటీలపై వివక్ష, ప్రజాస్వామ్య సంస్థల బలహీనత వంటి సమస్యలను కూడా విమర్శించాలి.ఏ దేశమైనా దాని ప్రభుత్వ విధానాలను ప్రజల ప్రయోజనాల ప్రమాణంతోనే పరిశీలించాలి.అయితే చైనాను విమర్శించడం ఒక విషయం; చైనాతో వ్యాపారం చేయడంమరో విషయం. భారతదేశం చైనాతో భారీ వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తూనే, చైనా పేరుతో భారత కమ్యూనిస్టులను దేశద్రోహులుగా చిత్రించడం స్పష్టమైన ద్వంద్వ ప్రమాణం.నక్సలైట్, మావోయిస్టు ఉద్యమాల చరిత్రను కూడా దేశద్రోహం అనే ఒక్క మాటతో కొట్టిపారేయలేరు. భారతదేశంలోని నక్సలైట్, మావోయిస్టుఉద్యమాలచరిత్రలో భూమి, అడవి, గిరిజనహక్కులు, భూస్వామ్య అణచివేత, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా అనేక ప్రజా ఉద్యమాలు జరిగాయి.అనేక మందిప్రజల కోసం జైళ్లకు వెళ్లారు, నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు, ప్రాణత్యాగాలు చేశారు.వారి సాయుధ పోరాట మార్గాన్ని సమర్థించాల్సిన అవసరం లేదు. భారతదేశ ప్రస్తుత ప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యవస్థలో సాయుధ పోరాటం రాజ్యాంగ విరుద్ధమైన మార్గం. హింస, ప్రతిహింసల చక్రం ప్రజలకు శాశ్వత పరిష్కారం కాదు. కానీ అందువల్ల ప్రజల సమస్యలపై వారు చేసిన పోరాటాలను, ప్రజల కోసం చేసిన త్యాగాలను దేశద్రోహంగా చిత్రించడం కూడా సరైంది కాదు.

హింసను వ్యతిరేకిస్తూ ప్రజల హక్కుల కోసం పోరాడవచ్చు. ప్రజల కోసం నిస్వార్థంగా నిలబడటం దేశభక్తిలో భాగమే.దేశభక్తి అధికార పార్టీ ఇచ్చే బిరుదు కాదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించక పోవడమే దేశభక్తి కాదు. పాలకుల ప్రతి నిర్ణయానికీ మద్దతు ఇవ్వడమే దేశభక్తి కాదు.ప్రజల కోసం ప్రశ్నించినవాడు, ఉద్యమం నిర్మించిన వాడు, త్యాగం చేసినవాడు, నిస్వార్థంగా ప్రజల పక్షాన నిలిచినవాడే నిజమైన దేశభక్తుడు. దేశభక్తి నినాదాల్లో కాదు-పజల పక్షాన నిలిచే ఆచరణలో ఉంటుంది.మరిదేశద్రోహం ఎక్కడుంది? ప్రజల సంపదను ప్రజల నుంచి దూరం చేసి కొద్దిమంది గుత్త పెట్టుబడిదారీ వర్గాలకు (కార్పొరేట్ వర్గాలకు) అప్పగించడం ప్రజా ప్రయోజనమా?యువత భవిష్యత్తును నిరుద్యోగంలోకి నెట్టేసి జాతీయవాద నినాదాలు చేయడం దేశభక్తి ఎలా అవుతుంది?కుల అణిచివేతను కొనసాగిస్తూ సామాజిక ఐక్యత గురించి మాట్లాడటం దేశభక్తి ఎలా అవుతుంది?స్త్రీలపై హింస, అత్యాచారాలను పట్టించుకోకుండా సంస్కృతి గురించి ఉపన్యాసాలు ఇవ్వడం దేశభక్తి ఎలా అవుతుంది?మత విద్వేషాన్ని రెచ్చగొట్టి ప్రజలను విభజిస్తూ జాతీయ ఐక్యత గురించి మాట్లాడటం దేశభక్తి ఎలా అవుతుంది?ప్రజాస్వామ్య హక్కులను అణచివేసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం దేశభక్తి ఎలా అవుతుంది?ప్రజల కోసం ప్రశ్నించినవాడు దేశద్రోహి అయితే, ప్రజలను దోచుకునేవాడు దేశభక్తుడా?ప్రజలను ఏకం చేసినవాడు దేశద్రోహి అయితే, ప్రజలను మతం పేరుతో విభజించేవాడు దేశభక్తుడా?

ప్రజల సంపదను కాపాడేవాడు దేశద్రోహి అయితే, దాన్ని కొద్దిమందికి అప్పగించేవాడు దేశభక్తుడా?ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ప్రజల కోసం పోరాడేవారు కాదు. ప్రజల పేరుతో అధికారం, సంపద, ఆధి పత్యాన్ని కాపాడుకునే వారే సమాధానం చెప్పాలి.దేశం అంటే ప్రజలు.ప్రజల ప్రయోజ నమే దేశ ప్రయోజనం.ప్రజల కోసం ప్రశ్నిం చినవారు, ఉద్యమాలు నిర్మించినవారు, త్యాగాలు చేసిన వారు, నిస్వార్థంగా ప్రజల పక్షాన నిలిచినవారే నిజమైన దేశభక్తులు. ప్రజలపై దోపిడీ, అణచివేత, విభజనను దేశభక్తి పేరుతో సమర్థించే రాజకీయాన్ని బహిర్గతం చేద్దాం.ప్రజా అనుకూల దేశభక్తిని ముందుకు తీసుకెళ్దాం.

**జంపన్న**
**డెమొక్రటిక్ సోషలిస్ట్**

# మెదడు నియంత్రణ అసాధ్యం





ఒకరి మెదడును మరొకరు నియంత్రించడం అసాధ్యం. ఎవరి మెదడు వారి నియంత్రణలోనే ఉంటుంది.కానీ ఇక్కడ ప్రజల మెదళ్లను రాజ్యం నియంత్రించే యత్నం చేస్తున్నది. భయ పెట్టడం ద్వారా ఆలోచనను వెలుపలికి వ్యక్తం చేయకుండా అడ్డుకోవచ్చునేమో కానీ ఒక మనిషి ఆలోచనను ప్రకృతిలోని ఏ శక్తి కట్టడి చేయలేదు. ఆలోచనలను కట్టడి చేయగల యం త్రాన్ని సైన్స్ కూడా ఇంకా కనుగొన లేదు. అది అసాధ్యం కూడా. ఈ సత్యం తెలిసి కూడా ఆలోచనలను కట్టడి చేసే ప్రయత్నాలనురాజ్యంఎప్పుడూ విరమించలేదు. అధికారం తనకున్న ఆయుధ బలంతో నిరంతరం అలాంటి ప్రయ త్నాలను చేస్తూనే పోతున్నది. తమకు నచ్చని ఆలోచనలు చేసిన వారిని బెదిరిస్తూ, భయ పెడుతూ,భౌతికంగా నిర్మూలిస్తూ తన అహాన్ని సంతృప్తి పరచుకుంటూ ముందుకు సాగుతు న్నది రాజ్యం. అనాదిగా అధికారం సమాజం మధ్య ఈఘర్షణ నిరంతరం కొనసాగుతూనే ఉన్నది. ఆలోచనను ఆలోచనతో మాత్రమే ఎదు ర్కోవాలన్న బుద్ధిరాజ్యానికి ఉన్నదాఖలాలు చరిత్ర లో లేవు. ఒక్కోపౌరుడికి ఒక్కో విధమైన ఆలోచన ఉంటుంది. ఎవరికి నచ్చినా,నచ్చక పోయినా ఆలోచన,ప్రశ్న,విమర్శ, అభివ్యక్తి అనేవి పౌరుడి ప్రాథమిక హక్కులే అవుతాయి.ఒకరిఆలోచనలు, అభిప్రాయాలు మరొకరికి నచ్చక పోయినా వాటిని గౌరవించడం ఆధు నిక ప్రజాస్వామిక వ్యవస్థకు ఉండవలసిన ప్రాథ మిక లక్షణం.అలా వ్యవహరించనిరాజ్య వ్యవస్థ కు ప్రజాస్వామిక రాజ్య వ్యవస్థ అని పిలిపించుకునే అర్హత లేనట్లే. వైవిధ్యం ప్రకృతి లక్షణం. దానిని ప్రజాస్వామిక వ్యవస్థ గుర్తించాలి,గౌరవిం చాలి. వాటిని గుర్తించకపోవడం, ఆ అభివ్యక్తిని అడ్డుకోవడం నాగరికత ఎంత మాత్రం కాదు. అనుకూలమైనా, అననుకూలమైనా ,ప్రతికూలమైనా, వాటితో తనకు వ్యవస్థకు ఏకీభావం లేకపోయినా, అవి పూర్తి వ్యతిరేక భావాలైనా....వాటిని గౌరవించి తీరాలి. అదే ఆధు నికత, అదే నాగరికత. అని మన రా జ్యాంగం స్పష్టంగా చెబుతున్నది.అది పౌరుడి ప్రాథమిక హక్కు.ఆ హక్కును కోర్టులు తప్పకుండా గౌరవించి,అమలు జరిగేలా చూడాలి. న్యాయవ్యవస్థ ఈ సంగతిని అనేక మార్లు చెప్పింది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఇన్నేళ్ల తరువాత కూడా సుప్రీంకోర్టు ఒక రాష్ట్ర హై కోర్టుకు పరోక్షంగా ఈ ప్రాథమిక విషయాన్ని వివరించ వలసిన/చెప్పవలసిన దైన్యం లోకి దేశ ప్రజాస్వామ్యం దిగజారి పోయింది.సుప్రీంకోర్టు గత సంవత్సరం కూడా ఒక మారు చెప్పింది.పౌరుల హక్కుల గురించి రాజ్యాంగ కోర్టులైన హై కోర్టులకు కూడా చెప్పవలసిన దుస్థితి రావడం ఈ దేశ ప్రజాస్వామ్య స్థాయిని వెక్కిరిస్తున్నది.పౌరుల ఆలోచనలు,అభిప్రాయాలు న్యాయాధికారులకు కూడా నచ్చనవసరం లేదని కూడా సుప్రీం తేల్చి చెప్పింది.వాటిని గౌరవించి,ఆ పౌరుడి ప్రాథమిక రాజ్యాంగ హక్కును గౌరవించి తీరాలి అని వివరించింది, ఆదేశించింది. రాజ్యాం గాన్ని సంపూర్ణంగా అమలు పరుస్తూ పౌరులహక్కులను కాపాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించడమే న్యాయ వ్యవస్థ ప్రధాన కర్తవ్యం అని దేశంలోని అన్ని రాజ్యాంగ కోర్టులకు పరోక్షంగా హితవు కూడా పలికింది.దేశ అత్యున్నత కోర్టు సుప్రీమ్ చెప్పింది కాబట్టి ఇది అన్ని కోర్టులకూ ఒక ఆదేశం కిందే లెక్క. పౌరుల ఆలోచనలు,అభిప్రాయాలపై కేసులు నమోదు చేసిన,చేస్తున్న పోలీసులకు కూడా సుప్రీం చురకలు వేసింది. ముందుగా తాము పౌరులమే అన్న వాస్తవాన్ని గుర్తుంచుకోవాలని తీర్పులో పోలీసులకు కూడా చెప్పింది.కానీ రాజ్యానికి ఈ హితవు వినిపించినట్లుగా లేదు. రాజ్యం తాజాగా తనకు నచ్చని వారిని దిమాగీ నక్సల్స్ అని ముద్ర వేయ దల్చుకున్నట్లుగా అనిపిస్తున్నది. రాజ్యం విధానాలతో విభేదించే వారిని గతంలో అర్బన్ నక్సల్స్ గా ముద్ర వేసేది.తాజాగా దానికి దిమాగీ నక్సల్స్ అని కొత్త పేరు పెట్టింది.హతియారీ నక్సల్స్ అందరినీ నిర్మూలించి వేశామని,ఇక మిగిలింది దిమాగీ నక్సల్స్ అని స్వతంత్ర దినోత్సవ వేదిక నుంచి తన ఆలోచనలతో విభేదించే వారిని రాజ్యం ఈ హెచ్చరికను చేసింది.



**గోవర్ధన్ గందె,**
**9347056621.**

# అందరి బాయ్ సాబ్ టైగర్ నరేంద్ర



తెలంగాణ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే ఉద్యమ రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వరకు తనదైన ముద్ర వేసిన నాయకుల్లో అలె నరేంద్ర ఒకరు.అందరి నోటా ఆప్యాయంగా బాయ్ సాబ్ అని పిలుపించుకున్న నేత తెలుగు నేల పై నరేంద్ర మాత్రమే .స్వర్గీయ నందమూరి తారక రామారావు అన్న ఐతేహైదరాబాద్ శాన్ టైగర్ నరేంద్ర బాయ్ సాబ్. పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రి గా, తెలంగాణ ఉద్యమానికి అనుకూలంగా గళమెత్తిన రాజకీయ నాయకుడిగా ఆయన ప్రయాణం ప్రత్యేకమైనది. ఆయన రాజకీయ జీవితం అనేక మలుపులతో సాగినా, తెలంగాణ పట్ల ఆయనకున్న రాజకీయ నిబద్ధత ప్రధానం గా గుర్తుండిపోయింది.ఆలె నరేంద్ర తొలుత కాంగ్రెస్ రాజకీయాలతో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం భారతీయ జనతా పార్టీలో చేరి జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1990లలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ మళ్లీ రాజకీయ చర్చల్లోకి వస్తున్న సమయంలో నరేంద్ర ఆ అంశాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక రాష్ట్రం అవసరమనే వాదనను జాతీయ స్థాయిలో వినిపించిన నాయకుల్లో ఆయన ఒకరు.1999లో మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆయన పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఈ సమ యంలో తెలంగాణ సమస్యను కేంద్ర రాజకీయాల్లో ప్రస్తావించడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ముఖ్యమైన అంశంగా నిలిచింది.అయితే ఆయన రాజకీయ జీవితం ఎప్పుడూ ఒకే దారిలో సాగలేదు. తెలంగాణ విషయంలో బీజేపీ వైఖరితో విభేదాలు ఏర్పడటంతో ఆయన పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ సాధన సమితిని ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా రాజకీయ శక్తులను ఏకం చేయడానికి ప్రయత్నించారు. అనంతరం తెలంగాణ సాధన సమితిని తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)లో విలీనం చేయడం మరో కీలక మలుపు. ఆతరువాత కేంద్రం లో ఏర్పడ్డ మన్మోహన్ సింగ్ ప్రభుత్వం లో కేంద్రమంత్రిగా పనిచేశారు.తెలంగాణ ఉద్యమ రాజకీయాల్లో కేసీఆర్‌తో కలిసి పనిచేసిన దశ కూడా నరేంద్ర జీవితంలో ప్రాధాన్యమైనది. నరేంద్ర కు ఉన్న పాపులారిటీ ని జీర్ణించు కోలేని శక్తులు ఆయన పై అనేక అబద్ధాలు ప్రచారం చేసి పార్టీ నుండి తొలగించారు. రాజకీయ విభేదాలు ఏర్పడి ఆయన మళ్లీ టీఆర్ఎస్‌కు దూరమయ్యారు. చివరకు కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చిన ఆయన రాజకీయ జీవితం మరో కొత్త దశలోకి ప్రవేశించింది.అలె నరేంద్ర రాజకయాలను కేవలం పార్టీ మార్పుల కోణంలో చూడటం సరైంది కాదు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను జాతీయ రాజకీయాల్లోకి తీసుకెళ్లడానికి ఆయన చేసిన ప్రయత్నాలను కూడా అదే సమయంలో పరిశీలించాలి. ప్రత్యేక రాష్ట్రం కోసం వివిధ రాజకీయ శక్తులను సమీకరించాలనే ఆలోచన ఆయన రాజకీయ జీవితంలో పదేపదే కనిపించింది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆయన జీవితం ముగిసిపోయినా, తెలంగాణ రాజకీయ పరిణామాలను అధ్యయనం చేసే వారికి అలె నరేంద్ర ఒక ముఖ్యమైన రాజకీయ పాత్రధారి. ఉద్యమం, పార్టీ రాజకీయాలు, పార్లమెంటరీ రాజకీయాలు, కేంద్ర మంత్రిత్వ బాధ్యతలు ఈ నాలుగు విభిన్న రంగాల్లో ఆయన ప్రయాణం సాగింది.తెలంగాణ రాజకీయ చరిత్రలో కొందరు నాయకులు అధికారంతో గుర్తుండిపోతారు. మరికొందరు ఒక రాజకీయ ఆకాంక్షకు స్వరం ఇచ్చినందుకు గుర్తుండిపోతారు. అలె నరేంద్ర రెండో కోవకు చెందిన నాయకుడిగా తెలంగాణ రాజకీయ చరిత్రలో తనదైన స్థానం సంపాదించుకున్నారు.

**-కటకం నర్సింగ్ రావు**
**మన ఆలోచన సమితి అధ్యక్షుడు.**

# పాతబస్తీ రాజకీయాలకు పదును పెట్టిన ‘టైగర్ నరేంద్ర’

## నేడు నరేంద్ర 80వ జయంతి

ఆధిపత్య రాజకీయాల మాటున దాచి ఉంచిన ఒక పోరాట చరిత్ర. 1946లో హైదరాబాద్‌లో ఆలె రామలింగం, ఆలె పుష్పవతిల సంతానంగా సాధారణ కుటుంబంలో జన్మించిన ఆలె నరేంద్ర కుటుంబ విలువల నుంచి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి, ఐదు దశాబ్దాల రాజకీయ ప్రయాణంతో ప్రత్యేక చరిత్రను సృష్టించారు. హైదరాబాద్ పాతబస్తీ రాజకీయ వాతావరణం ఆయన వ్యక్తిత్వాన్ని మరింత పదునుపెట్టింది. ప్రజలతో నేరుగా కలవడం, సమస్యలపై దూకుడుగా స్పందించడం, రాజకీయ ప్రత్యర్థులను ధైర్యంగా ఎదుర్కోవడం ఆయన స్వభావం. ఆ స్వభావమే ప్రజలుటైగర్ నరేంద్ర అని పిలుచుకునేలా చేసింది. టైగర్ నరేంద్ర అనేది ఒక ముద్దుపేరు కాదు. ప్రజల సమస్యలపై ఆయన చూపిన ధైర్యం, రాజకీయ ప్రత్యర్థుల ముందు వెనుకడుగు వేయని నైజానికి ప్రతీక. పాతబస్తీ రాజకీయాల నుంచి ఎదిగి ఆర్ఎస్ఎస్, జనసంఘ్, బిజెపి రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి ఒక ఓటు రెండు రాష్ట్రాలు అనే నినాదాన్ని బీజేపీ నాయకత్వం ద్వారా ఒప్పించి, చెప్పించిన ఘనత నరేంద్ర కే దక్కుతుంది. ఐనప్పటికీ 2000 ప్రాంతంలో ప్రత్యేక తెలంగాణ డిమాండ్ మళ్లీ రాజకీయంగా బలపడుతున్న తరుణంలో, తెలంగాణ రాష్ట్రం కోసం మరింత స్పష్టమైన రాజకీయ పోరాటం అవసరమని ఆలె నరేంద్ర తన పుట్టిన నేల ఆకాంక్షల కొరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీజేపీ అంటే నరేంద్ర, నరేంద్ర అంటే బీజేపీ అనే విధంగా ఎదిగి తానే కర్త, కర్మ, క్రియలా ఉన్న పార్టీ తెలంగాణ పట్ల అనుసరిస్తున్న రాజకీయ వైఖరిని విభేదించి ఆయన బీజేపీని విడిచి తెలంగాణ కోసం ఆయన తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయమే ఆయన రాజకీయ జీవితానికి అసలు ప్రత్యేకతను తెచ్చింది. దాని కోసమే తెలంగాణ సాధన సమితి ఆవిర్భావం. తెలంగాణ ఉద్యమాన్ని ఐక్యంగా నిర్మించడం కోసం టీఆర్ఎస్‌లో తన పార్టీని విలీనం చేసి ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేశారు. నరేంద్ర రాజకీయ అనుభవం, ప్రజా పరిచయం, తెలంగాణపై ఆయనకున్న రాజకీయ అవగాహన, తెలంగాణ ఉద్యమానికి రెట్టింపు బలాన్ని చేకూర్చాయి. తను నమ్మిన విలువల కోసం, తెలంగాణ సాధన కోసం కఠినమైన రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ప్రత్యేక తెలంగాణ లక్ష్యాన్ని మరువని తన వ్యక్తిత్వాన్ని నిరూపిస్తాయి. భారతదేశ స్వాతంత్ర్యానికి సంవత్సరం ముందు జన్మించిన ఆలె నరేంద్ర ప్రత్యేక తెలంగాణ సాకారం అవ్వడానికి నెలన్నర ముందు నిష్క్రమించారు. ఆ చరిత్రలో ఆలె నరేంద్ర అధ్యాయం కూడా ఒక ప్రధాన భూమిక.

ఆధిపత్య కథనాల మాటున కనుమరుగైన చరిత్ర....

చరిత్రలో ఒక ఉద్యమం విజయవంతమైన తరువాత, ఆ విజయానికి సంబంధించిన ప్రధాన కథనం కొద్దిమంది నాయకుల చుట్టూ కేంద్రీకృతమవుతుంది. ఆ కోణంలో ఆలె నరేంద్ర రాజకీయ జీవితం ఆధిపత్య రాజకీయ కథనాల మాటున కనుమరుగైన ఒక ముఖ్యమైన చరిత్రగా వర్ణించవచ్చు. ప్రజలు ప్రేమగా టైగర్ నరేంద్ర అని పిలుచుకున్న ఆయనను కేవలం ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా భవిష్యత్తు తరాలకు టైగర్ నరేంద్ర ఇచ్చే స్ఫూర్తిగా చూడాలి. నమ్మిన లక్ష్యం కోసం ధైర్యంగా నిలబడడం, పదవి కంటే ప్రజా లక్ష్యం గొప్పదని, విభేదాలను ఎదుర్కొనే ధైర్యం ఉండాలని, విజయంతో పాటు ఓటమిని కూడా స్వీకరించాలని టైగర్ నరేంద్ర ఒక ముగింపు కాదు, ఒక స్ఫూర్తిగా నిలిచారు. ఈ నెల 20వ తేదీ గురువారం టైగర్ నరేంద్ర జయంతి సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మన ఆలోచన సమితి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు.

**కటకం సుభాష్, సీనియర్ జర్నలిస్ట్**



## ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన ఫొటో జర్నలిస్టులు

విశ్వంభర, అమీర్‌పేట : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదు వెంగళరావునగర్ పార్కులో మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు జి. భాస్కర్ నేతృత్వం వహించారు. ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని భాస్కర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణతోనే సమస్త జీవరాశుల మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో: గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర సమన్వయకర్త గ్రిధర్, సతీష్, అసోసియేషన్ సభ్యులు ఠాకూర్, సర్వేశ్వర్‌రెడ్డి, వడ్డమేశ్‌గౌడ్, విజయ్ మద్దు, చిన్న యాదగిరిగౌడ్, కృష్ణ, సూర్య శ్రీధర్, ముజీబ్, షేక్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆసుపత్రి సమస్యలు పరిష్కరించాలి



విశ్వంభర, సికింద్రాబాద్ : సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో ఐద్వా ప్రతినిధి బృందం నిర్వహించిన సర్వేలో పలు సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. రోగులకు సరిపడా మందులు అందుబాటులో లేవని, ఆర్థోపెడిక్ విభాగంలోని కొన్ని పరికరాలు పనిచేయకపోవడంతో పరీక్షలను బయట చేయించుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రసవాల సమయంలో సీనియర్ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైద్యులు, సిబ్బంది రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తరచూ తనిఖీలు నిర్వహించాలని, ఆరోగ్యశాఖ మంత్రి గాంధీ ఆసుపత్రిని సందర్శించి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, కేవీ ఆశాలత, కే. నాగలక్ష్మి, వై. వరలక్ష్మి, ఏ. పద్మ, ఎండి షబానా బేగం పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ దీక్ష




విశ్వంభర, రామన్నపేట: తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో బుధవారం రోజు ఉదయం 11.00.గంటలకు ఒక రోజు దీక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకరికంటి రాము మాట్లాడుతూ, ప్రతి కార్మికుడికి పోస్టల్ ఇన్సూరెన్స్ చేయాలని, 51 జీవోను రద్దు చేయాలని, నాలుగో లేబర్ కోర్టులను రద్దు చేయాలని, ఆన్లైన్లో లేని కార్మికుల పేర్లు వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలని, డిమాండ్లతో కూడిన వినతి పత్రం మండల అభివృద్ధి అధికారి ఆవుల రాములుకు ఇవ్వడం జరిగినది. వారి ముఖ్య డిమాండ్లలో కనీస వేతనం ప్రతి కార్మికునికి 26,000 రూపాయలు ఇవ్వాలని, రెండవ పీఅర్సీ ప్రతి కార్మికునికి వర్తించాలని, జివో నెంబర్ 51ని సవరించాలని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల భిక్షం, మండల అధ్యక్షులు గాదె ఎల్లయ్య, బొడ్డు సాలయ్య, దాసు నాగరాజు, సాయిలు, వీరేశం, బచ్చ లింగస్వామి, గడ్డం ఎల్లయ్య, నల్ల సుగుణమ్మ, చిత్రకంటి శోభ, భారతమ్మ, కవిత, ప్రమీల, మంగమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే యువశక్తి లక్ష్యం

విశ్వంభర, బాగ్ లింగంపల్లి : విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారమే యువశక్తి పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మడ్డి రాజు గౌడ్ తెలిపారు. హైదరాబాదు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో పార్టీ జెండా, మేనిఫెస్టోను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేశారు. యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభి వృద్ధి, రైతులకు గిట్టుబాటు ధర, నాణ్యమైన విద్య, వైద్యం అందించడంపై పార్టీ దృష్టి సారిస్తుందని రాజు గౌడ్ చెప్పారు. పారదర్శక, అవినీతి రహిత పాలనతో పాటు మహిళా సాధికారత, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సందీప్ యాదవ్, అరుణ్, తరుణ్, నరేష్, విద్యార్థి, మహిళా నాయకులు పాల్గొన్నారు.



# సోలార్ విద్యుత్తు ఏర్పాటుపై దృష్టి సారించాలి

### ఆరుతడి పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించండి : ఇనుగుర్తి మండల సమీక్షలో ఎమ్మెల్యే మురళి నాయక్



విశ్వంభర, ఇనుగుర్తి: గుడిసెల్లేని రాష్ట్రం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలల సాకారానికి గ్రామాలలో గుడిసెల్లో ఉంటున్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి గుడిసెలు లేని గ్రామాలుగా రూపుదిద్దుకున్నామని ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్ అన్నారు. గ్రామపంచాయతీ స్ట్రీట్ లైట్స్ తో పాటు రక్షిత మంచినీటి బావులు,బోర్లకు సోలార్ విద్యుత్తు వాడేందుకు దృష్టి సారించుకుం దామని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. మండల కేంద్రం ఇనుగుర్తి రైతు వేదికలో సర్పంచులు అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ప్రస్తుతం ఎల్ నినో కొనసాగు తోందని రెండు నెలలు అనంతరం సూపర్ ఎల్నినో వచ్చే ప్రమాదం ఉన్నందున త్రాగునీటి కోసం ప్రత్యామ్నా య ఏర్పాట్లు ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే కోరారు. కోమటిపల్లి సర్పంచ్ మద్దెల బిక్షపతి,చీన్య తండా హరి చందు, ఇనుగుర్తి తమ్మడపల్లి కుమార్, తారా సింగ్ తండా బద్రు నాయక్, పాత తండా నరేష్,లక్ష్మీపురం కళావతి శ్రీనివాసరెడ్డి, చిన్ననాగారం సుజాత యాకయ్య, లాలు తండా లక్ష్మీ వెంకన్న,మీట్యా చిన్ని వెంకన్న గ్రామాలలో పాతబావులను పునరుద్ధరిం చాలని, కొత్తగా కొన్నిచోట్ల బావులు బోర్లు వేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సరైన ప్రణాళికల ను తయారుచేసి ప్రతిపాదనలు పంపించండి ఎమ్మెల్యే తెలిపారు. చిన్ననాగారం సర్పంచి చెడపాక సుజాత యాకయ్య గ్రామంలోని రక్షిత మంచినీటిబా వులకు సోలార్ విద్యుత్ మోటార్లను మంజూరు చేయాలని విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కష్టమవుతోంది అన్నారు. గ్రామంలో పైప్ లైన్ జీర్ణావస్థకు చేరుకుందని పైప్ లైన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి సోలార్ విద్యుత్ కోసం సర్పంచి సుజాత మంచి ప్రతిపాదన తీసుకువచ్చారని గ్రామాలలో సోలార్ తో మోటార్లు, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు చెల్లించకుండా ఆదా అవుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామంలో గ్రామం మొత్తం సోలార్ విద్యుత్ వాడుతున్నారని గుర్తు చేశారు. దీంతో సర్పంచ్ లందరూ ఏకీభవించారు. విద్యుత్ఏ ఈ పనితీరుపై సర్పంచులు అసహనం వ్యక్తం చేయడం, గతంలో నిర్వహించిన సమావేశాలకు గైర్హాజరు కావడం పట్ల ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేస్తూ సస్పెండ్ చేయాలని స్పెషల్ ఆఫీసర్ మల్లేశ్వరిని ఆదేశించారు. గ్రామాల్లో రైతులు ఆరుతడి పంటలు వేసేలా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సర్పంచులకు సూచించారు. గతంలో కరోనా మూలంగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని, ఇప్పుడు ఎల్ నినో తో వర్షాలు లేకుండా తీవ్ర కష్టాలు ఎదురయ్యే పరిస్థితి పొంచి ఉందని దీనిని దృష్టిలో ఉంచుకొని నీటి సంబంధిత వరి తదితర పంటలు కాకుండా బ్రతకడం కోసం ఆరుతడి పంటలను సాగు చేసే విధంగా గ్రామస్తులకు వివరించాలని కోరారు. ఎస్సారెస్పీ కాలువల పూడిక తీత, ట్రీ కటింగ్స్ కోసం నియోజక వర్గానికి రెండు కోట్లు మంజూరు చేయించాలని సర్పంచులు కాలువల వద్ద పనులు చేయించు కోవాలని సూచించారు. సర్పంచులను అధికారులు గౌరవించి స్పందించి వెంటనే పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి తమ్మడపల్లి కుమార్, ప్రత్యేకధికారి మల్లేశ్వరి,తహసిల్దార్ సుంకర శ్రీనివాసులు, ఎంపీడీవో పార్ధసారథి, ఎం ఏ ఓ షేక్ యాస్మిన్ వివిధ గ్రామాల సర్పంచులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీరు నిల్వ ఉండకుండా చూసుకుందాం.. దోమలను తరిమికొడుదాం

### పాలెం వైద్యాధికారి డాక్టర్ ఎం. ప్రియాంక




విశ్వంభర, నాగర్‌కర్నూల్: దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడం, దోమల నియంత్రణకు అవసరమైన జాగ్రత్తలను వివరించడం లక్ష్యంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహిస్తారని పాలెం వైద్యాధికారి డాక్టర్ ఎం. ప్రియాంక తెలిపారు. ఆడ అనాఫిలిస్ దోమల ద్వారా మానవులకు మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని 1897లో ప్రముఖ వైద్య శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రోస్ కనుగొన్నారని ఆమె పేర్కొన్నారు. అంటువ్యాధులపై ఆయన చేసిన విశేష పరిశోధనలకు గుర్తింపుగా 1902లో నోబెల్ బహుమతి లభించిందని తెలిపారు. ఈ గొప్ప ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని డాక్టర్ ప్రియాంక హెచ్చరించారు. ముఖ్యంగా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం దోమల వృద్ధికి అనుకూలంగా మారుతుందని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించడం ద్వారా దోమల పెరుగుదలను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, నిల్వ నీటిని తొలగించాలని తెలిపారు. నీటి తొట్టెలు, కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, డిస్పోజబుల్ గ్లాసులు తదితర వస్తువుల్లో నీరు నిల్వ కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమల నియంత్రణ కేవలం ఆరోగ్యశాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతోనే దోమల ద్వారా వచ్చే వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ దోమల నియంత్రణపై అవగాహన పెంచుకుని, తమ కుటుంబంతో పాటు సమాజ ఆరోగ్య పరిరక్షణకు బాధ్యతగా వ్యవహరించాలని పాలెం వైద్యాధికారి డాక్టర్ ఎం. ప్రియాంక ప్రజలకు సూచించారు.

# జర్నలిస్టులకు ఈ నెలలోనే హెల్త్ కార్డులు



విశ్వంభర, హైదరాబాదు : జర్నలిస్టులకు ఈ నెలలోనే హెల్త్ కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ జి. ముకుందరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల పట్టాల అంశాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా మని, విధానపరమైన నిర్ణయం అనంతరం ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. హైదరాబాదు బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ స్టేట్ ఫొటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 'బెస్ట్ న్యూస్ ఫొటో పోటీ-2026', ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఫొటోజర్నలిస్టులు వార్తా పత్రికలకు ప్రాణం వంటివారని అన్నారు. సమాజంలోని కీలక ఘటనలను భవిష్యత్ తరాలకు అందించే శక్తి వారి ఫొటోలకు ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, సామాజిక ఉద్యమాలను వాస్తవికంగా ప్రజల ముందుంచడంలో వారి పాత్ర కీలకమన్నారు. ప్రముఖుల పేర్లతో గతంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ అవార్డులను పునరుద్ధ రించాలని ప్రభుత్వానికి సూచించారు. ఫొటోగ్రఫీ రంగానికి మరింత ప్రోత్సాహం కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీజేఏ ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, ఉపాధ్యక్షులు పి. రామ్మూర్తి, టి. కిషోర్‌సింగ్, కోశాధికారి కె. అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఎం.ఎ. సర్వర్, జి. వసంత్‌కుమార్, ఎన్. శివకుమార్, మహ్మద్ అలీమోద్దీన్, ఎ. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష




విశ్వంభర, మహబూబాబాద్: బుధవారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, , మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ , సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జిల్లాలో ప్రజారోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ గర్భిణీల రిజిస్ట్రేషన్‌ను వంద శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నివారించగల అబార్షన్లు జరగకుండా అవసరమైన అవగాహన, వైద్య సేవలు మరియు పర్యవేక్షణ చేపట్టాలని, 14--15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సిన్‌ను వంద శాతం అందించేలా చర్యలు తీసుకోవాలని ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు చేపట్టి, వ్యాధుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఫైలేరియా బాధితులు అర్హత మేరకు పెన్షన్‌కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించి, అవసరమైన సహాయాన్ని అందించాలని అన్నారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ స్క్రీనింగ్‌ను వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య కేంద్రాల్లో నిర్ణీత సమయపాలన పాటిస్తూ, ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ప్రమీలారావు, డా. సుధీర్‌రెడ్డి, ప్రోగ్రామ్ అధికారులు శివ, అర్జున్, ప్రాథమిక వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి బుధవారం తెలంగాణ శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, మరియు ప్రొఫెసర్ కే నాగేశ్వర్ లను మర్యాదపూర్వకంగా కలిశారు.
టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి బుధవారం తెలంగాణ శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ లను మర్యాదపూర్వకంగా కలిశారు.

## విధుల్లోకి తిరిగి తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, నీర్నెముల గ్రామానికి చెందిన బాలరాజు, రామన్నపేట పట్టణానికి చెందిన చెరుకు సత్యనారాయణ గతంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేశారు. 2006 నుంచి 2019 వరకు విధులు నిర్వహించిన తమను జాబ్‌కార్డుల్లో పనిదినాలు 10 శాతానికి తగ్గిన కారణంగా విధుల నుంచి తొలగించినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం వీబీజీ రామ్‌జీ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా తిరిగి పనిచేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు బుధవారం రోజు రామన్నపేట మండల ఎంపీడీవో ఏ.రాములు, ఏపీవో వెంకన్న లకు వినతిపత్రం అందజేశారు. గతంలో సుమారు 13 సంవత్సరాల పాటు అందించిన సేవలు, తమకు ఉన్న అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు అధికారులను విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకం అమలులో తమ అనుభవాన్ని వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని కోరారు.

## అడ్వర్టైజ్‌మెంట్ టెండర్లు రద్దు చేయాలి



విశ్వంభర , హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి డివైడర్ల మధ్య అడ్వర్టైజ్‌మెంట్ బోర్డుల ఏర్పాటుకు చేపట్టిన టెండర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఎస్పీ నాయకులు బుధవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, నోటీసు బోర్డుపై టెండర్ ప్రకటన చేయకుండా ఏకపక్షంగా టెండర్ కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. టెండర్‌ను ఎవరి ప్రయోజనం కోసం కేటాయించారో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ప్రకటనల ద్వారా మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయ వివరాలను కూడా బహిర్గతం చేయాలని కోరారు. ఈ వ్యవహారంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. అడ్వర్టైజ్‌మెంట్ టెండర్‌ను వెంటనే రద్దు చేయకపోతే అఖిలపక్షాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపడతామని రవీందర్‌గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మొగిలిపాక శ్రీనివాస్, వేల్పుల రాజు తదితరులున్నారు.

## ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవం సందర్బంగా జెండా ఆవిష్కరించిన ఇనుముల నాగరాజ

విశ్వంభర, జనగామ : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా దేవరుప్పుల మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండలకేంద్రంలోని డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జెండా ఆవిష్కరించిన ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు. ఈ సందర్బంగా ఇనుముల నాగరాజు మాట్లడుతూ ఫోటోగ్రాఫర్లు అందరూ ఐకమత్యంతో ఉండి సంఘం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నల్ల సతీష్,ప్రధాన కార్యదర్శి నోముల సతీష్,కోశాధికారి బానోత్ సంతోష్,కుటుంబ భరోసా ఇన్చార్జి బానోతు వీరు నాయక్,సీనియర్ నాయకులు బండారు యాదగిరి,మహేశ్వరం నాగేష్,గుమ్మడవెల్లి యాదగిరి,గుమ్మడవెల్లి సోమేశ్,రెడ్డి రాజుల శ్రీకాంత్,ధరావత్ సుదీర్,బాశిపక ఉపేందర్, అలీఫ్,నల్ల నరసింహులు,చింత సురేష్ తదితరులు పాల్గొన్నారు.





## రహదారి పనులను పరిశీలించిన మార్కెట్ వైస్ చైర్మన్ అయ్యుబ్

విశ్వంభర, పరిగి: పట్టణం నుంచి ఎర్రగడ్డపల్లి, సుల్తాన్ నగర్, నారాయణపూర్ వైపు వెళ్లే ప్రధాన రహదారి పనులను స్థానిక మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయ్యుబ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి, కౌన్సిలర్ యూసుఫ్, కోఆప్షన్ సభ్యులు అంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రహదారి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించడం జరిగిందన్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. రహదారి అభివృద్ధి పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొనారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బద్రి, నాయకులు అంజి, తదితరులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



విశ్వంభర, నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల అనురాగ్ కాలనీ 273 డివిజన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కొలను రాశేఖర్ రెడ్డి, కొలను వీరేందర్ రెడ్డి, కొలను జీవన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ రామకృష్ణ కాలనీవాసులు, కార్యకర్తలు షకిల్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లే వరకు పోరాటం ఆగదు.. ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వాణిజ భవన్ సెంటర్‌లో నిరసన దీక్ష



విశ్వంభర, సూర్యాపేట: సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ మార్గం ఏర్పాటు చేసే వరకు తమ పోరాటం ఆగదని సూర్యాపేట ఆర్యవైశ్యులు స్పష్టం చేశారు. ఈ డిమాండ్‌తో సోమవారం వాణిజ భవన్ సెంటర్‌లో నిర్వహించిన నిరసన దీక్ష కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ మార్గం ద్వారా ప్రయోజనం కల్పించేలా సంబంధిత అధికారులు, ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రాష్ట్ర, జిల్లా ఆర్యవైశ్య మహాసభ నాయకులతో పాటు శ్రీ వాసవి సేవా సమితి కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో ఓరియంటేషన్ కార్యక్రమం



విశ్వంభర, సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీలో ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ డాక్టర్ డి. గంగాధర్ రావు, సెక్రటరీ శ్రీ వనం సత్యేందర్, ట్రెజరర్ వి. జయరాజ్ మాట్లాడుతూ... రెండు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన ఈ విద్యా సంస్థలో ల్యాబ్స్, లైబ్రరీ వంటి అన్ని వసతులు అద్భుతంగా ఉన్నాయని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే ఫీజులు వసూలు చేస్తూ నాణ్యమైన విద్యనందిస్తున్నామని అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. ముత్యాల రాజు మాట్లాడుతూ... ప్రతి ఏటా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఇక్కడి విద్యార్థులు రూ.5 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు వేతన ప్యాకేజీలతో ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీలు డా. సిహెచ్. సురేష్ కుమార్, డి. నాగరాజు, డా. జి. వెంకటేష్, ఆర్. శివ శంకర్, బి. గాంధీ, పి. వెంకటేష్ మరియు సూపర్‌డెంట్లు కే. జానకిరాములు, బి. శ్రీనివాస్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

## చేనేత కార్మిక సంఘం కార్యవర్గానికి సన్మానం

విశ్వంభర, మోత్కూరు : నూతనంగా ఎన్నికైన చేనేత కార్మిక సంఘం కార్యవర్గ సభ్యులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు వంగరి రాములు, మోత్కూర్ చేనేత సహకార సంఘం కోశాధికారి పోచం కన్నయ్య మార్కండేయ చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు దోర్నాల హరీష్, కార్యదర్శి తాటి లక్ష్మణ్ గార్ల చేతుల మీదుగా నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, వారి సంక్షేమం మరియు అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు సంఘం ఐక్యతతో పనిచేయాలని సూచించారు. చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా నూతన కార్యవర్గం ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



# గడపగడపకు బీజేపీని తీసుకెళ్లాలి..

### బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి..



విశ్వంభర , హుస్నాబాద్ : బీజేపీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణంలోని వి.ఎల్.రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ హుస్నాబాద్ రూరల్ మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు బుక్యా సంపత్ నాయక్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బైరి శంకర్ ముదిరాజ్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని, గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని పటిష్ఠం చేయాలని అన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గడపగడపకు బీజేపీని తీసుకెళ్లే లక్ష్యంతో శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మండల ప్రభారీ తోట స్వరూప, రాష్ట్ర నాయకురాలు లక్కిరెడ్డి తిరుమల, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల కుమారస్వామి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నునావత్ మోహన్ నాయక్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, మాజీ మండల అధ్యక్షులు చెక్కబండి విద్యాసాగర్‌రెడ్డి, వెలదండి రాజేంద్రప్రసాద్, ఓబీసీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని సతీష్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి బొల్లి శ్రీనివాస్, లావుడియా రాజన్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శులు బైరి అరుణ్, తడిసిన రత్నాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కుంట మల్లయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, బూతగడ్డ బాలరాజు, కోశాధికారి కనకట్ల కిషన్, బూత్ అధ్యక్షులు బొల్లి సుధాకర్, మెరుగు రవీందర్, రాములు, పోలు సందీప్, గంటల రాజేందర్, బాలరాజు, ఇస్లావత్ తిరుపతి, గీకురు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మగాని ఈశ్వర్, బొమ్మగాని జగన్నాథం, ఇటిక్యాల కుమారస్వామి, పిట్టల సంతోష్, కన్నె శంకర్, పోలవేణి శ్రీనివాస్, పోలు శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెత్త సేకరణలో ఆటో సిబ్బంది ఇష్టారాజ్యం

### చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌కు బస్తీవాసుల విజ్ఞప్తి



విశ్వంభర, గౌలిపుర: పాతబస్తీ గౌలిపుర డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ ప్రాంతంలో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త సేకరించే ఆటో సిబ్బంది ప్రతిరోజూ, సమయానికి రాకుండా మూడు నుంచి నాలుగు రోజులకోసారి మాత్రమే వస్తున్నారని ఆరోపించారు. దీంతో ఇండ్లలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని, వర్షాకాలం కావడంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధుల బారిన పడతారేమోనని భయభ్రాంతులకు గురవుతున్నట్లు తెలిపారు. చెత్త సేకరణలో జరుగుతున్న జాప్యంపై ఆటో సిబ్బందిని ప్రశ్నించినప్పుడు వారు ప్రజలతో దురుసుగా వ్యవహరిస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. గతంలో ఇదే సమస్యపై ప్రజావాణి కార్యక్రమంలో డీసీ సుభాష్‌రావుకు, అలాగే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన డీసీ సుభాష్‌రావు గౌలిపుర డివిజన్ జీహెచ్‌ఎంసీ జవాన్ బిక్షపతితో మాట్లాడగా, చెత్త తరలింపు కోసం రిక్షా కార్మికుడిని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం చెత్త తరలిస్తున్న రిక్షా కార్మికుడితో ఆటో సిబ్బంది గొడవపడి, అతడిని దూషించడంతో రిక్షా కార్మికుడు కూడా చెత్త సేకరణను నిలిపివేశాడని బస్తీవాసులు తెలిపారు. దీంతో శ్రీరాంనగర్ ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్య మరింత తీవ్రమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై జోనల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి, చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలతో దురుసుగా వ్యవహరిస్తున్న ఆటో సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుని వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని శ్రీరాంనగర్ బస్తీవాసులు కోరుతున్నారు.

# ఇష్టపడి చదివితేనే విద్యార్థినిలకు ఉజ్వల భవిత

### ఎమ్మెల్యే డా.మురళి నాయక్



విశ్వంభర, ఇనుగుర్తి: ఇష్టపడి చదివితే ఉజ్వల భవిత చేకూరుతుందని ఎమ్మెల్యే డా.భూక్య మురళీ నాయక్ విద్యార్థినులకు సూచించారు. మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయాన్ని ఎమ్మెల్యే బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను బాల్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేశానని ఏకాగ్రతతో చదవడంతోనే డాక్టర్ అయ్యానని ఈ క్రమంలో రాజకీయ రంగంలో ప్రవేశించి ఎమ్మెల్యేగా గెలుపొందానన్నారు. దీనంతటికీ చదివే కారణమని అందుకే మీరు ఎంచుకున్న కలల సాకారం కోసం క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలన్నారు. అంతకుమునుపు ఎమ్మెల్యే పాఠశాలలోని తరగతి గదులు పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ఎమ్మెల్యే మురళి నాయక్ నేరుగా మాట్లాడి వారి చదువు, భోజనం, వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్ జయశ్రీ కి ,అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచి తమ్మడపల్లి కుమార్, స్పెషల్ ఆఫీసర్ మల్లేశ్వరి, తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో పార్థసారధి ఉపసర్పంచి సత్తూరి యాదగిరి, వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బైరు అశోక్ గౌడ్,ఏఎంసీ డైరెక్టర్ కొట్టం రాము పాఠశాల సిబ్బంది, పాధ్యాయులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలకు సహకరిస్తూ ఆధార్‌లో పుట్టిన తేదీ మార్పు చేస్తే చర్యలు తప్పవు

### ఈడీఎం యుగంధర్ హెచ్చరిక




విశ్వంభర, మహబూబాబాద్: బాల్య వివాహాలకు సహకరించే ఉద్దేశంతో ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీ మార్పులు చేస్తే సంబంధిత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈడీఎం యుగంధర్ హెచ్చరించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలోని మీసేవ నిర్వాహకులకు బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీఎం యుగంధర్ మాట్లాడుతూ, జిల్లాలో బాల్య వివాహాలు జరిపేందుకు కొందరు తల్లిదండ్రులు, మధ్యవర్తులు ఇతరుల సహకారంతో ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీలను మార్పు చేయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఇందులో కొందరు మీసేవ నిర్వాహకుల సహకారం కూడా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి కమలాకర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకున్నా లేదా చదువుకోకపోయినా, వారి వయసుకు సంబంధించిన ఆధార్ వివరాల్లో మార్పులు చేసి 18 సంవత్సరాలు నిండినట్లు చూపిస్తూ వివాహాలు జరిపిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి చర్యలకు గ్రామస్థాయి నుంచి, మీసేవ కేంద్రాల నుంచి ఎవరైనా సహకరిస్తే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం బాల్య వివాహానికి సహకరించే ప్రతి ఒక్కరూ శిక్షకు అర్హులేనని ఆయన తెలిపారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డు ఒక్కటే ప్రామాణిక పత్రం కాదని, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం లేదా విద్యా సంబంధిత స్టడీ సర్టిఫికెట్ వంటి అధికారిక పత్రాలను పరిశీలించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు మీసేవ నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎటువంటి అక్రమ మార్పులకు సహకరించవద్దని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి నరేష్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ మహేశ్వరి, జెండర్ స్పెషలిస్ట్ అరుణ, మీసేవ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన కూన శ్రీశైలం గౌడ్

విశ్వంభర, గాజుల రామారం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం పరిధిలోగల వెన్ ఎన్ క్లేవ్ సరస్వతి ఆర్కేడ్, మెట్కన్ గూడ కాలనీల లో సుమారు 79 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులను కాలనీవాసులు, కార్యకర్తలతో కలిసి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కోన శ్రీశైలం గౌడ్ ప్రారంభించారు.

## నాలుగు నెలలైనా అందని ఇందిరమ్మ ఇంటి నిధులు అధికారులను వేడుకున్న నిరుపేద వికలాంగురాలు

విశ్వంభర, గుండాల: ఇందిరమ్మ ఇల్లు మంజూరై నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఇంటి నిర్మాణానికి సంబంధించిన ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలానికి చెందిన ఓ నిరుపేద వికలాంగురాలు ఆవేదన వ్యక్తం చేసింది. తన ఆర్థిక, సామాజిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. నిరుపేద వికలాంగురాలైన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై నాలుగు నెలలు పూర్తయినప్పటికీ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు ఇప్పటివరకు విడుదల కాలేదని తెలిపింది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో సొంతంగా ఇంటి నిర్మాణం పూర్తి చేయడం తనకు ఎంతో భారంగా మారిందని, ప్రభుత్వ ఆర్థిక సహాయంపైనే పూర్తిగా ఆధారపడి ఉన్నానని పేర్కొంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం పునాదులు వేసి, పిల్లర్ల వరకు పనులు చేపట్టినట్లు ఆమె తెలిపింది. అయితే ప్రభుత్వం నుంచి నిధులు అందకపోవడంతో తదుపరి నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేసింది. నిధుల కోసం ఎదురుచూస్తూ కాలం గడుస్తోందని, అధికారులు స్పందించి తన సమస్యను పరిష్కరించాలని వేడుకుంది. పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఇంటి నిర్మాణానికి సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేసి, నిర్మాణ పనులు పూర్తి చేసుకునేలా సహకరించాలని అధికారులను కోరింది. నిరుపేద వికలాంగురాలినైన తన పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి ఇందిరమ్మ ఇంటి నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది.

## రామన్నపేటలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో బుధవారం రోజు రామన్నపేట మండల ఫోటో , వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా జాతీయ జండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మెడబోయిన ఉపేందర్, జిల్లా ప్రచార కార్యదర్శి భాషమల్ల సంతోష్ కుమార్, కార్యదర్శి కమల్ శెట్టి శ్రీకాంత్, గౌరవ సలహాదారులు నాగటి యాదయ్య, మొగిలి రమేష్, వెంకటరమణ, నకిరేకంటి రవి, నకరికంటి శీను, రుద్ర చంద్రశేఖర్, మహేందర్, భార్గవ్, ఆది తదితరులు పాల్గొనడం జరిగింది.

## వినియోగదారుల మన్ననలు పొందాలి



విశ్వంభర, సూర్యాపేట: సూర్యాపేట:వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను విక్రయించి వారి మన్ననలు పొందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన లక్ష్మణ్ ఎలక్ట్రికల్ సేల్స్ అండ్ సర్వీస్ షాపును ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ షాప్ వస్తువులను కొనుగోలు చేసే వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులతో పాటు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కొత్తగా ప్రారంభించిన లక్ష్మణ్ ఎలక్ట్రికల్ షాప్ సేల్స్ అండ్ సర్వీస్ షాప్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అనంతుల కృపాకర్, శనగాని రాంబాబు, రాచకొండ శ్రీనివాస్, కమ్రుద్దీన్, వెంకన్న, చికూరి అశోక్, జగదీష్,సాయి, నిర్వాహకులు చికూరి లక్ష్మణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కోట మైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి రూ.1,00,116 విరాళం

విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండల కేంద్రంలో కోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి తన వంతు సహాయంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాజీ పిఎసిఎస్ చైర్మన్ పోతర్ల అంబయ్య యాదవ్ 1,00116 ( ఒక్కలక్ష నూటపదహారు రూపాయలు) విరాళంగా అందజేయడం జరిగింది. ఈ విరాళాన్ని మునగపాటి నవీన్ సర్పంచ్ కి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరోళ్ల చంద్రయ్య ముదిరాజ్, గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం, పోతర్ల సుదర్శన్ యాదవ్, ఉప సర్పంచ్ జోరల రమేష్, పిఎసిఎస్ డైరెక్టర్ పోల్కం బాలయ్య, మాజీ ఉపసర్పంచ్ కరోళ్ల రాములు, వార్డు సభ్యులు రేవెల్ల చంద్రమౌళి, కాకి పరమేష్ ముదిరాజ్, దుడ్డు కృష్ణ యాదవ్, ఏపూరి రాజు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మహేశ్వరం గదగుట్టిఎట్టయ్య ముదిరాజ్, ఏపూరి వెంకటేష్, తెల్జీరి లక్ష్మయ్య యాదవ్,వంగూరి మల్లేష్ యాదవ్, పోతర్ల సంఘం యాదవ్, పాల్గొనడం జరిగింది.





## అంగరంగ వైభవంగా గడికోట అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ

విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ గడికోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన పూజా కార్యక్రమాలకు మాజీ జడ్పీ చైర్మన్ అనిత హరినాథ్ రెడ్డి హాజరై విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పూజలు చేసి అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనిత రెడ్డి మాట్లాడుతూ, గ్రామాన్ని రాష్ట్రాన్ని అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్,ఉప సర్పంచ్ జోరాల రమేష్ , గ్రామపంచాయతీ పాలకవర్గం, శివగంగ ఆలయ చైర్మన్ అల్లే కుమార్, విగ్రహ దాత స్వర్ణ గంటి ఆనందం ,కర్రోళ్ల చంద్రయ్య, అంబయ్య యాదవ్, పోతర్ల సుదర్శన్ యాదవ్, కాకి ఈశ్వర్, కూన యాదయ్య, ఒత్తుల రఘుపతి, పోల్కం బాలయ్య,కర్రోళ్ల రాములు,మోదీని శివమూర్తి, నిమ్మగూడ సుధీర్ గౌడ్, ఆకుల వీరిబాబు, శ్రవణ్, కాకి పరమేష్, అల్లే బిక్షపతి, సంజీవ, పోల్కం బాలయ్య, కడమోని ప్రభాకర్, మహేందర్, రాజలింగం, మిద్దింటి యాదగిరి, శ్రీశైలం, ఆగమయ్య, గద్దగూటి మహేందర్, ఎట్టయ్య, గోవర్ధన్ రెడ్డి, గుర్రం యాదయ్య, మాజీ సర్పంచ్ ప్రియాంక రాజేష్, మహేశ్వరం గ్రామ మాజీ సర్పంచులు ఉప సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు , జడ్పిటిసిలు గ్రామ వార్డు సభ్యులు, అన్ని కుల సంఘాల నాయకులు గ్రామ పెద్దలు, గ్రామ మహిళలు యువకులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎంఈఓ ఆద్వర్యంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాధికారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల కరెస్పాండెంట్లు, హెడ్ మాస్టర్లు, బస్సు డ్రైవర్లకు, రామన్నపేట మండల విద్యాధికారి టి.సురేందర్ రెడ్డి ఆధ్వర్యములో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశములో మండల విద్యాధికారి మాట్లాడుతూ, బస్సు డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా నడపాలని, విద్యార్థులను సురక్షితంగా పాఠశాలల నుండి గమ్యస్థానాలకు చేర్చాలని, ప్రతి బస్సుకు ఒక టీచర్ గాని, ఆయా గాని ఉండాలని కోరారు. ఈ సమావేశములో స్థానిక ఏఎస్ఐ సురేందర్ మాట్లాడుతూ, ప్రతి బస్సు ఆర్టీఏ నిబంధనల ప్రకారం ఉండాలని, బస్సులను మితిమీరిన వేగంగా నడపవద్దని సూచించారు. ఈ కార్యక్రమములో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్స్ శేఖర్, డి.స్వామి ప్రైవేట్ పాఠశాల కరెస్పాండెంట్లు, హెడ్ మాస్టర్లు టి.మల్లికార్జున్, జె.ఎస్ మణి, మార్టిన్, దీప, లీల, నాగరాజు, శ్రీధర్, జి.కనకాచారి, పాఠశాలల బస్సు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై సమావేశం

విశ్వంభర, పరిగి: మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు వార్డు కమిటీలు, బూత్ కమిటీలు, పట్టణ కమిటీ నిర్మాణంపై విస్తృతంగా చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధార సింగ్ సూచనలతో, పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి. రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పట్టణంలోని ప్రతి వార్డులో పార్టీని మరింత బలోపేతం చేయడం, వార్డు కమిటీలు, బూత్ కమిటీల ఏర్పాటు, పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీ నిర్మాణంపై విస్తృతంగా చర్చించారు.ప్రతి వార్డులో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడంతో పాటు, ప్రతి బూత్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పార్థసారథి పంతులు, మున్సిపల్ చైర్మన్ రజిత వెంకటేష్, సీనియర్ నాయకులు పాలది శ్రీనివాస్ గుప్తా, కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, మున్సిపల్ వైస్ చైర్మన్ కమల్, జిల్లా కార్యదర్శులు అక్బర్, రహీమ్ పటేల్, కౌన్సిలర్లు చంద్రయ్య,అయ్యుబ్,అఖిల శ్రీనివాస్, ఏజాజ్, నాయకులు గానమోని శ్రీనివాస్,యూసుఫ్, కుడుముల యాదయ్య, ఫిరంగి వెంకటరామిరెడ్డి, రవికాంత్ రెడ్డి, తౌర్యా నాయక్, బాలు, అఖిల్, మాణిక్యం, గౌతమ్, ఖలీల్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు రజిత రెడ్డి, కావలి లక్ష్మి, శశికళ, సరిత,తదితరులు పాల్గొన్నారు.



# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే ప్రక్రియలో సూర్యాపేట మహిళలు ముందు ఉండాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



విశ్వంభర, సూర్యాపేట: ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే ప్రక్రియలో సూర్యాపేట మహిళలు ముందు ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా శక్తి ఉత్సవంలో భాగంగా ఉయ్ హబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూట్ క్యాంప్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ మహిళలు తయారుచేసిన వివిధ రకాల వస్తువులు, పచ్చళ్ళు, జ్యూట్ బ్యాగులను పరిశీలించి అద్భుతంగా ఉన్నాయని అభినందించారు తదుపరి మహిళలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి వస్తువులను తయారు చేసుకొని ఇంటి గడప దాటి ఇక్కడకు వచ్చిన మహిళామణులకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. మహిళామణులు అన్ని రంగాలలో ముందుండాలని మహిళా సంఘాలకు సూర్యాపేట జిల్లాలో 700 కోట్ల రుణాలు ఇవ్వడం జరిగినదని, వాటిని ఇంటి ఖర్చులకు, విద్య, వైద్యం మీద ఖర్చు పెట్టకుండా ఏదో ఒక వ్యాపారం లేదా గ్రూపుగా ఏర్పడి యూనిట్ ఏర్పాటు చేసుకొని లాభాలు అర్జించుకొని మీ కాళ్ళ మీద మీరు ఉన్నత స్థానానికి ఎదగాలని, ప్రతి మండలం గ్రామం నుండి ఒక యూనిట్ రావాలని, కష్టపడే తపన మనలో ఉండాలని, మీరు మీ ఇంటి ఆదాయం పెంచుకోవాలని ఆశ, స్ఫూర్తి, తపన ఉంటే దానికి దారి తొలి అడుగు తీసుకోవాలి అంటే ఉయ్ హబ్ మీకు అండగా ఉంటుందని, మహిళలు తమ ఉత్పత్తులను తయారు చేసుకోవడానికి, మార్కెటింగ్ చేసుకోవడానికి ఉయ్ హబ్ మీకు కావాల్సిన సలహాలు సూచనలు ఇస్తుందని, మహిళలకు సూర్యాపేటలో మహిళా శక్తి భవనం నిర్మాణం చేపడుతున్నామని త్వరలో దాన్ని ప్రారంభం చేసుకోవడం జరుగుతుందని. మీకు ఇంకేమైనా సందేహాలు సూచనలు ఉంటే సోమవారం నుండి శుక్రవారం వరకు ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 04:00 గంటల వరకు 9391609994 నెంబర్ కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని అలాగే ప్రొడక్ట్స్ తయారు చేయు మహిళలకు సంబంధించి వాట్సప్ గ్రూపు, వాట్సప్ ఛానల్ క్రియేట్ చేయవలసినదిగా డిఆర్డిఓ పి డి కి కలెక్టర్ సూచించారు. డి ఆర్ డి ఓ పిడి సన్యాసయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటున్న వారి అందరిని ఒక గ్రూపుగా తీసుకొని వారిని అత్యున్నత స్థాయికి తీసుకుపోవు లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కావున మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తదుపరి సి ఇ ఓ సీతా పళ్ళచుని మాట్లాడుతూ ఉయ్ హబ్ మహిళల కోసం స్థాపించబడిందని చిన్న మార్కెట్ అనుకోకుండా రాష్ట్ర జాతీయ స్థాయిలో ఎలా ప్రొడక్ట్స్ ఎలా మార్కెట్ చేయాలో ఉపయోగించుకోవాలని, అవకాశాలు ఎలా ఉపయోగించుకోవాలో మీ మీద ఆధారపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ నరసింహారావు, అడిషనల్ డి ఆర్ డి ఓ పి డి సురేష్, డిపిఎం అరుణ్ కుమార్, ఏపీఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు స్వయం సహాయక మహిళలు, ఉయ్ హబ్ అసోసియేట్ డైరెక్టర్ జహీర్ అక్తర్ షేక్, ఊహ సజ్జ, టీం సభ్యులు పాల్గొన్నారు.


# పరిగి మండలంలో 7956 మంది ఓటర్లకు ఎలక్షన్ కమిషన్ నుంచి నోటీసులు

### తాసిల్దార్ దగ్గర హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలి: పరిగి మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రాములు



విశ్వంభర, పరిగి: ఎలక్షన్ కమిషన్ నుంచి నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటుకు సంబంధించిన తగు ఆధారాలను పరిగి తహసిల్దార్ కార్యాలయంలో అందజేయాలని, లేనిపక్షంలో ఓటర్ తమ ఓటు కోల్పోయే అవకాశం ఉందని, ఈ విషయాన్ని గమనించాలని పరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీ వెంకట రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరిగి రూరల్ లో మొత్తం ఓట్లు 3180 , మ్యాపింగ్ కావడం జరిగింది. 27600, మ్యాపింగ్ కానివి 3250, అనుమాలిస్ లిస్ట్ 7956 మ్యాపింగ్ అయినవి ఓటు వచ్చింది పేరులో, ఇంటి పేరులో తల్లిదండ్రుల పేరులో ఏ చిన్న తప్పు దొర్లిన ఓటును పక్కకు తీసి పెట్టడం పెట్టడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ కమిషన్ ఒక నోటీసును ఓటర్కు పంపడం జరుగుతుంది. ఆధార్ కార్డు తీసుకువెళ్లి ఎలక్షన్ కమిషన్ చూయించి, 11 ఆధారంలో ఏదో ఒకటి తీసుకొని ఎంపీడీవో ఆఫీస్, ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ లో మీ ఆధారాలను సమర్పించినప్పుడే మీ ఓటుకు భద్రత వస్తుంది. లేదంటే మీ ఓటు తొలగిపోతుంది ఈ అవకాశము సెప్టెంబర్ 16వ తేదీ వరకు ఈ ఆధారాలను ఎల్పీ డెస్క్ లో మీరు అందజేయాలి లేనిచో మీ ఓటును తొలగించబడుతుంది. మండల ప్రజలందరూ గమనించి వెంటనే తమ ఓటుకు సంబంధించిన పరిగి మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు మండల ప్రజలను కోరారు. మీరు తొందరపడి తమ ఓటు విషయం భద్రత కల్పించుకొనుటకు ఆధారాలు సమర్పించని యెడల తమ జీవిత కాలంలో మళ్లీ ఓటు నమోదు చేసుకునే అవకాశం కోల్పోతారు. మండల ప్రజలు గమనించి తమ జీవితకాలంలో ఓటు వేసే అవకాశం ఉండాలంటే కచ్చితంగా ఓటుకు సంబంధించిన తగు ఆధారాలను తహసిల్దార్ కార్యాలయం హెల్ప్ డెస్క్ లో అందజేయాలని మరోసారి పరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు పరిగి మండల ప్రజలను కోరారు. ఈ విషయంలో ఆయా గ్రామాలలో పనిచేస్తున్న బిఎల్ఏ లు దగ్గర ఉండి గ్రామములో ఉన్న ఓటర్లను తాగు ఆధారాలు ఇచ్చి పంపే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు 7959 మందికి ఎలక్షన్ కమిషన్ పరిగి మండల్ లో నోటీసులో అందజేయనున్నారు.

## విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న అందెల శ్రీరాములు



విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండల కేంద్రంలోని గడికోటలో కొలువైన శ్రీ కోటమైసమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహేశ్వరం గ్రామ సర్పంచ్ నవీన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పోతర్ల సుదర్శన్ యాదవ్, ఆలయ చైర్మన్ అల్లే కుమార్, ఆలయ కమిటీ సభ్యులు కలిసి శ్రీరాములు ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ కోటమైసమ్మ తల్లి ఆశీస్సులతో మహేశ్వరం ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు, మన సంస్కృతి, సంప్రదాయాలు దేవాలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి , మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రవణ్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పందు నాయక్, తుమ్మలూరు సర్పంచ్ తుమ్మేటి ఆండాలు కృష్ణ యాదవ్, బిజెపి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు రఘువీర్, బిజెపి నాయకులు కాకి పరమేష్, పోల్కం మహేందర్, మోతే యాదయ్య, ఆకుల నరేష్, సందుల గణేష్, సుధీర్, చిందం జంగయ్య, చింటూ మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గీత కార్మికుల హామీలు అమలు చేయాలి




విశ్వంభర, హిమాయత్ నగర్: గీత కార్మికులకు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల రమణ డిమాండ్ చేశారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 2న మహబూబాబాద్‌లో ప్రారంభమైన చైతన్య బస్సు యాత్ర 31 జిల్లాల్లో పర్యటించి హైదరాబాదు ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహం వద్ద ముగిసింది. బూడిద గోపి అధ్యక్షతన జరిగిన సభలో మేకపోతుల రమణ మాట్లాడుతూ ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. వృత్తిలో ప్రమాదాలకు గురైన గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషియా అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 50 ఏళ్లు నిండిన గీత కార్మికులకు పెన్షన్, వృత్తి చేసేవారికి కాటమయ్య రక్షణ కవచం, ద్విచక్ర వాహనాలు అందిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గీత వృత్తిలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టాలని సూచించారు. కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గీత కార్మికుల సొసైటీలకు చెట్ల పెంపకం కోసం ఐదు ఎకరాల భూమి కేటాయించాలని, నందనంలోని నీరా, తాటి, ఈత ఉత్పత్తుల ప్రాజెక్టును ప్రారంభించాలని కోరారు. పెన్షన్‌ను రూ.4 వేలకు, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. 17 రోజుల పాటు సాగిన బస్సు యాత్రకు సహకరించిన వారిని నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, బొలగాని జయరాములు, గౌని వెంకన్న, బాల్నే వెంకట మల్లయ్య, గౌని సాంబయ్య, ఎల్గూరి గోవిందు, పలువురు రాష్ట్ర నాయకులు, యాత్ర బృంద సభ్యులు పాల్గొన్నారు.



## డాక్టర్ల రిలే నిరాహార దీక్షకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సంఘీభావం
## స్కాలర్‌షిప్, స్టైఫెండ్ వెంటనే పెంచాలని డిమాండ్

విశ్వంభర, ఎర్రగడ్డ: ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల జూనియర్ డాక్టర్లు తమ డిమాండ్ల సాధన కోసం రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. దీక్ష మొదటి రోజు నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరై జూనియర్ డాక్టర్లకు సంఘీభావం తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న స్కాలర్‌షిప్, స్టైఫెండ్‌ను వెంటనే పెంచాలని, కళాశాలలో అవసరమైన ఇతర సౌకర్యాలను కల్పించాలని జూనియర్ డాక్టర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, స్టైఫెండ్ పెంపుతో పాటు వారికి అవసరమైన ఇతర సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పించాలని కోరారు. జూనియర్ డాక్టర్ల న్యాయమైన డిమాండ్ల సాధనకు బీజేపీ పూర్తి మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో ఎస్ఆర్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గూడూరి శ్రీధర్‌రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెల్లంకిలోని బెల్ట్ షాపులలో మద్యం అమ్మకాలు నిషేధించాలని గ్రామ పంచాయతీ తీర్మానం



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఇడెం రాధ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి, గ్రామ ప్రజల అభీష్టం మేరకు, ఫిర్యాదు మేరకు గ్రామ ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని వెల్లంకి గ్రామ పరిధిలోని బెల్ట్ షాపులలో మద్యం అమ్మకాలు నిషేధించాలని గ్రామ పంచాయతీ పాలక వర్గం, గ్రామ ప్రజలు, అఖిల పక్ష సభ్యులందరు కలిసి తీర్మానించారు. బుధవారం రోజు తమ వినతి పత్రాలను తీసుకుని జిల్లా కలెక్టర్ కు, సంబంధిత జిల్లా ఎక్సైజ్ అధికారులకు, మండల ఎక్సైజ్ అధికారులకు, రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ కు, మండల సబ్ ఇన్స్పెక్టర్ కు వినతి పత్రాలను అందజేయడం జరిగింది. సెప్టెంబర్ 01వ తారీకు నుండి వెల్లంకి గ్రామ పరిధిలో ఎవరైనా మద్యం అమ్మినట్లు సమాచారం వస్తే కఠిన చర్యలు తప్పవని గ్రామ పంచాయతీ పాలక వర్గం, గ్రామ ప్రజలు, అఖిల పక్ష సభ్యులందరూ కలిసి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇడెం రాధ శ్రీనివాస్, వార్డు సభ్యులు సండ్ల లింగయ్య, జువ్వగోని మల్లమ్మ, జింక శాంతి, మొగిలి భాగ్యలక్ష్మి, గంజి భాస్కర్, కన్నెబోయిన రాజలింగం, అఖిల పక్షం నాయకులు పర్నె వెంకట్ రెడ్డి, ఆవనగంటి నగేష్, పున్న వెంకటేశం, కర్రె సంతోష్, బర్ల బాబురావు, నకిరేకంటి మహేష్, తాటిపాముల లింగస్వామి, గూని రాజు, గూడెల్లి దామోదర్, నకిరేకంటి నరేందర్, పాశం సతీష్, నకిరేకంటి గణేష్, గుర్రం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకులపై కేసులు ఎత్తివేయాలి: పీడీఎస్‌యూ

విశ్వంభర, అంబర్ పేట : నిజామాబాద్ జిల్లాలో విద్యార్థి సంఘాల నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించు కోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వి. హనుమంత రావుకు బుధవారం హైదరాబాదు అంబర్ పేట లోని ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. విద్యార్థి నాయకులపై నమోదైన కేసుల విషయంలో డీజీపీ సీవీ ఆనంద్‌తో మాట్లాడినట్లు వి. హనుమంతరావు తెలిపారు.పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జూలై 24న నిర్వహించిన విద్యాసంస్థల బంద్ సందర్భంగా నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాల వద్ద జరిగిన ఘటనను సాకుగా చూపుతూ విద్యార్థి నాయకులపై పలు సెక్షన్ల కింద తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నిజామాబాద్ జిల్లాలో విద్యార్థి ఉద్యమాలను అణచివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల నాయకులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనగిరి మధు, జన్నారపు రాజేశ్వర్, డి. శ్రీకాంత్, కే. శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు తీగల శ్యామ్ పాల్గొన్నారు.



# సూర్యాపేటకు రైల్వే లైన్ సౌకర్యం కల్పించాలి

## ర్యాలీ నిర్వహించిన రైల్వే సాధన సమితి ఐఎంఏ, జ్యువెలరీ అసోసియేషన్, స్వర్ణకార సంఘం




విశ్వంభర, సూర్యాపేట: జాతీయ రహదారి 65 మీదుగా యధావిధిగా మొదటి అలైన్ మెంట్ ప్రకారం సూర్యాపేటకు రైల్వే లైన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ పట్టణంలో రైల్వే సాధన సమితికి మద్దతుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జ్యువెలరీ అసోసియేషన్, పట్టణ స్వర్ణకార సంఘం జిల్లా కేంద్రంలోని కల్నల్ సంతోష్ బాబు విగ్రహం నుంచి బుధవారం కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వందే భారతి హై స్పీడ్ రైలు సౌకర్యం కల్పించాలని ట్రైన్ అలైన్మెంట్ రద్దును వెంటనే కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని లేనిపక్షంలో ప్రజాసంఘాలు, అనేక పార్టీల సహకారంతో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మొదటి అలైన్మెంట్ ప్రకారం రైల్వే సౌకర్యం సూర్యాపేటకు కేటాయించకుండా తీరని అన్యాయం చేశారని ఆక్షేపించారు. రైల్వే సౌకర్యం తో సూర్యాపేట పట్టణం ఎంతో అభివృద్ధి చెందుతున్న చెందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైల్వే సాధన సమితి కన్వీనర్ డేగల జనార్ధన్, కో కన్వీనర్లు రాచూరి ప్రతాప్, డాక్టర్.రమేష్ చంద్ర, ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు సల్వాది రమేష్ కుమార్ కార్య దర్శి ఆనంద రావు ,కోశాధికారి ఉపేందర్ సింగ్ ఐఎం ఎ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, ఆనంద్, జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయ్ కార్య దర్శి సింహాద్రి కోశాధికారి బూర్లె మధుసూదన్, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు తొగిటి మురళి, పలువురు ప్రజా సంఘాల నాయకులు, ర్యాలీ లో పాల్గొన్నారు.

# జీవో నెం. 97 రద్దు చేయాలి

## 400 మంది పాలిటెక్నిక్ విద్యార్థులతో ఏబీవీపీ భారీ ర్యాలీ



విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు జీవో నెం. 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మహేశ్వరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి రాజేష్ నాయకత్వంలో సుమారు 400 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొ న్నారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి ప్రారంభ మైన ర్యాలీ రగుడబ్బ వరకు కొనసాగింది. విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరగాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ ర్యాలీ నిర్వహించాము అని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యక్ష ప్రభావం చూపే జీవో నెం. 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి, పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకో వాలని కోరారు. విద్యార్థుల సమస్య పరిష్కారం అయ్యే వరకు ఏబీవీపీ ప్రజాస్వామ్య పద్ధతిలో మరిన్ని ఉద్యమ కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అభిలాష్, చింటూ, ప్రాంతి, సాయికార్తిక్, రోహిత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లికుదురులో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం




విశ్వంభర, నెల్లికుదురు: ఫోటో కేవలం చిత్రమే కాదు అది ఒక కాలానికి ప్రతిబింబమని ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సంఘం మండల అధ్యక్షులు కదారి వెంకట రమణ అన్నారు. మండల కేంద్రం నెల్లికుదురు లోఫోటోగ్రఫీ పితామహుడులూయిస్ జాకస్ మండే డాగ్యూర్ జ్ఞాపకార్థంగాప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగానిర్వహించి, జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోటోగ్రఫీ అనేది సామాన్య ప్రజల జీవితంలో భాగమైపోయిందన్నారు. కాలాన్ని ఆపివేసే కల ఫోటోగ్రఫీ అని దీనిని ఇష్టపడని వ్యక్తి లేదంటే అసిస్ అతిశయోక్తి కాదన్నారు. నేటి ప్రస్తుత పరిస్థితులలో పెరిగిపోతున్న సాంకేతిక పరిజ్ఞానాన్నిసామాజిక మాధ్యమాల సహాయంతోఫోటోగ్రాఫర్లకు పని తగ్గిందని,వస్తున్న కొద్దిగొప్ప అవకాశాలను కొంతమంది ఆశావహులు సద్వినియోగం చేసుకోకుండానిర్ణీతధరకు తగ్గించి, యూనియన్ సభ్యులలో ఒకరికొకరు పోటాపోటీగా నిలుస్తూ ఒకరి అవకాశాన్ని మరొకరు తీసుకునేలా ఉండకూడదని సూచించారు.ఫోటో వీడియో గ్రాఫర్ అందరూ ఒకరికొకరు సహకారం అందించుకోవాలని హితవు పలికారు. అనంతరం మాజీ పిఎస్టి లకుశాల తో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలోగౌరవాధ్యక్షులు వేములశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిబోడ నరసింహ, కోశాధికారి గుగులోతు సైదులు, సీనియర్ ఫోటోగ్రాఫర్లుసింగరంనాగేంద్ర ప్రసాద్, బొమ్మ వెంకన్న చారి, అడెంశ్రీధర్, శ్రీకాంత్ యాదవ్, గుగులోతునగేష్, వల్లపు నరేష్,ఇసంపెల్లి ఉపేందర్,వల్లపు ఐలయ్య మండల ఫోటో వీడియో గ్రాఫర్ లు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

## జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



విశ్వంభర, డిండి : నల్గొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల కేంద్రంలో ని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల ఆవరణ, డార్మెటరీ, కిచెన్, స్టోర్ రూమ్, వాష్ రూమ్స్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో చెత్తను ఎప్పటికప్పుడు గ్రామపంచాయతి ట్రాక్టర్ ద్వారా తీసుకువెళ్లాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి జంగయ్య ను ఆదేశించారు వాష్ రూమ్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని వాష్ రూమ్ లకు డోర్ లు పెట్టించాలని,అలాగే అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ఇటీవలే పాఠశాల/కళాశాలలో సివిల్ పనుల నిమిత్తం 26 లక్షల రూపాయలు మంజూరు చేసినందున డ్రైనేజీ,తాగునీటి పైప్ లైన్ పనులు,పాఠశాల భవన మరమ్మతులు, తదితర పనులను వెంటనే చేపట్టాలని డి ఈ శైలజను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ స్టోర్ రూమ్ ను సందర్శించి సరుకుల స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేశారు.స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు నిర్వహించాలని,గడువుదాటిన సరుకులు వాడవద్దని, నెలకు సరిపడా సరుకులు మాత్రమే తెప్పించుకోవాలని, తాజా కూరగాయలు వాడాలని, పుచ్చిపోయినవి వాడవద్దని ప్రిన్సిపల్ శిరీష, స్టోర్ కీపర్ల ను ఆదేశించారు. వంట సరుకులు వృధా చేయవద్దని,రోజుకు సరిపోయినంత సరుకులు వాడాలని,వంట మనుషులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని,చేతులకు గ్లౌజులు ,తలకు కవర్ ధరించాలని వంట వారిని ఆదేశించారు బాలికలకు ఆత్మరక్షణలో భాగంగా కరాటే వంటివి నేర్పించాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి చదువు సమస్యలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# భువనగిరి ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎల్ఓసి చెక్ అందజేత



విశ్వంభర, వలిగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నాతాళ్ళగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మస్కు బుచ్చయ్య కుమారునికి వారం రోజుల క్రితం నిమ్స్ హాస్పిటల్ హైద్రాబాద్ లో సర్జరీ కి భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ ఓ సి చెక్ ఇవ్వడం జరిగింది. బుచ్చయ్య కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కు ధన్యావాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉలిపే మల్లేశం, మాజీ ఎంపీటీసీ ఉద్దగిరీ భాస్కర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మస్కు నరసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉద్దగిరి శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గర్రెపల్లి సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నంకు వినతి

## పల్లె బస్సు, రహదారి, విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

విశ్వంభర, సైదాపూర్: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గర్రెపల్లి గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దోకిడి తిరుపతి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి ఇప్పటివరకు పల్లె బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం గర్రెపల్లి మీదుగా బస్సు సర్వీసు నడపాలని కోరారు. గ్రామానికి ఇప్పటివరకు లేని పల్లె బస్సును మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించి రవాణా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గ్రామంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయాలని, గర్రెపల్లి--సైదాపూర్ రహదారిలోని బ్రిడ్జి వద్ద సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. హనుమాన్ దేవాలయం వద్ద నీటి సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు పోచమ్మ గుడి స్థల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం గర్రెపల్లి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పడినందున గ్రామ అవసరాలకు అనుగుణంగా తగిన సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి న్యాయం చేయాలని దోకిడి తిరుపతి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.

# జీవో 97 రద్దు చేయాలి.. పాలిటెక్నిక్ విద్యార్థుల మానవహారం..



విశ్వంభర, హుస్నాబాద్ : టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను 'శక్తి' శాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నిక్ విభాగాలను శక్తి శాఖలో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్య పూర్తిచేసిన అనంతరం బీటెక్‌లో ప్రవేశాలకు సీట్ల సంఖ్య పెంచాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శక్తి పథకాన్ని అమలు చేయడం కంటే పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉన్నత విద్యలో మెరుగైన అవకాశాలు కల్పించాలని కోరారు. విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి స్పందించి విలీన ప్రక్రియను ఉపసంహరించుకుని జీవో 97ను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ పెంచడంతో పాటు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, కళాశాల తరగతులు, పరీక్షలు బహిష్కరిస్తామని విద్యార్థులు తెలిపారు.

# కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

## : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు




విశ్వంభర, హనుమకొండ : కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలపై వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తీవ్రంగా స్పందించారు. బుధవారం హన్మకొండ డీసీసీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. కొండా సుస్మిత పటేల్ కనీసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కూడా కాదని, పార్టీ సభ్యత్వం కూడా లేని వ్యక్తి అని ఆయన అన్నారు. పార్టీపై, పార్టీ నాయకులపై అవగాహన లేకుండా మాట్లాడితే దానికి తాము ఏం సమాధానం చెప్పగలమని ప్రశ్నించారు. రాజకీయ అంశాలపై మాట్లాడే ముందు కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు.వయసుకు మించి మాటలు మాట్లాడే ముందు...జిల్లాలో సీనియర్ రాజకీయ ప్రస్థానంలో ఉన్న నాయకుడిపై విమర్శ లు చేయడం సరికాదన్నారు. కొండా సుస్మిత పటేల్ మాట్లాడిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు,డివిజన్ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోట మైసమ్మ పునఃప్రతిష్ఠాపనకి ముదిరాజ్ సంఘం రెండు లక్షలు విరాళం



విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండల కేంద్రంలోని గడికోట కోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా తన వంతు సహాయంగా ముదిరా జ్ సంఘంవారు రెండు లక్షల ఇరవైరెండువేల నూట పదకొండు రుపాయలు విరాళంగా అందజేయడం జరిగింది. ఈ విరాళాన్ని మునగపాటి నవీన్ సర్పంచ్‌కి అందజేయడం జరిగింది. కోట మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ముదిరాజ్ సంఘం నాయకులు తెలియజేశారు.

# మే రా షహర్ మేర హక్ - మోహనత్‌కి హాత్ పోస్టర్ లాంచ్



విశ్వంభర, శంషాబాద్: జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చీబ్, జాతీయ యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ మనీష్ శర్మ, రాష్ట్ర ఇంచార్జ్ సయ్యద్ ఖలీద్ హమ్మద్, భవ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జిక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు " బెటర్ సిటీస్" కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ పట్టణంలో కాన్ఫరెన్స్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండగళ్ల నాగేందర్ రెడ్డి అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్బన్ పాలిటిక్స్ – మే రా షహర్ మేర హక్, మెహనత్‌కి హత్ అనే నినాదంతో జరిగిన ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ లో అర్బన్ ప్రాంతాల్లోని రోజువారి కార్మికుల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా కిందివర్గాల సమస్యలపై యువజన కాంగ్రెస్ గలమెత్తింది. సఫాయ్ కార్మికులు, గరేజ్ కార్ఘర్ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, ఆటో మరియు ఈ రిక్షా డ్రైవర్‌లు , రేడి పత్రి విక్రేతలు, గిగ్ వర్కర్‌లు అర్బన్ రీజియన్ డివిజన్లలో ఈ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు జాతీయ యువజన కాంగ్రెస్ పిలుపునిచ్చింది. కార్మికుల హక్కుల కోసం యువజన కాంగ్రెస్ భవిష్యత్తులో కూడా పోరాటాలు చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ గౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు చందు యాదవ్, కొత్వాల్ గూడ డివిజన్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, మహేష్ యాదవ్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లపై అధికారులకు జలంధర్‌రెడ్డి ఆదేశాలు

## వలిగొండలో మండల స్థాయి సమీక్ష సమావేశం




విశ్వంభర, వలిగొండ: మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్‌రెడ్డి పర్యవేక్షణలో వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి నిల్వ సదుపాయాల కల్పనకు మ్యాజిక్, కమ్యూనిటీ సోక్‌పిట్స్, బోర్‌వెల్ రీచార్జ్, ఫామ్‌పాండ్లు తదితర పనులను గుర్తించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల సంరక్షణ, తాగునీటి లభ్యతపై ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. సామాజిక భద్రతా పింఛన్లకు అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులు, చేనేత, కల్లుగీత కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలత, పీఆర్ జి. సందీప్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కె. కీర్తి, ఏపీవో పరశురాములు, ఏపీఎం అంజయ్య, హౌసింగ్ ఏఈ టి. అశోక్‌తో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ చిన్న నాగారం గ్రామ కమిటీ ఎన్నిక



విశ్వంభర, ఇనుగుర్తి: మండలంలోని చిన్ననాగారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని బుధవారం మండల ఇన్చార్జి చెడుపాక యాకన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా జల్లె హరీష్,అధికార ప్రతినిధి తూల్ల దినేష్,ప్రధాన కార్యదర్శి చెడుపాక రాజు, చెడుపాక కమలహాసన్,ఉపాధ్యక్షులు చెడుపాక సాయికుమార్,గద్దల ముఖేష్,మునిగంటి సాయి కుమార్ లను ఎంపిక చేశారు. కోశాధికా రిగా మంకాళి పవన్ కుమార్,కార్యదర్శులు చెడడుపాక బాబు,జల్లే కుమారస్వామి,చెడుపాక సాయికిరణ్,మూరగుండ్ల హరీష్,సహాయ కార్యదర్శులు చెడుపాక అరుణ్,తూళ్ళ బన్ని,జల్లె అన్వేష్,చెడుపాక రాకేష్,తూళ్ల గణేష్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులు హరీష్ మాట్లాడుతూ అందరి సహకారంతో రిజర్వేషన్ తో పాటు,మాదిగల హక్కులు,సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. తమపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చెడుపాక సురేష్,సీనియర్ నాయకులు చెడుపాక వెంకన్న,చెడుపాక యాకూబు,చెడుపాక వెంకన్న, మునిగంటి యాకయ్య,చెడుపాక రమేష్,విహెచ్పిఎస్ జిల్లానేత చెడుపాక లక్ష్మణ్,గడ్డం సుధాకర్,చెడుపాక సురేష్,గడ్డం వినోద్ లతోపాటు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీపీఎం మహాధర్నాను జయప్రదం చేయండి

## : సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జహంగీర్ పిలుపు



విశ్వంభర, వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 29, 30, 31 తేదీల్లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జహంగీర్ తెలిపారు. ఆగస్టు 29న భువనగిరి అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర 31న హైదరాబా ద్‌లోని ఇందిరాపార్క్‌కు చేరుకుని మహాధర్నాతో ముగుస్తుందని చెప్పారు. బుధవారం వలిగొండలో నిర్వహించిన సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్వాపూర్, గంగమ్మల్ల, చర్లగూడెం తదితర ప్రాజెక్టులు నిధుల కొరతతో పెండింగ్‌లో ఉన్నాయని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాకు సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 31న జరిగే చలో హైదరాబాద్–ఇందిరాపార్క్ మహాధర్నాలో రైతులు, ప్రజలు రాజకీయాలకు అతీతంగా వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కేంద్రంలో పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమానికి రూ.21,000 విరాళం



విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం గడికోట శ్రీ కోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠా జరుగుతున్న సందర్భంగా ఈ మహోత్సవానికి తన వంతు సహాయంగా గదగూటి మహేందర్ ముదిరాజ్ రూ.21,000 విరాళాన్ని మునగపాటి నవీన్ సర్పంచ్ కి అందజేయడం జరిగింది. శ్రీకోట మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని మహేందర్ ముదిరాజ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలి

మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్



విశ్వభర, హుస్నాబాద్: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి భారత రాష్ట్ర సమితి బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశం బుధవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రతులను బూత్ స్థాయి ఏజెంట్లకు అందజేశారు. ప్రతి బూత్ పరిధిలోని జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరు పేరు ఉండేలా చూడాలని సూచించారు. మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారి పేర్లు, ఒకే వ్యక్తి పేరు రెండుచోట్ల నమోదైందా, పేర్లు, చిరునామాల్లో తప్పులున్నాయా అనే అంశాలను పరిశీలించాలని తెలిపారు. ముసాయిదా జాబితాపై ఆగస్టు 18 నుంచి 25 వరకు అభ్యంతరాలు, సవరణలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కొత్త ఓటరు నమోదుకు 6వ నంబరు దరఖాస్తు, పేరు తొలగింపునకు 7వ నంబరు దరఖాస్తు, ఓటరు వివరాల సవరణకు 8వ నంబరు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో బూత్ ఏజెంట్ల పాత్ర కీలకమన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షించేలా పనిచేయాలని సూచించారు. జాబితాలో తప్పులు ఉన్నవారు గడువులోగా దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తప్పులు లేని సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనకు బూత్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన భువనగిరి ఎమ్మెల్యే



విశ్వంభర, భువనగిరి: యాదాద్రి భువనగిరి జిల్లా బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్థులు ఈ రోజు స్థానిక సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్అండ్ఆర్, భూసేకరణ కోసం రూ.206 కోట్ల నిధులు విడుదల కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే తో కలిసి గ్రామస్థులు ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాట్లాడుతూ.. బస్వాపూర్ రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. గతంలో ఆర్అండ్ఆర్, భూసేకరణకు అవసరమైన నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్థుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి రూ.206 కోట్ల ఆర్అండ్ఆర్, భూసేకరణ నిధులను విడుదల చేశారని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భువనగిరి నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బస్వాపూర్ ప్రాజెక్టు పూర్తయితే భువనగిరి, వలిగొండ, నకిరేకల్, రామన్నపేట, తుంగతుర్తి ప్రాంతాల రైతులకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మూసీ మురుగు నీటిపై ఆధారపడకుండా గోదావరి జలాలతో రైతులు సాగు చేసుకునేలా బస్వాపూర్ ప్రాజెక్టును పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో బస్వాపూర్ రిజర్వాయర్‌లో ఐదు టీఎంసీల నీటిని నింపి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కెనాల్ ద్వారా దిగువ ప్రాంతాలకు నీరు చేరేందుకు నేషనల్ హైవే వద్ద అవసరమైన పనులు చేపట్టామని, బునాదిగాని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. బస్వాపూర్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడంతో పాటు, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి-రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖా-బాబురావు, ఆత్మ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల-వెంకటేశ్వర్లు, పిఏసిఎస్ చైర్మన్లు సతీష్ పవన్, శ్యామ్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, భువనగిరి నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బి.ఎన్. తిమ్మాపురం గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల అదుపులో సీసీ కెమెరాలు దోహదం: ఏసిపి కాశిరెడ్డి




విశ్వంభర, సరూర్ నగర్ :నేరాలు అదుపు చేయడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని వనస్థలిపురం ఏసిపి, ఎల్బీనగర్ ఇన్చార్జ్ ఏసీపీ కాశిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సరూర్నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ రోడ్డు నెంబర్ 6 లో కాలనీ అసోసియేషన్ , రోడ్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ మల్కారం సుధాకర్ చారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సీసీ కెమెరాలు నేరాలను అదుపు చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి అన్నారు. సీసీ కెమెరాలు నేరాలను ఏ విధంగా అదుపు చేస్తున్నాయో ఉదాహరణలతో సహా ఆయన వివరించారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంలో వెంకటేశ్వర కాలనీ అసోసియేషన్ వారు ఎంతగానో శ్రద్ధ చూపించినందుకు ఏసీపి అభినందించారు. సరూర్నగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం మాట్లాడుతూ ప్రతీ కెమెరా 100 పోలీసులతో సమానమని పేర్కొన్నారు. కాలనీ వారు పోలీసులకు సహకారం అందిస్తే నేరాలను సులువుగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రతి కాలనీ వారు వెంకటేశ్వరా కాలనీ నీ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యులు ఏసిపి ఇన్స్పెక్టర్ పోలీసు సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గండుధనం రెడ్డి, గౌరవ అధ్యక్షుడు బోయిని మహేందర్ యాదవ్, ఉపాధ్యక్షుడు మునగాల నరేష్, ప్రధాన కార్యదర్శి పి వి ఎస్ ప్రసాద్, కోశాధికారి సోమ వెంకట్, జాయింట్ సెక్రటరీలు సుబ్రహ్మణ్యం, సప్పిడి గోవర్ధన్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి టి.శ్రీనివాసరావు, బోయిని శంకర్ యాదవ్ , సలహాదారులు తులసి కృష్ణమూర్తి, కనకారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ చెన్న అనిల్, రవి గౌడ్, కాలనీ వాసులు యాదగిరి రెడ్డి, గండి వెంకట్రావు, మాధవరావు, జగ్గారావు, మాధవరెడ్డి, సత్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పవర్ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా..విద్యుత్ సౌధ ముట్టడి



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ ప్రాంగణంలో తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీఈజేఏసీ) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భారీగా ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు తరలివచ్చి విద్యుత్ సౌధను ముట్టడించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ జి. సాయిబాబు, కన్వీనర్ పి. రత్నాకర్ రావు, జనరల్ సెక్రెటరీ ఇ. శ్రీధర్, నేతలు వజీర్, మహేష్‌లు మాట్లాడుతూ తాము ప్రభుత్వం ముందు ఉంచిన 14 డిమాండ్లు అత్యంత న్యాయమైనవని, ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జీవన వ్యయం, పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని పీఆర్సీ-2026 వేతన సవరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, ఇందుకోసం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కూడిన చర్చల కమిటీని ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ కార్యకలాపాల ప్రైవేటీకరణ టెండర్ల నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని, శాశ్వత సిబ్బందితోనే పనులు నిర్వహించాలని స్పష్టం చేశారు. అలాగే ఫీల్డ్ స్థాయిలో కీలక సేవలందిస్తున్న ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేసి సర్వీస్ సమస్యలు, వివక్షను పరిష్కరించాలని, 1999 నుంచి 2004 మధ్య నియామకమైన ఉద్యోగులకు జీపీఎఫ్, పాత పెన్షన్ సౌకర్యాలను కల్పించాలని, మహారాష్ట్ర మోడల్ తరహాలో రైతు అనుకూలమైన రైతు డిస్కం విధానాన్ని పరిశీలించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం, యాజమాన్యాలు మొండివైఖరి వీడి సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 27 నుంచి రాష్ట్రంలోని అన్ని జెన్‌కో జనరేటింగ్ స్టేషన్లు, ట్రాన్స్‌కో, డిస్కంల సర్కిల్ కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడతామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పి. సదానందం, ఎం. కరుణాకర్ రెడ్డి, ఎం. రాంజీ, ఎం. నెహ్రూ, ఎన్. స్వామి, కె.వి. రామారావు, ఆర్. మోసెస్, డి. శ్యామ్ మనోహర్, సత్యనారాయణ రావు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళ కడుపులో నుండి 3 కిలోల కణితి తొలగింపు

విశ్వంభర,పెద్ద శంకరంపేట: కడుపునొప్పితో బాధపడుతున్న మహిళ కడుపులో నుండి దాదాపు మూడు కిలోల కణితిని ఆపరేషన్ చేసి తొలగించినట్లు పెద్ద శంకరం పేటలోని పద్మాలయ ఆసుపత్రి వైద్యులు రజిని శ్రీనివాస్‌లు బుధవారం తెలిపారు. పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మూసాపేట గ్రామానికి చెందిన సాయమ్మ (40) గత ఆరు మాసాలుగా కడుపు నొప్పితో బాధపడుతుందని పేర్కొన్నారు. దీంతో ఆమె పెద్ద శంకరంపేటలోని పద్మాలయ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరిందన్నారు. సాయమ్మను వైద్యులు స్కానింగ్ చేసి పరిశీలించడంతో కడుపులో కనితి ఉందని గుర్తించారు. దీంతో ప్రముఖ వైద్యులు సర్జన్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆపరేషన్ చేసి మహిళ కడుపులో నుంచి దాదాపు 3 కిలోల కనితి తొలగించినట్లు వివరించారు. ఈ ఆపరేషన్ లో పద్మాలయ హాస్పిటల్ వైద్యులు రజిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాచిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా సునీల్ కుమార్



విశ్వంభర, కాచిగూడ : కాచిగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా కంచనపల్లి సునీల్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనకు బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, డాక్టర్ ఎన్. గౌతమ్ రావు, కృష్ణ యాదవ్, దీపక్ రెడ్డి, జిల్లా నాయకులకు, భాజపా కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ కార్యకర్తలతో కలిసి ప్రజల కోసం పనిచేస్తానని చెప్పారు.

## ఘనంగా పలారం బండి ఊరేగింపు



విశ్వంభర, డాక్టర్స్ కాలనీ: మహేశ్వరం నియోజకవర్గం డాక్టర్స్ కాలనీ డివిజన్ భగత్ సింగ్ నగర్ లో బీజేపీ యువ నాయకులు మంథని ప్రేమ్ యాదవ్ నిర్వహించిన పలారం బండి వూరేగింపులో బీజేపీ రాష్ట్ర నాయకులు బాణాల ప్రవీణ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకా అన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు జంగయ్య ముదిరాజ్, సిద్దు ముదిరాజ్,యువ నాయకులు గంటి కిరణ్ రాజు గారు,సందీప్ యాదవ్, ఏబీవీపీ విశ్వ తేజ తది తరులు పాల్గొన్నారు.

## వ్యభిచారకూపంలోకి బాలికలు.. 33 మంది నిందితులకు కఠినశిక్షలు



విశ్వంభర, హైదరాబాద్: బాలికలను వ్యభిచార కూపంలోకి దింపిన కేసులో సైఫాబాద్‌లోని పోక్సో కోర్టు బుధవారం సంచలన తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ సమర్పించిన పక్కా సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం 33 మంది నిందితులకు కఠినశిక్షలు ఖరారు చేసింది. ఐదుగురికి జీవిత ఖైదు, ముగ్గురికి 14 ఏళ్లు, మరో పద్నాలుగు మందికి 10 పదేళ్లు, 11 మందికి మూడేళ్ల కఠిన కారాగారశిక్ష విధించింది. బాధితులైన 9 మంది బాలికలు అనుభవించిన శారీరక, మానసిక నరకయాతనను గుర్తించి ఒక్కొక్కరికీ రూ.5లక్షల చొప్పున నష్టపరిహారాన్ని అందజేయాలని ఆదేశించింది.వివరాల్లోకి వెళ్తే.. 2015లో బాధితురాలు వ్యవసాయ పనులు చేసుకుంటుండగా, తన గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చి ఏ1, ఏ2, ఏ3లకు పరిచయం చేశారు. తర్వాత ఖమ్మం, బల్లార్షాలకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఏ1 నుంచి ఏ3 నిందితులు ఆమెను బలవంతంగా వ్యభిచారంలోకి దింపడంతో పాటు ఆమెపై దాడి చేశారు. సుమారు నాలుగు నెలల తర్వాత బాధితురాలు వారి చెర నుంచి తప్పించుకొని హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐడీ పోలీసు బృందం మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా బల్లార్షాని పలు ప్రాంతాల్లో గాలించి వ్యభిచార గృహాలపై దాడులు చేశారు. 9 మంది బాలికలతో సహా 38 మంది బాధితులను రక్షించారు. ఈ ఆపరేషన్ సమయంలో 45 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. విచారించిన పోక్సో కేసుల ప్రత్యేక సెషన్స్ జడ్జి నిందితులకు శిక్ష విధిస్తూ పైవిధంగా తీర్పు వెలువరించారు.

## గోదావరి జలాలతో నవాబ్‌పేట రిజర్వాయర్‌ను నింపాలి

గుండాల మండలంలోని చెరువులు, కుంటలకు సాగునీరు అందించాలి: బీజేపీ డిమాండ్



విశ్వంభర, గుండాల : మండలంలోని రైతాంగ సాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ గుండాల మండల అధ్యక్షుడు పింగళి విజయ్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నవాబ్‌పేట రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపి, మండలంలోని అన్ని గ్రామాల చెరువులు, కుంటలను నింపాలని నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి గోదావరి జలాలను గుండాల మండలానికి అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రైతాంగ సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ చెడా నాగయ్య, మండల ఉపాధ్యక్షులు వెంపటి సురేష్, మండల ప్రధాన కార్యదర్శులు కప్పరి నాగిరెడ్డి, శ్రీకాంత్, ఆవుల సాయి తేజ, బీజేవైఎం మండల అధ్యక్షుడు సింగారం సోమరాజు, బీజేపీ సీనియర్ నాయకులు ఎలిమినేటి ఎల్లయ్య, విష్ణు, సురేష్, మైపాల్ రెడ్డి, మహేష్, మహిళా నాయకురాలు సంగీతతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

## జలసిరి పనులు వేగవంతం చేయాలి : ఎంపీడీవో



విశ్వంభర, పెద్ద శంకరంపేట: పెద్ద శంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాలలో జలసిరి పనులను వేగవంతం చేయాలని, లక్ష్యాలను సాధించే విధంగా క్షేత్రస్థాయిలో సమన్వయంగా అధికారులు పనిచేయాలని పెద్ద శంకరంపేట ఎంపీడీవో పేర్కొన్నారు. బుధవారం పెద్ద శంకరంపేట లోని ఎంపీడీవో కార్యాలయంలో వి బి జి రాంజీ పథకం కింద చేపడుతున్న పనులు.. పింఛన్ల పురోగతిపై పంచాయతీ కార్యదర్శులు. ఫీల్డ్ అసిస్టెంట్ లు తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. జలసిరి పనులు. చేయూత పింఛన్ల అమలులో ఎలాంటి చెప్పం లేకుండా నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణిత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. చేయూత పింఛన్లకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారుల ప్రతిపాదనలు సక్రమంగా సేకరించి అవసరమైన ధ్రువ పత్రాలతో ప్రక్రియను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ ఓ జాకీర్ హుస్సేన్. ఏపీఓ సంతోష్ కుమార్. ఈసీ నవాజుద్దీన్ పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



విశ్వంభర, వలిగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం గా ర్యాలీ నిర్వహించడం జరిగింది.కేంద్ర రాష్ట్ర పథకాలు ఏదైనా ఉన్న ప్రతి ఫోటోగ్రాఫర్ సభ్యునికి అందేలా చూడాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు బొమ్మగాని వెంకటేష్, మండల అధ్యక్షులు కొండూరు రమేష్, ఉపాధ్యక్షులు జువ్వగని సుమన్, కోశాధికారి బల్లెపు కృష్ణస్వామి, ప్రధాన కార్యదర్శి ఆమనగంటి శ్రీరాములు, సహాయ కార్యదర్శి మిర్యాల వెంకటేష్ ,ప్రచార కార్యదర్శి చిట్టబోయిన తిరుమలేష్, కార్యవర్గ సభ్యులు వేలిమినేటి రమేష్,బద్దం అయ్యప్ప, దంతూరి వెంకటేశం, ఫోటోగ్రాఫర్ సభ్యులు పాల్గొన్నారు.

## గుండాల మండల సమాఖ్య అధ్యక్షురాలిగా బీసు మానస



విశ్వంభర, గుండాల: గుండాల మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. బైలా ప్రకారం గత పదవీకాలం పూర్తికావడంతో ఖాళీ అయిన మండల సమాఖ్య అధ్యక్షురాలి స్థానంలో నూతన సభ్యురాలు బీసు మానస అంబాల ను ఏకగ్రీవంగా మండల సమాఖ్య అధ్యక్షురాలిగా నియమించారు. జిల్లా డీపీఎం రవీందర్, ఐబీడీపీఎం ప్రభాకర్ ఎన్నికల అధికారులుగా హాజరై నూతన అధ్యక్షురాలిని నియమించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య ప్రతినిధులు, ఎంఎస్ సిబ్బంది, స్త్రీనిధి మేనేజర్, సీసీలు, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షురాలు బీసు మానస మాట్లాడుతూ మండల సమాఖ్య అభివృద్ధికి, మహిళా సంఘాల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## బద్లావ్ జరూరి హై.. మార్పు కావాలి



విశ్వంభర, సరూర్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం భవన్ వద్ద ప్రజా చైతన్య యాత్రకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ఎం.డి. ఫయిమా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సార్వత్రిక విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని, మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని కోరారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, కార్మిక హక్కులను పరిరక్షించాలని అన్నారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అవసరమైన నిధులు కేటాయించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు జిల్లెల కృష్ణ, రామావత్ సక్రు నాయక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతికుమార్, సరూర్‌నగర్ నాయకులు ఇస్మాయిల్, మల్లెల శ్యామల, మల్లోజు రమణమ్మ, విజయలక్ష్మి, ఇస్తారి పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి




విశ్వంభర, నాగోల్: సైబర్ జాగరూకత దివస్ సందర్భంగా నాగోల్ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ సిటిజన్లకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ అరెస్ట్ మోసాలు, పెట్టుబడుల పేరుతో జరిగే మోసాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో మోసాలు, ఓఎల్ఎక్స్ మోసాలు, ఆన్‌లైన్ షాపింగ్, కస్టమర్ కేర్ పేరుతో మోసాలు, రుణాల పేరుతో మోసాలు, మ్యాట్రిమోనియల్ మోసాలు, టిప్‌లైన్ కేసులు, ఆన్‌లైన్ భద్రత, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, ఓటీపీ--యూపీఐ మోసాలు, ఫిషింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సుమారు 60 మంది సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు. మల్కాజిగిరి సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి, ఏసీపీ శివశంకర్ గౌడ్, నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, ఎస్ఐలు పి. శివ నాగ ప్రసాద్, మమత పాల్గొని సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# పల్లె గడపకు మంత్రి పొన్నం.. ప్రజల సమస్యలే ప్రాధాన్యం



హుస్నాబాద్, విశ్వంభర: ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి, వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన "పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెల్లో ప్రజా పాలన" కార్యక్రమానికి సైదాపూర్ మండలంలో శ్రీకారం చుట్టారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగనుంది. తొలిరోజు దుద్దెనపల్లి, ఎక్లాస్‌పూర్, సోమారం, గర్రెపల్లి, లస్మన్నపల్లి, వెన్నంపల్లి, ఆరేపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, సాగునీరు, సంక్షేమ పథకాలు, ఇళ్ల నిర్మాణం తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను గ్రామాల్లోనే ప్రజల ముందుకు తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. దుద్దెనపల్లి, ఎక్లాస్‌పూర్, వెన్నంపల్లి గ్రామాల్లో నిర్మించిన పల్లె దవాఖానలను మంత్రి ప్రారంభించారు. వెన్నంపల్లిలో మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, రైతు రుణమాఫీ, సన్న వడ్ల బోనస్, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని వివరించారు. ఆరేపల్లిలో మహిళా సంఘ భవనం, పాఠశాల కిచెన్ షెడ్‌ను ప్రారంభించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందిస్తామని చెప్పారు. వర్షాభావ పరిస్థితుల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు.

గ్రామస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. ప్రజల మధ్యే ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే నిజమైన ప్రజాపాలన అని స్పష్టం చేశారు. 173 గ్రామాల్లో కొనసాగే ఈ కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టే వినూత్న ప్రజాసేవా కార్యక్రమంగా నిలుస్తోంది.

## స్టైల్ ఫ్లీజ్..



ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లో ఫోటోగ్రాఫర్లతో కలిసి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు.
- విశ్వంభర, కరీంనగర్

# ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



విశ్వంభర, వైరా: ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. రెండో వేతన సవరణ సంఘాన్ని వెంటనే అమలు చేయాలని, ఆరు విడతల కరువు భత్యాన్ని విడుదల చేయాలని, కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 25ను సవరించి ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, నూతన ఆరోగ్య పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైరా మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు సముదాయాల ఉమ్మడి సమావేశం సందర్భంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాకు అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరుకావాలని, సెప్టెంబర్ 1న పెన్షన్ వ్యతిరేక దినం సందర్భంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, సముదాయ ప్రధానోపాధ్యాయులు జి. మాధవరావు, డి. సత్యనారాయణ, వివిధ సంఘాల బాధ్యులు వెలిశెట్టి నరసింహారావు, పెనుగొండ ఉపేంద్ర రావు, పొట్టబత్తిని వెంకటేశ్వర్లు, చారుగుండ్ల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడి విగ్రహం తొలగింపు దారుణం



విశ్వంభర, వరంగల్: తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని అర్ధరాత్రి తొలగించడం దారుణమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నరసింహ అన్నారు. ఈ ఘటనను తెలంగాణ ఉద్యమకారులందరూ ముక్తకంఠంతో ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. నర్సంపేటలో పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించేందుకు ప్రభుత్వం భారీగా పోలీసు బలగాలను తరలించిందని నరసింహ ఆరోపించారు. ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి సుమారు 1,600 మంది పోలీసులను నర్సంపేటకు తరలించి, హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి పోలీసు ఉన్నతాధికారులను రప్పించారని తెలిపారు. వారి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లను మోహరించి రాత్రి మూడు గంటల సమయంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన తమ సహచరుడు, మిత్రుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించేందుకు ఇంత భారీగా పోలీసు బలగాలను వినియోగించడం ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుడి విగ్రహం తొలగింపు ఘటనపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ చర్యను ప్రతి తెలంగాణ ఉద్యమకారుడు, ఉద్యమాభిమానీ ఖండించాలని చిలకమర్రి నరసింహ కోరారు.

## ఎల్బీ నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి సస్పెన్షన్

విశ్వంభర, హైదరాబాద్: ఎల్బీ నగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదేశాలు జారీ చేసింది .పలువురిని వ్యక్తిగత విషయాలపై దూషించడంతో పాటు, కులాల పేరుతో దూషించిన ఘటనలకు సంబంధించి సరైన ఆధారాలు ఉన్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ పేర్కొన్నట్లు తెలుస్తోంది.ఈ ఘటనపై విచారణ అనంతరం జక్కిడి ప్రభాకర్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేస్తూ క్రమశిక్షణ కమిటీ నిర్ణయం తీసుకుంది.

## టూరిజం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



విశ్వంభర, హైదరాబాదు : తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో 23 ఏళ్లుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ టూరిజం ఉద్యోగుల యూనియన్ డిమాండ్ చేసింది. యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి ఆధ్వర్యంలో ప్రతినిధులు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 61 ఏళ్ల పదవీ విరమణ వయోపరిమితిని వారికి వర్తింపజేయాలని కోరారు. ఏజెన్సీ, డైలీవేజ్, టూరిజం ప్లాజా ఉద్యోగులకు వేతనాలు పెంచడంతోపాటు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పల్లె నరసింహ, ఉడుత రమేష్, విష్ణు, శ్రీను, తిరుపతి, అజయ్, శ్యామ్, సమ్మయ్య, మౌలాలి, బల్వీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ ఎంఆర్ పిఎస్ ఇంచార్జిగా కొమ్ము రాజశేఖర్ మాదిగ



విశ్వంభర, ఎల్బీనగర్ : ఎల్బీనగర్ నియోజకవర్గం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఇంచార్జిగా కొమ్ము రాజశేఖర్ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా ఎంఆర్ పిఎస్ ఇంచార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ ఈ నియామకాన్ని బుధవారం ప్రకటించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎల్బీనగర్ నియోజకవర్గం ఎంఆర్ పిఎస్ ఇంచార్జిగా నియమితులైన రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ హక్కుల కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. సుదీర్ఘ కాలంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిలో పని చేస్తున్న తనకు కీలకమైన ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించిన మంద కృష్ణ మాదిగకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జనాభా ప్రాతిపదికన మాదిగలకు విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని రాజశేఖర్ ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చట్టసభల్లో కూడా మేమెంత ఉన్నామో మాకు అంతా ప్రాతినిధ్యం అన్ని రాజకీయ పార్టీలు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి విస్తరించడానికి బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

# వరంగల్ మహాసభను విజయవంతం చేయాలి

### సెప్టెంబర్ 9న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ మండల కమిటీల జాతీయ మహాసభ



విశ్వంభర, ఎల్బీనగర్: ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఉద్యమాలను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిపై బలమైన ప్రజా పోరాటాలు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ మండల కమిటీల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని కోరారు.ఎల్‌బీనగర్ నియోజకవర్గం హయత్‌నగర్ మండల కార్యాలయంలో ఎంఆర్‌పీఎస్, అనుబంధ విభాగాల నియోజకవర్గ సమావేశం ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర రవీందర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాగళ్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, అణగారిన వర్గాల ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. మత దురహంకారం, కుల వివక్ష, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని సూచించారు. మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉద్యమకారులపై ఉందన్నారు.దేశంలో కొనసాగుతున్న కుల వ్యవస్థ కారణంగానే మెజారిటీ అణగారిన వర్గాలు పేదరికంలో మగ్గుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ మాజీ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర రవీందర్ , భరత్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు మల్లె పోగు రాజు, హేమంత్, నర్సింగ్ రావు, బి.రాజు, క్రాంతి మాదిగ, సతీష్ , ఈ.చంటి, ఎం.అర్జున్, ఎం.రాజు, ఈ.ప్రశాంత్, ఈ.నాగరాజ్, ఎం.మల్లేష్, కె.లింగయ్య, ఈ.సునీల్, ఎం.వీరన్న, ఎం.వెంకటేష్, ఎం.మహేష్, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ డే సందర్భంగా ఫోటోగ్రాఫర్లకు సన్మానం



విశ్వంభర, హైదరాబాద్: ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ డే 2026 సందర్భంగా హైదరాబాద్ నగరానికి చెందిన పలువురు ఫోటోగ్రాఫర్లను హైదరాబాద్ ఇండియన్ రెడ్‌క్రాస్ యూత్ కన్వీనర్, తెలంగాణ బీజేపీ ఎండోమెంట్ సెల్ జాయింట్ కన్వీనర్ మణిదీప్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగంలో వారి అనుభవాలు, సాంకేతికతలో వస్తున్న మార్పులు, ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై వారితో ఆత్మీయంగా చర్చించారు. సమాజంలోని ముఖ్యమైన సంఘటనలను, విలువైన జ్ఞాపకాలను చిత్రాల రూపంలో భద్రపరుస్తున్న ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని మణిదీప్ పేర్కొన్నారు. ఫోటోగ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ డే శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో వారు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## ఘనంగా రాముని రామ నాదం జన్మదినం



విశ్వంభర, చైతన్య పురి: రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ప్రముఖ వ్యాపారవేత్త రాముని రామ నాదం జన్మదిన సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దాము మహేందర్ యాదవ్ శాలువ కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహేందర్ యాదవ్ మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షిం చారు.

## మాజీ మంత్రులను అడ్డుకోవడం తగదు

విశ్వంభర, హైదరాబాద్: సనత్‌నగర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సందర్శించేందుకు వెళ్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డిని గృహనిర్బంధం చేయడం ప్రభుత్వానికి తగదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నరసింహ అన్నారు. ఈ చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ నెల 17న సనత్‌నగర్‌లో ప్రారంభించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ముందుచూపుతో శ్రీకారం చుట్టారని నరసింహ తెలిపారు. హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అత్యాధునిక వైద్య సేవలు అందించడంతో పాటు ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆస్పత్రులపై పెరుగుతున్న భారాన్ని తగ్గించేందుకు నగరంలో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి గత ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. గచ్చిబౌలి, అల్వాల్, ఎల్‌బీనగర్‌లోని గడ్డి అన్నారం, సనత్‌నగర్‌లోని చెస్ట్ ఆస్పత్రి ప్రాంగణాల్లో ఈ ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారని చెప్పారు. సనత్‌నగర్ ఆస్పత్రి కోసం 53 ఎకరాల మూడు గుంటల స్థలాన్ని కేటాయించి, రూ.1,126 కోట్ల నిధులతో 2022 ఏప్రిల్‌లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ ఆస్పత్రిలో 1,082 పడకలు, 300 అత్యవసర చికిత్స పడకలు, 37 వైద్య విభాగాలు, 16 శస్త్రచికిత్స గదులతో పాటు గుండె మార్పిడి, గుండె వైద్యం, మూత్రపిండాలు, నరాల వైద్యం, అవయవ మార్పిడి, ప్రమాద చికిత్స, కిడ్నీ, కాలేయం, కేన్సర్ చికిత్స, అణు వైద్యం, యంత్ర సహాయక శస్త్రచికిత్స వంటి అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఇంతటి ప్రతిష్ఠాత్మక ఆస్పత్రిని సందర్శించేందుకు మాజీ మంత్రులను అనుమతించకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నరసింహ విమర్శించారు. వరంగల్ ఎంజీఎంతో పాటు మిగిలిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను కూడా త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి



విశ్వంభర, మలక్ పేట్ : హైదరాబాద్ సైదాబాద్‌లో రూ .650 కోట్ల నిధుల తో నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జికి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, మహిళా నాయకురాలు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలనీ తెలంగాణ స్వాభిమాన్ పరిష్యత్ రాష్ట్ర కన్వెనర్ వినయ్ కిషోర్ యాదవ్ డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి ని కలిసి బ్రిడ్జి కి సంగం లక్ష్మీ బాయి పేరు పెట్టాలని వినతిపత్రాన్ని ఇస్తామని తెలిపారు. చంచల్‌గూడ ఫైర్ స్టేషన్ నుంచి సైదాబాద్, ఐ.ఎస్.సదన్ మీదుగా సంతోష్‌నగర్ వరకు నిర్మిస్తున్న ఈ స్టీల్ బ్రిడ్జి పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయి. సంగం లక్ష్మీబాయి ఉమ్మడి హైదరాబాద్ రాష్ట్రంలో కీలక రాజకీయ నాయకురాలిగా సేవలందించారు. 1952లో బాన్సువాడ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, 1954లో ఉప విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం వికారాబాద్ నుంచి రెండుసార్లు, మెదక్ నుంచి ఒకసారి లోక్‌సభకు ఎన్నికై ప్రజలకు సేవలందించారు.సంగం లక్ష్మీబాయి పుట్టినిల్లు ఘట్‌కేసర్ కాగా, మెట్టినిల్లు సైదాబాద్ ప్రాంతం. చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన ఆమె మహిళలు ఎదుర్కొనే సమస్యలపై పోరాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళా ఖైదీల కోసం ప్రత్యేక జైలు ఉండాలని డిమాండ్ చేసిన మహిళా నాయకురాలిగా గుర్తింపు పొందారు.మహిళల కోసం ఇందిరా సేవా సదన్ పేరుతో వసతి గృహాన్ని ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతానికి ఐ.ఎస్.సదన్ అనే పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది. సైదాబాద్ పరిసరాల్లో విద్యా సదుపాయాలు లేని సమయంలో పాఠశాలలను ఏర్పాటు చేసి, తనకు ఉన్న భూమిలో సుమారు 60 ఎకరాలను విద్యాభివృద్ధికి వినియోగించారు. ఇలాంటి మహనీయురాలి పేరు స్టీల్ బ్రిడ్జికి పెట్టాలని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ రాష్ట్ర కన్వెనర్ వినయ్ కిషోర్ యాదవ్ డిమాండ్ చేస్తున్నారు. మాజీ గవర్నర్ బీజేపీ నేత బండారు దత్తాత్రేయ, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హెచ్. హనుమంతరావు సైతం పార్టీలకు అతీతంగా సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలని కోరుతున్నారు.

## హస్తినాపురంలో మురుగు పరుగు

విశ్వంభర, హస్తినాపురం : హస్తినాపురం డివిజన్ న్యూ వెంకట రమణ కాలనీ రోడ్ నెంబర్ 12 రవీంద్ర భారతి పాఠశాల ముందు గత కొంత కాలం నుండి డ్రైనేజ్ పొంగి పొర్లుతుంది. పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కూడా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు అని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరుకుంటున్నారు.



## విద్యార్థులకు నూతన దుస్తులు అందజేత




విశ్వంభర, మలక్ పేట్: దారుల్ షిఫా ప్రభుత్వ ప్రాథమిక బాలుర అంధుల పాఠశాలలో విద్యార్థులకు నూతన దుస్తులను బహుదూర్పురా డిప్యూటీ ఈవో సుమన్ , డిప్యూటీ ఐఓఎస్ యాదగిరి లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇంచార్జ్ సద్గుణ , ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్ రెడ్డి లు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



విశ్వంభర, హైదరాబాద్: గాంధీభవన్ (ఇందిరాభవన్) లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సహకార కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు, అవసరాలు, అభ్యర్థనలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని గూడూరు శ్రీనివాస్ అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తుందనే నమ్మకం ప్రజల్లో ఏర్పడుతోందని గూడూరు శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలతో ముఖాముఖి ఫిర్యాదుల విభాగం ఇన్‌చార్జీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లంకను చిత్తు చేసిన టీమిండియా..



## కోహ్లీ సలహాతోనే నా ఆలోచనా విధానం మారింది: పీవీ సింధు


**విశ్వంభర, స్పోర్ట్స్:** భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీతో తనకు సోదర అనుబంధం ఉందని మరోసారి తెలుగు షట్లర్ పీవీ సింధు తెలిపింది. తాజాగా ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో సింధు మాట్లాడుతూ.. విరాట్ ఇచ్చిన సలహాతోనే తన ఆలోచనా విధానం మారిందని గుర్తు చేసుకుంది. ప్రస్తుతం పీవీ సింధు బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ బరిలోకి దిగింది. ఇప్పటికే తొలి రౌండ్‌లో అద్భుత విజయం సాధించింది."నాకు విరాట్ కోహ్లీ సోదరుడిలాంటి వారు. ఎందుకంటే నేను క్లిష్టమైన స్థితిలో ఉన్నప్పుడు ఆయనను కలిసిన సందర్భం నాకు గుర్తుంది. కోహ్లీ చాలా ఓదార్పుగా మాట్లాడారు. 'ఇప్పుడేమైంది? నీ గేమ్ నువ్వు ఆడు. ఆటోమేటిగ్గా ఫలితాలు అనుకూలంగా రావడం మొదలవుతాయి. నీ సత్తా ఏంటో నీకు తెలుసు. చాలా బాగా ట్రైనింగ్ అయిన అథ్లెట్‌వి. ప్రపంచానికి మరోసారి చాటిచెప్పు' అని స్ఫూర్తి నింపారు. ఆ సంభాషణ తర్వాత నా ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయింది. నేను విజయం సాధించిన ప్రతిసారి కోహ్లీతో పంచుకున్నా. ఎప్పుడు కలిసినా చాలా సంతోషంగా అనిపించేది. జీవితంలో ఎంతో సాధించిన గొప్ప వ్యక్తి నుంచి వచ్చే సూచనలు కూడా చాలా విలువైనవి" అని సింధు తెలిపింది.

## గాలె సూపర్ హీరో మానవ్ సుతార్.. ఆ రికార్డులు బ్రేక్!



**విశ్వంభర, స్పోర్ట్స్:** శ్రీలంకతో తొలి టెస్టులో అదరగొట్టి భారత్‌కు కీలక విజయాన్నందించాడు స్పిన్నర్ మానవ్ సుతార్. ఇటీవల అఫ్గానిస్థాన్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఈ యువ స్పిన్నర్ తొలి మ్యాచ్‌లోనే ఏడు వికెట్లు పడగొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు. 24 ఏళ్ల సుతార్ .. ఇప్పుడు శ్రీలంక పర్యటనలోనూ ఇరగదీస్తున్నాడు. గాలెలో లంకతో జరిగిన తొలి టెస్టులో ఏకంగా 10 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక అత్యంత అనుభవజ్ఞుడైన బ్యాటర్ దినేశ్ చండీమల్ వికెట్ సహా అద్భుత (4/76) ప్రదర్శన చేశాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో (6/55) చెలరేగిపోయాడు. మొదట్లో రెండు వికెట్లు పడగొట్టిన సుతార్.. తన చివరి 10 బంతుల్లో నాలుగు వికెట్లు తీసి మ్యాచ్‌ను ముగించేశాడు. దీంతో మొత్తం మీద మ్యాచ్‌లో (10/131) పది వికెట్ల ఘనత అందుకున్నాడు. దీంతో హర్భజన్ సింగ్, అశ్విన్‌లను అధిగమించి శ్రీలంకలో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలతో 10 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా మానవ్ సుతార్ నిలిచాడు. అంతేకాదు భజ్జీ, అశ్విన్ తర్వాత శ్రీలంకలో 10 వికెట్ల ప్రదర్శన చేసిన మూడో భారత బౌలర్‌గా ఘనత సాధించాడు. ఈ ముగ్గురూ గాలెలోనే ఈ ఘనత సాధించడం విశేషం. హర్భజన్ 2008లో (10/153), 2015లో అశ్విన్ (10/150) పది వికెట్ల ప్రదర్శన చేశారు.

## హాకీ ప్రపంచ కప్‌లో పాకిస్థాన్‌పై భారత్ విజయం



**విశ్వంభర, నెదర్లాండ్స్:** హాకీ ప్రపంచకప్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన పూల్ డి మ్యాచ్‌లో భారత్ 5-3 తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించగా.. పాక్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. హర్మన్‌ప్రీత్, అభిషేక్ చెరో రెండు గోల్స్ కొట్టి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించారు. తొలి అర్ధ భాగంలో భారత్ నాలుగు గోల్స్‌తో అదరగొట్టగా.. పాక్ రెండు గోల్స్ చేసింది. రెండో అర్ధ భాగంలో ఇరుజట్లు చెరో గోల్ మాత్రమే చేశాయి. మ్యాచ్ ప్రారంభమైన 5వ నిమిషంలో హర్మన్‌ప్రీత్.. 11వ నిమిషంలో అభిషేక్ గోల్ చేశారు. రెండో క్వార్టర్‌లో హర్మన్‌ప్రీత్ (21వ), అభిషేక్ (24వ)మళ్లీ చెరో గోల్ కొట్టారు. మూడో క్వార్టర్‌లో హార్దిక్ సింగ్ (35వ నిమిషం) గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం మరింత పెరిగింది. పాక్ తరఫున హన్నన్ షాహిద్ (22వ, 46వ), సుఫ్యాన్ ఖాన్ (24వ) గోల్స్ సాధించారు. ఆఖరి క్వార్టర్‌లో ప్రత్యర్థి జట్టు ఒత్తిడి పెంచడంతో మ్యాచ్ ఉత్కంఠభరింతగా మారింది. కానీ, భారత్ సంయమనం కోల్పోకుండా రెండు గోల్స్ ఆధిక్యాన్ని కాపాడుకుని విజయం సాధించింది.





## బౌలింగ్‌లో మానవ్ సుతార్ మెరుపులు

**విశ్వంభర, స్పోర్ట్స్:** గాలే ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు 165 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన టీమిండియా, రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అందుకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 462 పరుగుల భారీ స్కోరు సాధించింది. దేవదత్ పడిక్కల్ 167 పరుగులతో అద్భుతమైన సెంచరీ చేయగా, కేఎల్ రాహుల్ (82), ధ్రువ్ జురెల్ (51) అర్ధసెంచరీలతో రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక, భారత బౌలర్ల ధాటికి 284 పరుగులకే ఆలౌటైంది. శ్రీలంక బ్యాటర్లలో సోనాల్ దినుషా (100) సెంచరీతో పోరాడగా, భారత బౌలర్ మానవ్ సుతార్ 4 వికెట్లు పడగొట్టాడు. 178 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్, రిషభ్ పంత్ (66), దేవదత్ పడిక్కల్ (44) మెరుపులతో 193 పరుగులు చేసి ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో అసిథ ఫెర్నాందో 4 వికెట్లు సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌లో పంత్ వేగంగా పరుగులు సాధించడంతో పాటు టెస్టుల్లో తన 100వ సిక్సర్‌ను పూర్తి చేసుకుని రికార్డు సృష్టించాడు. మొత్తంగా 372 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకే కుప్పకూలింది. యంగ్ స్పిన్నర్ మానవ్ సుతార్ 55 పరుగులు ఇచ్చిన 6 వికెట్ల అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శన చేసి మ్యాచ్ మొత్తంలో 10 వికెట్లు పడగొట్టాడు. శ్రీలంక ఇన్నింగ్స్‌లో సోనాల్ దినుషా (84), ధనంజయ డిసిల్వా (59) కొద్దిసేపు నిరోధించినప్పటికీ ఓటమి నుంచి తప్పించలేకపోయారు.

## టెస్టు విజయాలు అంత సులభంగా రావు: శుభ్‌మన్ గిల్



**విశ్వంభర, స్పోర్ట్స్:** శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టీమ్ఇండియా ఐదో స్థానంలోనే కొనసాగుతున్నప్పటికీ.. విజయాల శాతాన్ని 53.33కి పెంచుకుంది. ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఇంకా ఎనిమిది మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో ఆరు మ్యాచ్‌లు గెలిస్తే భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడానికి మెరుగైన అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో శ్రీలంకతో మ్యాచ్ అనంతరం భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆట సాగిన తీరు, డబ్ల్యూటీసీ గురించి మాట్లాడాడు. "ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరడం మా అంతిమ లక్ష్యం. టెస్టు విజయాలు అంత సులభంగా రావు. ఈ గెలుపు ఎంతో ఆనందాన్నిచ్చింది. మాకు ఇది ఎంతో సంతృప్తికరమైన విజయం. మేము ఈ మ్యాచ్‌లో మెరుగైన స్థితిలోనే ఉన్నప్పటికీ వాతావరణ పరిస్థితుల (వర్షం వల్ల) కారణంగా మ్యాచ్ కొనసాగుతుందో లేదోనన్న ఆందోళన కలిగింది. కానీ, మా బౌలర్లు మ్యాచ్‌ను వేగంగా ముగించారు" అని గిల్ పేర్కొన్నాడు. లంకతో తొలి టెస్టులో 10 వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించిన యువ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్‌పై శుభ్‌మన్ ప్రశంసలు కురిపించాడు. సుతార్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడని, చాలా మంచి భవిష్యత్తు ఉన్న ఆటగాడిగా కనిపిస్తున్నాడని పేర్కొన్నాడు. అతను చాలాకాలంపాటు భారత్‌కు ఆడగలడని విశ్వాసం వ్యక్తం చేశాడు. సెంచరీ హీరో, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దేవదత్ పడిక్కల్‌ను కూడా గిల్ ప్రశంసించాడు."అతని ఆట చూడముచ్చటగా ఉంది. సెంచరీలు సాధించడం ముఖ్యమే. కానీ కేవలం సెంచరీతోనే ఆగిపోకుండా అతను భారీ స్కోరు చేశాడు. పడిక్కల్ అక్కడితో సంతృప్తి చెందలేదు. రెండో ఇన్నింగ్స్‌లోనూ రాణించాడు. అతను బ్యాటింగ్ చేసిన తీరు, ఆధిపత్యం ప్రదర్శించిన విధానం చూడటానికి చాలా బాగుంది" అని భారత కెప్టెన్ విశ్లేషించాడు.

## ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్.. ప్రీక్వార్టర్స్‌కు సింధు, ఆయుష్ శెట్టి



**విశ్వంభర, ఢిల్లీ:** ఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు పి.వి.సింధు, ఆయుష్ శెట్టి ప్రీక్వార్టర్స్‌కు చేరారు. లక్ష్యసేన్, ఉన్నతి హుడాలకు చుక్కెదురైంది. మహిళల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో సింధు 21-16, 21-17 తేడాతో వెన్ యు జాంగ్ (కెనడా)ను మట్టికరిపించింది. ప్రీక్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్ 3 వాంగ్ జీ యీతో సింధు తలపడనుంది. ఇక, పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి 21-8, 21-10 తేడాతో దుమిందు అబేవిక్రమ (శ్రీలంక)పై విజయం సాధించి రౌండ్ ఆఫ్ 16కు దూసుకెళ్లాడు. మరోవైపు, పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్‌ను గారెట్ టాన్ (అమెరికా) ఓడించాడు. 21-19తో తొలి గేమ్‌ను లక్ష్యసేన్ గెల్చుకోగా.. రెండో గేమ్‌ను 17-21 తేడాతో అమెరికా షట్లర్ సొంతం చేసుకున్నాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో లక్ష్యసేన్ 17-21తో పోరాడి ఓడాడు. మహిళల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో యువ షట్లర్ ఉన్నతి హుడా కూడా పోరాడి ఓడింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 21-9, 11-21, 21-23తో మిచెల్ లీ (కెనడా) చేతిలో పరాజయం చవిచూసింది. పురుషుల డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్-హరిహరన్ జంటకు చుక్కెదురైంది. రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో దక్షిణ కొరియా జంట కాంగ్ మిన్-హ్యుక్-కి డాంగ్-జు చేతిలో 17-21, 14-21 తేడాతో ఓటమి చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్ జోడీ తనీషా క్రాస్టో-ధృవ్ కపిల తమ రెండో రౌండ్ మ్యాచ్‌లో విజయం సాధించి ప్రీక్వార్టర్‌కు చేరుకున్నారు. భారత ద్వయం రౌండ్ ఆఫ్ 32 పోరులో 21-11, 21-11 తేడాతో మకావు జోడీ యోంగ్ ఐయోక్-ఎన్జి వెంగ్‌ని చిత్తు చేసింది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జోడీ కోర్టులోకి అడుగుపెట్టకుండానే రౌండ్ ఆఫ్ 16కు చేరింది. తొలి రౌండ్లో ఈ భారత జంటకు బై లభించగా.. రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో అలెగ్జాండర్ డన్, ఆడమ్ ప్రింగిల్ (స్కాట్లాండ్) తలపడాల్సి ఉండగా.. చివరి క్షణంలో స్కాటిష్ జంట వైదొలగడంతో సాత్విక్-చిరాగ్ ద్వయం తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది.

## ఏడో రోజూ నష్టాల్లో నిఫ్టీ.. 24,100 దిగువకు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, ఇతర మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సూచీలు నష్టపోయాయి. దీంతో నిఫ్టీ వరుసగా ఏడో రోజూ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 77,218.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,235.46) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లో కొనసాగిన సూచీ.. ఓ దశలో 76,822.89 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 325.78 పాయింట్ల నష్టంతో 76,909.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 76.60 పాయింట్ల నష్టంతో 24,078 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.75గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, సన్‌ఫార్మా, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91 డాలర్ల స్థాయికి చేరగా.. బంగారం ఔన్సు ధర 4,368 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## మరోసారి ధరల పెంపు.. హ్యుందాయ్ కార్లు మరింత ప్రియం




**విశ్వంభర, బిజినెస్:** ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ హ్యుందాయ్ మోటార్ ఇండియా మరోసారి కార్ల ధరలను పెంచింది. తన పోర్ట్‌ఫోలియోలోని అన్ని వేరియంట్లపై 1 శాతం వరకు ధరల పెంపు చేపట్టింది. సెప్టెంబర్ నుంచి కొత్త ధరలు అందుబాటులోకి రానున్నట్లు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ పేర్కొంది. భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా ముడిసరకుల ధరలు పెరగడంతో కార్యకలాపాల వ్యయం భారంగా మారిందని కంపెనీ తెలిపింది.'పెరుగుతున్న వ్యయ భారాన్ని భరించడానికి కంపెనీ ప్రయత్నిస్తూనే ఉంది. ముడిసరుకుల ధరల ఒత్తిళ్ల కారణంగా ఖర్చుల్లో కొంత భాగాన్ని కస్టమర్లకు బదిలీ చేయాల్సి వచ్చింది' అని కంపెనీ పేర్కొంది. ఈ ఏడాదిలో హ్యుందాయ్ కంపెనీ కార్ల ధరలు పెంచడం ఇది మూడోసారి. జనవరిలో 0.6 శాతం, ఏప్రిల్‌లో 1 శాతం మేర పెంపు చేపట్టింది. మారుతీ సుజుకీ, టాటా మోటార్ ప్యాసింజర్ కంపెనీలు కూడా ఇప్పటికే వాహన ధరలను పెంచిన సంగతి తెలిసిందే.



## సిమ్ కార్డు రూల్స్ కఠినతరం.. ఫొటో చెక్ తప్పనిసరి

**విశ్వంభర, బిజినెస్:** సిమ్ కార్డుల నిబంధనలను టెలికాం విభాగం కఠినతరం చేసింది . నిర్ణీత పరిమితి దాటి సిమ్ కార్డులు తీసుకున్న చందాదారుల ఫొటోలను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు పేర్కొంది. కొత్త సిమ్ కార్డులను వినియోగదారులకు ఇచ్చే ముందు ఆ డేటాతో సరిపోల్చుకోవాలని టెలికాం ఆపరేటర్లను ఆదేశించింది. ఈ మేరకు ఆగస్టు 17న ఓ సర్క్యులర్ విడుదల చేసింది. డిజిటల్ స్కామ్‌లను అరికట్టడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది.నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి దేశంలోని అన్ని సర్కిళ్లలో అన్ని టెలికాం విభాగాలకు సంబంధించి గరిష్ఠంగా 9 సిమ్ కార్డులను మాత్రమే కలిగి ఉండాలి. పరిమితి దాటిన చందాదారుల ఫొటోలను డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్లో అప్‌డేట్ చేస్తామని టెలికాం విభాగం పేర్కొంది. ఆగస్టు 23 నుంచి ఇది అందుబాటులోకి రానుంది. ఆగస్టు 24 నుంచి డీఐపీ వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు టెలికాం కంపెనీలు అప్‌డేట్ చేసుకోవాలని ఆదేశించింది. కొత్త సిమ్ కార్డులు కస్టమర్లకు ఇచ్చే ముందు వారి ఫొటోలను ఈ డేటాతో సరిపోల్చుకోవాలని సూచించింది. పరిమితి దాటిన వినియోగదారులకు కొత్త సిమ్ కార్డుల మంజూరును తిరస్కరిస్తారు. నవంబర్ 30 నాటికి ఈ ప్రక్రియను రియల్ టైమ్‌లో అమల్లోకి తీసుకురావాలని ఆదేశించింది. పరిమితి దాటిన అదనపు సిమ్ కార్డులను వినియోగదారులు స్వచ్ఛందంగా వదులుకోవాలని, లేదంటే సంబంధిత టెలికాం కంపెనీలే వాటిని డీయాక్టివేట్ చేస్తాయని టెలికాం విభాగం పేర్కొంది. సబ్‌స్క్రైబర్లు తమ పేరిట ఎన్ని సిమ్‌లు ఉన్నాయో సంచార్ సాథీ పోర్టల్ ద్వారా తనిఖీ చేసుకునే వెసులుబాటు ఉంది.

## జూలైలో 13 శాతం పెరిగిన చమురు దిగుమతులు



**విశ్వంభర, బిజినెస్ బ్యూరో:** భారత్‌లో ఇంధన డిమాండ్ పెరగడంతో జూలైలో ముడి చమురు దిగుమతులు గణనీయంగా పెరిగాయి. బుధవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం, జూన్‌తో పోలిస్తే జూలైలో ముడి చమురు దిగుమతులు 9 శాతానికి పైగా పెరిగి 21.41 మిలియన్(2.1 కోట్ల) మెట్రిక్ టన్నులకు చేరాయి. ఏడాది క్రితం జూలైలో నమోదైన 1.88 కోట్ల టన్నులతో పోలిస్తే దిగుమతులు 13 శాతం పెరిగాయి. ఇదే సమయంలో దేశీయ ఇంధన వినియోగం నెలవారీగా దాదాపు 3 శాతం పెరిగి 1.99 కోట్ల మెట్రిక్ టన్నులకు చేరింది. మార్చి తర్వాత ఇదే అత్యధిక వినియోగ స్థాయి కావడం దేశంలో ఇంధన డిమాండ్ పెరుగుతున్న సంకేతాన్ని ఇస్తోంది. మరోవైపు, చమురు ఉత్పత్తుల దిగుమతులు జూన్‌లోని 25.3 లక్షల టన్నుల నుంచి జూలైలో సుమారు 2 శాతం తగ్గి 24.8 లక్షల టన్నులకు చేరాయి. ఏడాది క్రితంతో పోలిస్తే ఈ దిగుమతులు 40 శాతానికి పైగా పడిపోయాయి. దీనికి విరుద్ధంగా, చమురు ఉత్పత్తుల ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 8 శాతానికి పైగా పెరిగి 50.3 లక్షల టన్నులకు చేరాయి. ఎల్పీజీ దిగుమతులు కూడా జూన్‌లోని 10.2 లక్షల టన్నుల నుంచి జూలైలో 8.7 లక్షల టన్నులకు తగ్గాయి. జూలై గణాంకాలు దేశీయ ఇంధన వినియోగం బలపడటంతో ముడి చమురు దిగుమతులు పెరిగినట్లు చూపిస్తున్నాయి. అయితే రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తుల్లో దిగుమతులు తగ్గుతూ, పెట్రోల్-డీజిల్ వంటి కీలక ఉత్పత్తుల ఎగుమతులు మాత్రం పెరగడం భారత్ రిఫైనింగ్ సామర్థ్యానికి సంకేతంగా కనిపిస్తోంది.

## అమాంతం పెరిగిన వివో, శాంసంగ్ స్మార్ట్‌ఫోన్ ధరలు

**విశ్వంభర, బిజినెస్:** ప్రముఖ మొబైల్ కంపెనీలు మెమొరీ చిప్‌ల ధరలు పెరగడంతో తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. శాంసంగ్ కంపెనీ తన ఎస్25 సిరీస్ ధరలను రూ.12 వేల వరకు పెంచింది. మరో కంపెనీ వివో ఇటీవల వై సిరీస్ ధరలను రూ 4 వేల వరకు పెంచగా.. తాజా టీ సిరీస్ స్మార్ట్‌ఫోన్ ధరలను ఏకంగా రూ. 7 వేల వరకు పెంపు చేపట్టింది. సవరించిన ధరలు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి.

**రూ.12 వేల వరకు పెరిగిన శాంసంగ్ ఎస్25..**

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ శాంసంగ్ మరోసారి ధరల పెంపు చేపట్టింది. గెలాక్సీ ఎస్25 సిరీస్‌లను రూ.12 వేల వరకు పెంపు చేపట్టింది. సవరించిన ధరలు నేటి నుంచే అమల్లోకి వచ్చాయి. 12జీబీ/256జీబీ వేరియంట్ ధర రూ.80,999 ఉండగా.. రూ. 4 వేలు పెంచింది. దీంతో రూ.84,999కు చేరింది. 12జీబీ/512జీబీ వేరియంట్ ధర రూ.92,999 నుంచి 1,03,999కు సవరించింది. గరిష్ఠంగా రూ.12 వేల పెంపు చేపట్టడం గమనార్హం.

**వివో టీ5 ప్రో స్మార్ట్‌ఫోన్ ధరలు పెంపు..**

వివో టీ5 ప్రో స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.7 వేల వరకు సవరించింది. 8జీబీం128జీబీ బేస్ వేరియంట్ ధర రూ.6 వేలు పెరిగి రూ.41,999కు చేరింది. 8జీబీం256జీబీ వేరియంట్‌పై రూ.7 వేలు పెరగడంతో రూ.46,999కు సవరించింది. 12జీబీ ం 256జీబీ వేరియంట్ ధర రూ. 69,999గా ఉంది.



ప్రజా విశ్వంభర
V3 NEWS



# భయాన్ని పక్కన పెట్టి అలవాటు లేని పనులు ధైర్యంగా చేయడం నేర్చుకున్నా

కన్నడ స్టార్ హీరో యష్, కియారా అద్వానీ జంటగా నటిస్తున్న లేటెస్ట్ సినిమా 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ నుంచి మేకర్స్ విడుదల చేసిన ట్రైలర్, పాటలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. మరీ ముఖ్యంగా కియారాపై దారుణంగా కామెంట్లు పెట్టారు నెటిజన్లు. ఇక ఈ విషయంపై కియారా సైలెంట్‌గా ఉన్నప్పటికీ యష్ మాత్రం ఎన్నోసార్లు రియాక్ట్ అయి ట్రోలర్స్‌కు తనదైన శైలిలో స్ట్రాంగ్ కౌంటర్లు ఇచ్చారు. ఇదిలా ఉంటే.. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆగస్ట్ 26న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, కియారా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ కీలక పోస్ట్ షేర్ చేశారు. 'టాక్సిక్'లో నటించడం తనకు ఒక కొత్త అనుభవమని, భయాన్ని పక్కన పెట్టి కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఈ సినిమా ఎంతగానో ఉపయోగపడిందని కియారా చెప్పారు. షూటింగ్ సమయంలో నీళ్లతో నిండిన ఒక పెద్ద ప్లాస్టిక్ ట్యాంక్‌లో ఉన్న ఫోటోను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. సినిమాలు మనల్ని ఎప్పుడూ ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయని కియారా చెప్పారు. ప్రతీ కొత్త పాత్ర, ప్రతీ కొత్త ఛాలెంజ్ మనం ఏమేం చేయగలమో మనకే తెలిసేలా చేస్తుందని అన్నారు. కొంచెం భయం అనిపించినా సరే ధైర్యంగా ముందుకెళ్లినప్పుడే జీవితంలో ఎదుగుదల ఉంటుందని చెప్పారు. అలవాటు లేని కొత్త విషయాలను కూడా స్వీకరిస్తూ ప్రశాంతంగా ఉండటం ఈ సినిమా తనకు నేర్పిందని కియారా తెలిపారు. దాదాపు రూ. 500 నుంచి 1000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో కియారాతో పాటు నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కూడా నటిస్తున్నారు. అండర్‌వరల్డ్ నేర ప్రపంచంలో రాయ అనే గ్యాంగ్‌స్టర్ కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది.



# అనుకున్న సమయానికే ప్రభాస్ 'స్పిరిట్'

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' . ఈ సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది.ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట్' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. ''స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పూ లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని క్లారిటీ ఇచ్చింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రీ కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



# చాలామంది కేవలం ఐటమ్ సాంగ్స్ కోసమే సంప్రదిస్తున్నారు

వెండితెరపై తన గ్లామర్‌తో కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తించే మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా, ఒకవైపు హీరోయిన్‌గా నటిస్తూనే మరోవైపు స్పెషల్ సాంగ్స్‌తో బాక్సాఫీసును షేక్ చేస్తున్నారు. ప్రస్తుతం వ్యన్, రేంజర్, రాగిణి3, నో ఎంట్రీ 2, ఓదెల2 వంటి వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో సినీ పరిశ్రమపై, దర్శకుల ఆలోచనా విధానంపై తమన్నా సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను చాలామంది కేవలం ఐటమ్ సాంగ్స్ కోసమే సంప్రదిస్తున్నారని తమన్నా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు సవాలుతో కూడిన, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు చేయాలని ఎంతో ఆసక్తి ఉందని తెలిపారు. కానీ ఇండస్ట్రీలో చాలామంది దర్శకులు తనను కేవలం సెక్సీ ఇమేజ్‌కే పరిమితం చేస్తున్నారని, నటిగా తనలోని పూర్తి ప్రతిభను చూపించడానికి తగిన అవకాశాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన గ్లామర్ ఇమేజ్‌ను పక్కనపెట్టి, ఒక నటిగా గుర్తించే పవర్‌ఫుల్ క్యారెక్టర్లు ఇవ్వాలని కోరారు. అలాగే మారిన నేటి సినిమా ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. కాలంతో పాటు సినిమాలు కూడా మారుతున్నాయని, కథ డిమాండ్ చేసినప్పుడు వచ్చే ముద్దు లేదా రొమాంటిక్ సన్నివేశాలను విడిగా చూపిస్తూ తప్పుగా అంచనా వేయకూడదని అన్నారు. కథలో భాగమైన విషయాలను అంతే సహజంగా చూడాలని అభిప్రాయపడ్డారు. నటిగా అభిప్రాయాలను ధైర్యంగా బయటపెట్టిన తమన్నా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.



# 'రాకా'.. కీలక పాత్రలో హాలీవుడ్ నటుడు?

అగ్ర నటుడు అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ బడ్జెట్ మూవీ 'రాకా' . హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మేకర్స్ గతేడాది నుంచి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అలాగే, షారుక్ ఖాన్ కూడా 'రాకా'లో భాగమేనని టాక్. విల్ స్మిత్, షారుక్, అల్లు అర్జున్ ఒకే ఫ్రేమ్‌లో వస్తే 'రాకా' భారీ సెన్సేషన్ మూవీ కావడం ఖాయమే. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పలు భాషల్లో 2027లో విడుదల చేయనున్నారు.



# ఈడీ విచారణకు హాజరైన నిధి అగర్వాల్..

నటి నిధి అగర్వాల్ బుధవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. హవాలా ద్వారా డబ్బులు తీసుకున్నట్లు నిధిపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో విచారణకు రావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆమె నేడు హైదరాబాద్‌లో దర్యాప్తు సంస్థ కార్యాలయానికి వెళ్లారు. బెట్టింగ్ యాప్‌ల నుంచి తీసుకున్న పారితోషికం, కమీషన్లపై ఈడీ అధికారులు నిధిని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో నటులు ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, రానా, మంచు లక్ష్మిలను ఈడీ అధికారులు ప్రశ్నించారు.



# బ్రేకప్ స్టోరీతో వార్తల్లో నిలుస్తున్న అనుపమ..

కోలీవుడ్ దిగ్గజ దర్శకుడు శంకర్ వారసురాలిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఎంట్రీ ఇచ్చిన అదితి శంకర్.. నటనతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకుంది. తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు.. త్వరలో 'వన్స్ మోర్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవతున్నది. విఘ్నేష్ శ్రీకాంత్ దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ డ్రామా ఆగస్టు 28న థియేటర్‌లోకి రానుంది. ఈ సంరద్భంగా తాజాగా ప్రమోషన్స్ పాల్గొన్న అదితి శంకర్.. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఇటీవలే వెల్లడించిన బ్రేకప్, ఎమోషనల్ స్టోరీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇటీవలే నా తోటి నటి అనుపమ ఇచ్చిన ఇంటర్వ్యూ చూశాను. దీనిపై ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉండవచ్చు. కానీ, తన సొంత కథను ధైర్యంగా పంచుకున్నందుకు ఆమెకు హాట్సాఫ్ చెప్పాలి. అందులో నిజాయితీ ఉంది. ఎవరినీ కించపరచాలనేది ఆమె ఉద్దేశం కాదని భావిస్తున్నాను. ఆమె పంచుకున్న అనుభవం చాలామందికి అవగాహన కలిగిస్తుంది. ఎందుకంటే, ఎంతోమంది స్త్రీలు, పురుషులు తమ జీవితాల్లో ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటూ, తమకు ఏం జరుగుతోందో కూడా గ్రహించలేకపోతున్నారు' అని తన అభిప్రాయాన్ని పంచుకుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com